www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
01-12-2024
సంపుటి : 01 | సంచిక : 209 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్





## డిసెంబర్ 5న మహారాష్ట్ర సీఎం ప్రమాణస్వీకారం

- ముహూర్తం ఖరారైనట్లు వెల్లడించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్
- మహాయుతి కూటమి అధిష్ఠానం ఎవరిని ముఖ్యమంత్రిగా ఖరారు చేస్తుందోనని ఉత్కంఠ
- రేసులో దేవేంద్ర ఫడ్నవీస్, మురళీధర్ మోహోల్



**ముంబయి:** మహారాష్ట్ర సీఎం ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. డిసెంబర్ 5న సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుందని బీజేపీ వెల్లడించింది. ముంబయిలోని ఆజాద్ మైదానంలో సీఎంతోపాటు పలువురు మంత్రులు ప్రమాణం చేయనున్నారు. ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ‘‘ మహారాష్ట్ర మిగతా2లో...





## మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు

### రైతుల కోసం రూ. 54 వేల కోట్లు ఖర్చుచేశాం

ఇప్పటివరకు కర్షకులను ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలే

దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఇంత రుణమాఫీచేశారా?

మహబూబ్‌నగర్ రైతు పండుగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, మహబూబ్‌నగర్:**

మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దని పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 70 ఏళ్ల తర్వాత వచ్చిన అవకాశాన్ని పోగొట్టుకోవద్దని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన ‘రైతు పండుగ’ సభలో మిగతా2లో...

### కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా దక్కించుకోవాలి

- ట్రైబ్యునల్ ఎదుట సమర్థ వాదనలు వినిపించాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

2

## 2 లక్షల ఉద్యోగాలన్నారు.. ఎలాంటి నోటిఫికేషన్లు లేవు

- రుణమాఫీ కూడా అరకొరే
- రాష్ట్రంలో బీజేపీకి మంచి భవిష్యత్తు ఉంది
- ప్రజల తరఫున ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతాం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



2

## ఆ నియామకాలు చెల్లవు

- జీవో 1207 చట్ట విరుద్ధం
- మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లపై హైకోర్టు తీర్పు



2

## గత ప్రభుత్వం మూలన పడేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

### తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్లు, నియామకాల కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, మహబూబ్‌నగర్:** తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నదే నీళ్లు, యువతకు ఉద్యోగాల కోసమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రైతుల కోసం చేసిందేమీ లేదన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ గతంలో మిగతా2లో...



## జేబులు గుల్ల చేస్తున్న బెనిఫిట్ షోలు

### ఫ్యాన్స్ క్రేజ్.. నిర్వాహకులకు క్యాష్

- అభిమానాన్ని దండుకుంటున్న థియేటర్ యజమానులు
- ‘పుష్ప2’ టికెట్ ధరల పెంపు.. బెనిఫిట్ షోలకూ అనుమతి
- ఆరు భాషల్లో 12 వేలకిపైగా థియేటర్లలో విడుదల
- అత్యధిక థియేటర్లలో ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతున్న భారతీయ చిత్రం

**విశ్వంభర, హైదరాబాద్:**

ఫ్యాన్స్ షో, బెనిఫిట్ షోల పేరుతో మేకర్స్, ఆయా నిర్వాహకులు అభిమానుల క్రేజ్‌ని క్యాష్ చేసుకుంటున్నారా? ప్రీమియర్స్‌తో జేబులు నింపుకుంటున్నారా? అంటే అవుననే మాట వినిపిస్తుంది. అగ్ర హీరోల సినిమాలంటే మిడ్‌నైట్ ఫ్యాన్స్ షో, బెనిఫిట్ షోలు వేయడం అనేది చాలాకాలంగా ఉన్న పద్ధతి. తమ అభిమాన మిగతా2లో...





## టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా బుర్రా వెంకటేశం

### నియామక ఫైల్‌పై గవర్నర్ సంతకం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియమితులు కానున్నారు. బుర్రా వెంకటేశం నియామక ఫైల్‌పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేశారు. ఈ మేరకు రెండ్రోజుల్లో ఉత్తర్వులు మిగతా2లో...

## రాష్ట్రంలో అత్యుత్తమ ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకొచ్చాం



- సమ్మిళిత అభివృద్ధికి కృషి చేస్తున్నాం
- ఎన్ని సవాళ్లువచ్చినా అధిగమిస్తున్నాం
- బలహీనవర్గాల పారిశ్రామికవేత్తల కోసం బిక్కి ఏర్పాటు అభినందనీయం
- మంత్రి శ్రీధర్‌బాబు

**విశ్వంభర, హైదరాబాద్:** బలహీన వర్గాలకు చెందిన పారిశ్రామికవేత్తల కోసం బిక్కి ఏర్పాటు అభినందనీయమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో టీహబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. ‘‘మా ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతోంది. అత్యుత్తమ ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకొచ్చాం. విధానాలను ఆచరణలో పెట్టడమే పెద్ద సవాల్. సమ్మిళిత అభివృద్ధి కోసమే మా ప్రభుత్వం కృషి చేస్తోంది. 50 శాతానికి పైగా మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 95 | ₹ 117 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 170 | ₹ 193 |

## పేరుకే పండుగ..అంతా దండుగ



- రైతు పండుగ పేరుతో మరోసారి మోసం
- రాష్ట్ర రైతాంగాన్ని ఉసూరుమనిపించింది
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

2



## ఫెంగల్ ప్రభావంతో భారీ వర్షాలు

హైదరాబాద్ నుంచి విమానాలు బంద్

2

## త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్

### అన్ని రాజకీయ పార్టీలవారు ఆక్రమణల్లో ఉన్నారు

ఆక్రమించే వారిలో సంపన్నులే ఎక్కువ

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఎవరినీ వదలం

హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిలో పేదల కంటే ధనవంతులు, సంపన్నులే ఎక్కువగా కనిపిస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యాఖ్యానించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు కూడా ఆక్రమ-ణదారుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థ-లాలను ఆక్రమిస్తే ఎవరిని ఉపేక్షించేదని లేదని రంగనాథ్ హెచ్చరించారు. బేగంపేటలోని ఓ హోటల్‌లో జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్మెం-టల్ ఇనీషియేటివ్ ఆధ్వర్యంలో అర్బన్ బయో-డైవర్సిటీ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు మిగతా2లో...

విశ్వంభర
V3 NEWS

# డిసెంబర్ 5న మహారాష్ట్ర సీఎం ప్రమాణస్వీకారం

(మొదటి పేజీ తరువాయి)
అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన మహాయుతి కూటమి ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం డిసెంబర్ 5న జరగనుంది'' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మహారాష్ట్రలో మొత్తం 288 సీట్లు వుండగా.. మహాయుతి కూటమి 233 స్థానాల్లో విజయం సాధించింది. అటు ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి 51 చోట్ల గెలుపొందింది. బీజేపీ 132 స్థానాలను గెలుచుకొని అతిపెద్ద పార్టీగా అవతరించింది. శివసేన (శిందే) 57, ఎన్సీపీ (అజిత్ పవార్) 41 స్థానాల్లో జయకేతనం ఎగురవేశాయి. ఇకపోతే, శివసేన (ఉద్ధవ్) పార్టీ 20 చోట్ల విజయం సాధించగా.. కాంగ్రెస్ 16, ఎన్సీపీ (ఎస్పీ) 10 స్థానాలు గెలుచుకున్నాయి. మహాయుతి కూటమి స్పష్టమైన ఆధిక్యత ప్రదర్శించినప్పటికీ.. ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. తొలుత శిందే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని వార్తలు వచ్చినప్పటికీ.. బీజేపీ నుంచి డిప్యూటీ సీఎం ఫడణవీస్ పేరు తెరమీదికి వచ్చింది. బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్న నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన వ్యక్తే ముఖ్యమంత్రిగా ఉంటారని అందరూ భావిస్తున్నారు. ఫలితాల తర్వాత చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా అందుకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మంత్రి వర్గంలోకి సగం మందిని బీజేపీ నుంచి మిగతా సగం శివసేన, ఎన్సీపీ నుంచి తీసుకుంటారన్న ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో శివసేనకు 12 మంత్రి పదవులిచ్చి, అందులో మూడు కీలక శాఖలు కేటాయిస్తారన్న వార్తలు వచ్చాయి.
తాజాగా మహారాష్ట్ర సీఎం రేసులో కొత్తగా మురళీధర్ మోహోల్ పేరు తెరపైకి వచ్చింది. బీజేపీ పుణె ఎంపీ అయిన మురళీధర్ ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. గతంలో పుణె మేయర్‌గా పనిచేశారు. రాజకీయ వర్గాల్లో పెద్దగా ప్రచారంలో లేని మురళీధర్‌ను బీజేపీ అగ్రనాయకత్వం మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి సూచిస్తున్నట్లు సమాచారం. సీఎం పదవికి పోటీపడుతున్న దేవేంద్ర ఫడణవీస్‌కు బీజేపీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో మహాయుతి కూటమి అధిష్ఠానం మహారాష్ట్ర సీఎంగా ఎవరిని నియమిస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.


# గత ప్రభుత్వం మూలన పడేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)
కాంగ్రెస్ ప్రభుత్వం కట్టినవేనని చెప్పారు. జూరాల, కోయిల్‌సాగర్, భీమా వంటి ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అని అన్నారు. గత ప్రభుత్వం మూలన పడేసిన ప్రాజెక్టులను క్రమంగా పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిజంగా ఇవాళ రైతు పండుగలా ఉందని.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగానే పండుగ వాతావరణం నెలకొందని భట్టి తెలిపారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రైతుపండుగ ముగింపు సభలో భట్టి మాట్లాడారు. ''ప్రతినెలా సమీక్షలు చేస్తూ బిల్లులు చెల్లిస్తూ ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నాం. గత ప్రభుత్వంలో సీఎంగా చేసిన కేసీఆర్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కృష్ణా బేసిన్‌ను ఎండబెట్టారు. రూ.లక్షలు ఖర్చు చేసి గోదావరిపై కూలిపోయిన ప్రాజెక్టు కట్టారు. రూ.లక్ష కోట్లు ఖర్చు కట్టిన కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి పదేళ్లలో కూడా పూర్తి చేయలేదు. ఈ ప్రభుత్వం మాత్రం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసింది. నెల రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లు వేశాం. ఆధార్, రేషన్ కార్డుల్లో సమస్యల వల్ల కొందరికి రుణమాఫీ సొమ్ము అందలేదు. రుణమాఫీ ఆగిపోయిన వారికి ఇవాళ మళ్లీ ఇచ్చాం'' అని భట్టి వివరించారు.

# 2 లక్షల ఉద్యోగాలన్నారు.. ఎలాంటి నోటిఫికేషన్లు లేవు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో అరకొర రుణమాఫీ చేసి మొత్తం పూర్తి చేశామని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అదేవిధంగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నోటిఫికేషన్లు రాలేదని, గత ప్రభుత్వం పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలనే వీళ్లు భర్తీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, అందుకు గత పార్లమెంటు ఎన్నికలే నిదర్శనమన్నారు. తెలంగాణలో బీజేపీకి మంచి భవిష్యత్ ఉందని ఇటీవల తనను కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారన్నారు. ప్రజల తరఫున ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు చేయాలని ప్రధాని పిలుపునిచ్చారని.. అదే స్ఫూర్తితో ముందుకు వెళతామన్నారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సభ్యత్వ నమోదు, పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై కిషన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సునీల్ బన్సల్ పాల్గొని బూత్, మండల స్థాయి కమిటీల నియామకంపై జిల్లా అధ్యక్షులు, సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జ్‌లకు దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు. బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసే పార్టీ అని, గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు వేసుకుంటున్నామన్నారు. ప్రజా సమస్యలతోపాటు ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలకు గత బీఆర్ ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్రమే నిధులు ఇస్తోందన్నారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో ప్రజలను సంఘటితం చేసేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మంచి నాయకత్వం వచ్చేలా కమిటీలు వేయాలన్నారు.

# ఫెంగల్ ప్రభావంతో భారీ వర్షాలు



**విశ్వంభర, హైదరాబాద్:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుఫానుగా మారింది. ఈ ఫెంగల్ తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో చెన్నైలోని విమానాశ్రయాన్ని అధికారులు మూసివేశారు. అలాగే, ఏపీ తిరుపతిలోనూ విమానాల రాకపోకలపై ప్రతికూల ప్రభావం పడింది. దాంతో హైదరాబాద్ నుంచి నడవాల్సిన విమానాలు రద్దయ్యాయి. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లాల్సిన ఏడు విమానాలతో పాటు తిరుపతి నుంచి హైదరాబాద్ విమానాలను రద్దు చేశారు. ఇక చెన్నై నుంచి హైదరాబాద్ రావాల్సిన మూడు విమానాలను రద్దు చేస్తూ ఎయిర్ లైన్స్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. ముంబయి, ఢిల్లీ నుంచి చెన్నైకి బయలుదేరాల్సిన విమానాలను దారి మళ్లించారు. చెన్నై-విశాఖపట్నం-చెన్నై, తిరుపతి-విశాఖపట్నం, తిరుపతి మధ్య సర్వీసులు నిలిచిపోయాయి. ఫెంగల్ తుఫాను ప్రభావంతో రాజధాని చెన్నైలో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు పూర్తిగా నీటమునిగాయి. బలమైన ఈదురుగాలులతో కురుస్తున్న భారీ వర్షాలకు విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో సాయంత్రం 7 గంటల వరకూ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఇండిగో సహా పలు విమాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాయి. సర్వీసుల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

# జేబులు గుల్ల చేస్తున్న బెనిఫిట్ షోలు

(మొదటి పేజీ తరువాయి)
హీరో సినిమాను ముందుగా చూడాలని ఫ్యాన్స్ ఉత్సాహం చూపిస్తుంటారు. దాని కోసం ఎంత వెచ్చించడానికైనా అభిమానులు వెనకాడరు. దానిని ఆయుధంగా చేసుకుని క్యాష్ చేసుకుంటున్నారు బెనిఫిట్ షో నిర్వాహకులు. ప్రస్తుతం అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప2: ది రూల్' . రష్మిక కథానాయిక. డిసెంబరు 5న ఈ మూవీ విడుదల కానుంది. బన్నీ అభిమానులు విపరీతమైన ఎగ్జైట్‌మెంట్‌తో సినిమా చూడటానికి సిద్ధమవుతున్నారు.

**ఫ్యాన్స్ క్రేజే ఆయుధం..**

ఫ్యాన్స్ క్రేజ్‌ను బట్టి మెయిన్ సిటీల్లో అభిమానుల కోసం బెనిఫిట్ షోలు ఏర్పాటు చేయడం అనవాయితీ. అయితే ఒకప్పుడు వీటికి రిజనబుల్ రేటు ఉండేది. ఇప్పుడు ఆ రేట్లు కొండెక్కి కూర్చున్నాయి. ఇప్పుడు అగ్ర తారలు, భారీ బడ్జెట్ చిత్రాలకు ప్రభుత్వం కూడా అదనపు షోలు, టికెట్ రేట్ పెంచడం లాంటి వెసులుబాటు కల్పిస్తోంది. అయితే ఇది పరిమిత రోజుల వరకే. ప్రభుత్వం జీవో ప్రకారం టికెట్ రేటుపై వంద రూపాయలు పెంపునకు అనుమతి ఉంటుంది. అయితే ఫ్యాన్స్ పేరుతో ఏర్పాటు చేసే బెనిఫిట్ షోల రేట్లకు రెక్కలు వచ్చినట్లుగా వ్యవహారం ఉంది.ఈ సందర్భంగా పుష్ప 2కు తెలంగాణ వ్యాప్తంగా టికెట్ ధరలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల బెనిఫిట్ షోతో పాటు, అర్ధరాత్రి 1 గంట షోకు కూడా అనుమతి ఇచ్చింది. రాత్రి 9.30 షోకు టికెట్ ధరను అదనంగా రూ.800 పెంచింది.

**సగానికి పైగా మిగులే..**

పుష్ప బెనిఫిట్ షో చూడాలంటే రాష్ట్రవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్ ఏదైనా సరే ప్రస్తుతం ఉన్న టికెట్ ధరకు అదనంగా రూ.800 చెల్లించాల్సిందే. ఈ పెంపుతో సింగిల్ స్క్రీన్‌లో టికెట్ ధర సుమారు రూ.1000 అవుతుండగా, మల్టీప్లెక్స్‌లో రూ.1200లకు పైగా అవుతోంది. మామూలుగా మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో సినిమా టికెట్ ధర హై క్లాస్ అయితే రూ.500ఉంటుంది. కానీ బెనిఫిట్ షో ధర ఆకాశాన్ని అందుకున్నట్లు రూ.1200 పలుకుతోంది. మల్టీప్లెక్స్ సీటింగ్ కెపాసిటీ 300 వరకూ ఉంటుంది. అంటే ఒక్క షో కి వసూలు చేసే మొత్తం ఆరు లక్షల రూపాయలు. బెనిఫిట్ షోకి ప్రత్యేకంగా కట్టాల్సిన టాక్స్ ఏమీ ఉండదు. షో నిర్వాహకులు హోల్ థియేటర్ బుక్ చేసుకుంటారు. అది కూడా టాక్స్‌తో కలిపే. ఇందులో ఖర్చులు పోగా దాదాపు సగానికి సగం తమ జేబులో వేసుకుంటున్నారని టాక్ నడుస్తోంది. ఇప్పుడు ఇదొక దందాగా మారింది. అభిమానులు ఆ సమయంలో ఇవేమీ పట్టించుకోరు. సినిమా చూసొచ్చాక టికెట్ రూపంలో మన జేబుకు ఇంత చిల్లు పడిందా అని వాపోతుంటారు.

**అదనపు షోలకు అనుమతి**

ఇక అర్ధరాత్రి 1 గంట నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు అదనపు షోలకు కూడా అనుమతి ఇచ్చారు. డిసెంబర్ 5 నుంచి 8 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచారు. డిసెంబర్ 9 నుంచి 16 వరకు సింగిల్ స్క్రీన్‌లో రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.150 పెంపునకు అనుమతి ఇచ్చారు. ఇక డిసెంబర్ 17 నుంచి 23 వరకు సింగిల్ స్క్రీన్‌లో రూ.20, మల్టీప్లెక్స్‌లో రూ.50 పెంపునకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 'పుష్ప2' ఆరు భాషల్లో 12 వేలకిపైగా థియేటర్లలో విడుదలకానుంది. ''అత్యధిక థియేటర్లలో ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతున్న భారతీయ చిత్రమిది. సినీడబ్స్ యాప్ సహాయంతో ఏ భాషలోనైనా ఈ సినిమాని ఆస్వాదించే అవకాశం ఉంది'' అని నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. ఇక 'పుష్ప2' రన్ టైమ్ విషయానికొస్తే 3 గంటలా 20 నిమిషాల 38 సెకన్ల నిడివితో రాబోతోంది. ఇందుకు సంబంధించిన సెన్సార్ పూర్తయింది. 'పుష్ప2'కు యూ/ఏ వచ్చినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. విడుదలకు ముందే బుక్సింగ్స్, సాంగ్స్ వ్యూస్‌తో రికార్డులు సృష్టిస్తున్న 'పుష్ప2' రన్‌టైమ్ పరంగానూ రికార్డు నెలకొల్పింది.మరోవైపు ప్రముఖ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 2024లో అత్యధిక పారితోషికం తీసుకున్న టాప్-10 నటుల జాబితాలో అల్లు అర్జున్ రూ.300 కోట్లతో మొదటి స్థానంలో నిలిచారు. 'పుష్ప2' కోసం ఆయన ఈ స్థాయిలో పారితోషికం అందుకున్నట్లు తన కథనంలో పేర్కొంది.

**ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి..**

గతంలో బెనిఫిట్ షో టికెట్ ధర మామూలు షో టికెట్ ధర ఒకే రకంగా ఉండేది. కానీ సినిమాకు ఉన్న క్రేజ్ అగ్ర కథానాయకులు నటిస్తుండడంతో దాన్ని క్యాష్ చేసుకోవాలని డిస్ట్రిబ్యూటర్లు, థియేటర్ల యాజమాన్యాలు అమాంతం బెనిఫిట్ షో టికెట్ ధర పెంచి అభిమానుల జేబులను గుల్ల చేస్తున్నారని వీ3 న్యూస్ సినిమా విభాగం ప్రతినిధి దండు సురేష్ తో అల్లు అర్జున్ అభిమాని ఒకరు వాపోయారు. టికెట్ ధరలు ప్రభుత్వం చెప్పిన విధంగా ఉండాలని కానీ డిస్ట్రిబ్యూటర్లు చెబితే ప్రభుత్వం పెంచడం ఏమిటని అభిమానులు ప్రశ్నిస్తున్నారు. బెనిఫిట్ షో టికెట్స్ ధరల పెరుగుదలకు ప్రభుత్వం అనుమతించకూడదని దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలని అభిమానులు కోరుతున్నారు.

# కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా దక్కించుకోవాలి

**విశ్వంభర, హైదరాబాద్:** కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాలను దక్కించుకోవాలని రాష్ట్ర ప్రయోజనాలకు వీసమెత్తు నష్టం వాటిల్లకుండా ట్రైబ్యునల్ ఎదుట సమర్థ వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలు, రికార్డులు, ఉత్తర్వులు సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులు, న్యాయ నిపుణులకు స్పష్టం చేశారు. నదీజలాల అంశంపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష : నీటిపారుదల ప్రాజెక్టులు, నదీజలాల అంశాలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ వైద్యనాథన్, ఏజీ సుదర్శన్ రెడ్డి, అదనపు ఏజీ రజనీకాంత్ రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది ఖుష్ వోరా, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఉన్నతాధికారులు, ఈఎన్సీలు సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో సాగునీటి పరిస్థితి, కృష్ణా - గోదావరి జలాలపై ఉన్న అంతర్ రాష్ట్ర వివాదాలు, నీటి వాటాల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి వాటాలు, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులను బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ నిర్ణయించాల్సి ఉందని త్వరలోనే రాష్ట్రాలు తమ వాదనలు వినిపించాల్సి ఉందని అధికారులు సీఎంకు వివరించారు. కృష్ణా జలాలకు సంబంధించి ట్రైబ్యునల్ తీర్పులు, డీపీఆర్‌ల గురించి ఆరా తీసిన ముఖ్యమంత్రి జలశక్తి మంత్రిత్వ శాఖకు ఇచ్చిన నివేదికలన్నింటినీ వరుస క్రమంలో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వాటి ఆధారంగా ట్రైబ్యునల్ ఎదుట పకడ్బందీగా వాదనలు వినిపించాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా జలాల్లో 70 శాతం వాటా రాష్ట్రానికి దక్కేలా : అంతర్జాతీయ నీటి సూత్రాల ప్రకారం నదీ పరివాహక ప్రాంత దామాషా ప్రకారం నీటి కేటాయింపులు ఉండాలన్న రేవంత్ రెడ్డి కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉండగా, ఏపీలో కేవలం 30 శాతం ఉందని అన్నారు. ఆ ప్రకారం 1005 టీఎంసీల కృష్ణా జలాల్లో 70 శాతం నీటివాటా తెలంగాణకు దక్కేలా వాదనలు వినిపించాలని అధికారులను ఆదేశించారు. పోలవరం ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను ఏపీ కృష్ణా డెల్టాకు వినియోగిస్తున్నందున, అందుకు బదులుగా నాగార్జునసాగర్ ఎగువన 45 టీఎంసీలు తెలంగాణకు నీటి కేటాయింపులు ఉన్నాయని ఆ వాటాను ఎగువన ఉన్న ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకునే ప్రణాళికను అమలు చేయాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ నీటి వాటాల పంపిణీ ఇప్పటి వరకు పూర్తి చేయనందున కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల నిర్ణయాలను ఎందుకు పట్టించుకోవాలని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ట్రైబ్యునల్ నీటి వాటాల పంపిణీ పూర్తయ్యే వరకు గోదావరి, కృష్ణా బోర్డుల జోక్యం ఉండకూడదని సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలని అధికారులకు సూచించారు. వివిధ ప్రాజెక్టుల ద్వారా కృష్ణా జలాల్లో కోటాకు మించి ఎక్కువ నీటిని ఆంధ్రప్రదేశ్ తరలిస్తోందని సమావేశంలో చర్చ జరిగింది. నీటి ప్రవాహాన్ని శాస్త్రీయంగా లెక్కించే టెలిమెట్రీ పరికరాలకయ్యే 12 కోట్ల రూపాయలను రెండు రాష్ట్రాలు చెరో సగం చెల్లించాలని అధికారులు వివరించారు. అవసరమైతే మొత్తం డబ్బులు ముందుగా భరించి టెలిమెట్రీ అమల్లోకి తీసుకురావాలన్న రేవంత్ రెడ్డి ఏపీ ఇచ్చినప్పుడు రీఎంబర్స్ చేసుకోవాలని సూచించారు. నీటి వినియోగం విషయంలో జరుగుతున్న అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులన్నింటి ద్వారా ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడుకుంటుందో లెక్కలు తీయాలని స్పష్టం చేశారు. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు, బనకచెర్ల హెడ్ రెగ్యులేటరీ, తెలుగుగంగ, కేసీ కెనాల్, హంద్రీ నీవా, గాలేరు నగరి, వెలుగోడు ప్రాజెక్టుల నుంచి ఎంత నీటిని తరలిస్తున్నారన్న వివరాలన్నీ రికార్డు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలి : సీతారామ ప్రాజెక్టు, సమ్మక్క బ్యారేజీకి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, పూర్తి ఆయకట్టుకు నీరు అందించేందుకు అవసరమైన పనులన్నీ త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు, నీటి వాటాలకు సంబంధించి సమర్థంగా వాదనలు వినిపించేందుకు 2014 నుంచి ఇప్పటివరకు ఉన్న జీఓలు, తీర్పులతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీఓలు, మెమోలు, ప్రాజెక్టుల డీపీఆర్లు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. నీటి వాటాల్లో తెలంగాణకు జరిగిన నష్టాలపై సమగ్రంగా నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. వీటి ఆధారంగా అన్ని వేదికలపై తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేలా సమర్థమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పేరుకే పండుగ..అంతా దండుగ

**విశ్వంభర, హైదరాబాద్ :** రైతు పండుగ పేరుతో రేవంత్ రెడ్డి రైతులను మాయమాటలతో మరోసారి మోసం చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు పండుగ సభలో రేవంత్ చేసిన వ్యాఖ్యల పట్ల హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. మహబూబ్ నగర్ రైతు పండుగలో రేవంత్ రెడ్డి సహా మంత్రులు ఎంత మొత్తుకున్నా దండుగే అయ్యింది. ఆడంబరంగా నిర్వహించిన కార్యక్రమం యావత్ తెలంగాణ రైతాంగాన్ని ఉసూరుమనిపించింది. ఏడాది పూర్తయిన సందర్భంగానైనా రైతులందరికీ రుణమాఫీ, వానాకాలంతో పాటు ఈ యాసంగికి ఇచ్చే రైతు భరోసా మొత్తం కలుపుకొని ఎకరాకు రూ. 15 వేలు ప్రకటిస్తారనుకుంటే మరోసారి మొండి చెయ్యి చూపారు. ఇక కౌలు రైతులు, ఉపాధి కూలీలకు రైతు బంధుకు అతీగతీ లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని కూడా కాంగ్రెస్ పేటెంటే అంటూ గప్పాలు కొట్టుకోవడం సిగ్గుచేటు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల కాదు, మా కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వల్లనే కోటి 53 లక్షల టన్నుల వరి పండిందని గొప్పలు చెప్పుకోవడం నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్నట్లు ఉంది. మీరు చెప్పిన ప్రాజెక్టులు 2014లో కూడా ఉన్నాయి. మరి అప్పుడు 68 లక్షల టన్నుల వరి మాత్రమే ఎందుకు పండింది రేవంత్ రెడ్డి? 2023-24 నాటికి కోటి 68 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి ఎలా సాధ్యం అయ్యింది? 2014-15 లో లక్షా 31 వేల ఎకరాలు ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి 2లక్షల 21 వేల ఎకరాలకు ఎలా పెరిగింది? చెప్పేవాడికి ఇంగితం లేకున్నా వినేవాడికైనా వివేకం ఉంటది కదా! అని హరీశ్‌రావు అన్నారు.

**అబద్ధాలు మాట్లడేందుకు నోరెలా వచ్చింది?**

ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తివి పచ్చి అబద్ధాలు మాట్లాడటానికి నోరెలా వచ్చింది రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫాం హౌజ్ ఉన్నట్లు అబద్ధాలు మాట్లాడం కాదు. నిరూపించేందుకు సిద్ధమా..? నిరూపించకుంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తవా..? అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఇప్పటికే నీకు కాంగ్రెస్ తత్వం బోధపడినట్లుంది. మళ్లీ అవకాశం వస్తదా? వస్తదా? అని భయపడుతున్నవు. అసెంబ్లీకి రమ్మని తెగ పిలుస్తున్నావు రేవంత్ రెడ్డి. మేము ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్నం. మీ ఏడాది పాలనలో అన్ని వర్గాలను ఏడిపించడమే తప్ప ప్రజలకు చేసిందేం లేదు. అబద్ధాలు చెబుతూ ఏడాది నడిపించావు. ఈ అబద్ధాలతో ఇంకా ఎంతో కాలం మోసం చేయలేవు. అసెంబ్లీలో నీ ఏడాది పాలన అసలు రంగు బయట పెట్టేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీలో మైకులు కట్ చేయకుండా సమయం కేటాయించే దమ్ము మీకుందా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)
సీఎం ప్రసంగించారు. రైతుల కోసం ఇప్పటి వరకు ప్రజాప్రభుత్వం రూ.54 వేల కోట్లు ఖర్చు పెట్టిందని తెలిపారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తు చేశారు. ''ఈ రోజు ఎంతో ప్రత్యేకమైంది. సరిగ్గా ఏడాది క్రితం మీరంతా ప్రజాప్రభుత్వం కోసం ఉత్సాహంగా ఓట్లు వేశారు. నిరంకుశ ప్రభుత్వాన్ని దింపి ప్రజాప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. పాలమూరు జిల్లాలో కృష్ణమ్మ పారుతున్నా జిల్లా ప్రజల కష్టాలు తీరలేదు. ఉపాధి కోసం ఎన్నో కుటుంబాలు ముంబయి, హైదరాబాద్‌కు వలస పోయాయి. బూర్గుల రామకృష్ణారావు తర్వాత ఇన్నాళ్లకు మళ్లీ పాలమూరు బిడ్డ సీఎం అయ్యారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీని పూర్తి చేసిందా? వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్లే అని గత సీఎం అనలేదా? ఈ ప్రభుత్వం మాత్రం వరి వేస్తే.. రూ.500 బోనస్ ఇచ్చి వరి రైతులకు పండుగ తెచ్చింది. గత ప్రభుత్వం రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం కట్టింది. మూడేళ్లు నిండకుండానే ఆ ప్రాజెక్టు కూలింది. ఈ ఏడాది రాష్ట్రంలో 1.50లక్షల మెట్రిక్ టన్నుల వరి పండింది. గత ప్రభుత్వం వడ్డీతో సహా రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసింది. ఏడాదిలో 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ప్రజా ప్రభుత్వం ఇది. దేశంలోని ఏ రాష్ట్రంలో అయినా ఇంత రుణమాఫీ చేశారా? అని ప్రధాని మోదీ, కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నా. రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది.

**ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా..**

గతంలో ఎవరూ భూసేకరణ చేయలేదా.. ప్రాజెక్టులు కట్టలేదా..పరిశ్రమలు నిర్మించలేదా? నా జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపాధి కల్పించాలని భావించాను. కానీ, మాయగాళ్ల మాటలు విని పరిశ్రమలు అడ్డుకుంటున్నారు. వారి మాటలు విని లగచర్ల ప్రజలు కేసుల్లో ఇరుక్కున్నారు. జిల్లాను అభివృద్ధి చేయాలంటే భూ సేకరణ చేయాలా? వద్దా? అధికారులను కొడితే.. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు పూర్తయ్యేవా? కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చెప్పే మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు. ఇంటికో ఉద్యోగం వస్తే ఆ కుటుంబం తలరాత మారుతుంది. నష్టపరిహారం ఎక్కువ ఇచ్చేందుకైనా సిద్ధంగా ఉన్నాం. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. వచ్చిన అవకాశాన్ని జార విడుచుకోవద్దు. కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉంది. కానీ, పరిశ్రమల కోసం మాత్రం 1300 ఎకరాల భూమి సేకరించొద్దా. పాలమూరు ప్రజలకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తాం. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా. ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# ఆ నియామకాలు చెల్లవు

**విశ్వంభర, హైదరాబాద్:** మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ నోటిఫికేషన్ (2002)కు సంబంధించి అర్హతల వివాదంపై సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను ఉల్లంఘించి దొడ్డిదారిన ప్రభుత్వ జీవో జారీ చేసి నియామకాలు చేపట్టడం చెల్లదని తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. అర్హతలు, కోర్టు తీర్పులతో స్థిరపడ్డాక వాటికి విరుద్ధంగా ప్రభుత్వం జీవో ద్వారా నియామకాలు చేపట్టడం తగదని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. కోర్టు ఉత్తర్వులతో తొలగించిన 1200 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 1207 చట్ట విరుద్ధమని.. కోర్టు తీర్పుల స్ఫూర్తికి వ్యతిరేకమని పేర్కొంది. అలా తిరిగి తీసుకోవడం వల్ల మరిన్ని వివాదాలు తలెత్తుతాయని తెలిపింది. జీవోను సమర్థిస్తే ప్రభుత్వం చేసిన తప్పునే ఈ కోర్టు మళ్లీ చేసినట్లవుతుందని వ్యాఖ్యానించింది. 90 రోజుల్లో అర్హులతో కూడిన జాబితా సిద్ధం చేసి నియామక ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. 2002లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ నోటిఫికేషన్ అర్హతకు సంబంధించిన వివాదంపై ట్రైబ్యునల్, హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై హైకోర్టు తీర్పు వెలువరిస్తూ ఎస్ఎస్‌సీ గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిప్లొమా ఇన్ హెల్త్ అసిస్టెంట్ అర్హతగా పేర్కొంటూ ఆ మేరకు మెరిట్ జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించింది. దీన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించడంతో అర్హత లేని 1200 మందిని గతంలో తొలగిస్తూ ప్రభుత్వం 2012లో జీవో జారీ చేసింది. అనంతరం బాధితుల విజ్ఞప్తి మేరకు మంత్రివర్గం సానుకూలంగా స్పందించి తొలగించిన 1200 మందిని కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకుంటూ 2013లో మరో జీవో జారీ చేసింది.

# టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా బుర్రా వెంకటేశం

(మొదటి పేజీ తరువాయి)
జారీ కానున్నాయి. ప్రస్తుత టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్ రెడ్డి పదవీ కాలం డిసెంబర్ 3న ముగియనుంది. ఈ నేపథ్యంలో బుర్రా వెంకటేశం ఐఏఎస్‌కు స్వచ్ఛంద పదవీ విరమణ చేయనున్నారు. 1995 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన బుర్రా వెంకటేశం సర్వీస్ 2028 ఏప్రిల్ 10 వరకు ఉంది. బుర్రా వెంకటేశం టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా గరిష్ఠంగా 2030 ఏప్రిల్ 10 వరకు కొనసాగే అవకాశం ఉంది. జనగామ జిల్లాకు చెందిన బుర్రా వెంకటేశం ప్రస్తుతం విద్యాశాఖ, గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా జనవరిలో మాజీ డీజీపీ మహేందర్ రెడ్డిని నియమించింది. ఆయనతో పాటు మరో ఐదుగురు టీజీపీఎస్సీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు అప్పటి గవర్నర్ తమిళిసై ఆమోద ముద్ర వేయగా, అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా మహేందర్ రెడ్డి పదవీ కాలం డిసెంబర్ 3తో ముగియనున్న నేపథ్యంలో బుర్రా వెంకటేశంను నూతన ఛైర్మన్‌గా నియమించారు.

# రాష్ట్రంలో అత్యుత్తమ ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకొచ్చాం

(మొదటి పేజీ తరువాయి)
ఉన్న బీసీ జనాభాకు అనుగుణంగా కార్యక్రమాలుండాలనేది ప్రభుత్వ అభిమతం. ఉపాధి కులాలవారీగా అందాలనే ఉద్దేశంతో కులగణన చేస్తున్నాం. ఎన్ని సవాళ్లు వచ్చినా అధిగమిస్తున్నాం. సవరణ అవసరం అయితే చట్టాల మార్పు కోసం కేంద్రం సాయం తీసుకుంటాం. బిక్కి ప్రతిపాదనలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాల్లో మార్పులు తీసుకొస్తాం. బ్యాంకుల నుంచి రుణాలు, ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి సమస్యలు రాకుండా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం. వెనుకబడిన వర్గాల పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తాం. ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లోనూ పరిశ్రమలు విస్తరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం'' అని మంత్రి వివరించారు.

# త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్

(మొదటి పేజీ తరువాయి)
ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలపై ఎక్కువగా దృష్టి పెట్టామన్న రంగనాథ్, లోటస్ పాండ్‌లో ఏకంగా ఓ వ్యక్తి ఎకరం స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే హైడ్రా అడ్డుకుందన్నారు. త్వరలోనే హైడ్రాకు పోలీస్ స్టేషన్ రాబోతుందని, హైడ్రాకు వచ్చే ఫిర్యాదులను వెనువెంటనే పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్లు రంగనాథ్ వివరించారు. హైడ్రా చర్యలకు ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని, అక్రమ నిర్మాణాల కూల్చివేతల విషయంలో కోర్టు తీర్పులు కూడా స్పష్టంగా ఉన్నాయని రంగనాథ్ వెల్లడించారు. అక్రమనిర్మాణల కూల్చివేతపై కోర్టు తీర్పులు స్పష్టంగా ఉన్నాయి : చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ.. అక్కడ నిర్మాణాలు చేపట్టరాదని, చేపడితే వాటిని కూల్చి వేయవచ్చునని కోర్టు తీర్పులు ఎంతో స్పష్టంగా ఉన్నాయన్నారు. అలాగే రహదారులు, పార్కులు, ప్రజావసరాలకోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణలు కాకూండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా కోర్టులు చక్కటి దిశానిర్దేశం చేశాయని తెలిపారు. ఇందుకు ఇటీవల హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులే నిదర్శనమని వ్యాఖ్యానించారు. జీవవైవిధ్యానికి ఊతమిచ్చేలా చెరువుల పరిరక్షణలో హైడ్రా చేస్తున్న కృషిని నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఛైర్మన్ అచలేందర్ రెడ్డి అభినందించారు.

# తెలంగాణ తల్లి విగ్రహం మార్పు అంటే నిప్పుతో చెలగాటమే

- తెలంగాణ తల్లి ఓ దేవత
- దేవతలకు కిరీటం ఉండకూడదా?
- రేవంత్‌రెడ్డి సైకోలా వ్యవహరిస్తున్నాడు
- బీఆర్ ఎస్ నేత దాసోజు శ్రవణ్ కుమార్



**విశ్వంభర, హైదరాబాద్:** ఉద్యమ ద్రోహి రేవంత్ రెడ్డి తెలంగాణ అస్థిత్వాన్ని ధ్వంసం చేసే కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే విధంగా, ఉద్యమ ప్రతి రూపంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం మార్పు అంటే నిప్పుతో చెలగాటమే అని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో శనివారం దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తల్లి అంటే ఓ దేవత, భూ మాత. తెలంగాణ తల్లికి కిరీటం ఉండొద్దట.. దేవతకు కిరీటం ఉండకూడదా..? అని సీఎం రేవంత్ రెడ్డిని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. ప్రతి పల్లెలో, గల్లీల్లో తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయి. ఎన్నింటిని విధ్వంసం చేస్తావ్? రేవంత్ రెడ్డి లెక్క ప్రకారం.. ఒక వేళ కిరీటం రాచరికానికి సింబల్ అయితే.. హిందూ సంప్రదాయమైన దేవుళ్లకు కిరీటం ఉంది. అందరి దేవుళ్లకు కిరీటం తీసేస్తావా రేవంత్ రెడ్డి. తెలంగాణ తల్లికి దేవత స్వరూపం ఉండాలని కిరీటం పెడితే దాన్ని విధ్వంసం చేయాలని ప్రయత్నం చేస్తున్నవ్. కిరీటం అనేది సామాజిక స్ఫూర్తికి వ్యతిరేకం అయితే.. రేవంత్ రెడ్డి కూడా రెడ్డి అని పెట్టుకోవడం సామాజిక స్ఫూర్తికి వ్యతిరేకం. ఎందుకంటే ఆయనే అన్నడు.. రెడ్డి అంటే మేం రాజులం. మేం భూస్వాములం. మేం రాచరికం కోసమే పుట్టినం. పరిపాలించడం కోసమే పుట్టినం. మేమంతా భూస్వాములుగా ఉండాలని పలు సందర్భాల్లో రేవంత్ రెడ్డి మాట్లాడారు. సామాజిక, ఉద్యమ స్ఫూర్తి లేకుండా అధికారం అడ్డం పెట్టుకుని చిల్లర మల్లరగా చేస్తున్న ప్రయత్నం దుర్మార్గం. పిచ్చోడి చేతిలో రాయిలా మారింది పరిపాలన. అధికారం ఉందని విర్రవీగుతూ ఉద్యమ చిహ్నాలను విధ్వంసం చేసే ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. కేసీఆర్‌పై కోపంతో.. తెలంగాణపై కోపంతో సైకోలా వ్యవహరిస్తున్నాడు రేవంత్ రెడ్డి అని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. తెలంగాణ అస్తిత్వంపై, ఆత్మపై రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నాడు. కేసీఆర్‌పై అక్కసుతో మొత్తం తెలంగాణ అస్తిత్వాన్ని సర్వనాశనం చేయాలని ప్రయత్నం చేస్తున్నాడు. ఒక పెద్ద పాపం చేస్తుండు రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రి పదవిలో ఉన్నా అనే సోయి లేకుండా విచ్చలవిడిగా ఆకృత్యాలకు పాల్పడుతున్నాడు. నీ నిర్ణయం తప్పని ఒప్పుకొని లగచర్లలో ఫార్మాని రద్దు చేసినవ్.. మరి రైతులపై పెట్టిన అక్రమ కేసుల్ని ఎందుకు రద్దు చేయలేదు..? ఇప్పటికీ జైల్లోనే ఉన్న రైతులను ఎందుకు విముక్తి చేయట్లేదు..? వెంటనే రైతులపై, పట్నం నరేందర్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని దాసోజు శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# ఏసీబీకి చిక్కిన భారీ అవినీతి తిమింగలం

## ఏఈ ఇంట్లో రూ.150 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం



**విశ్వంభర, హైదరాబాద్:** అవినీతి నిరోధక శాఖకు మరో భారీ అవినీతి తిమింగలం చిక్కింది. నీటి పారుదల శాఖ ఏఈ నిఖేశ్‌కు సంబంధించి రూ.150 కోట్లకు పై గా ఆస్తులను అధికారులు గుర్తించారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి నిఖేశ్ బంధువులతో పాటు సన్నిహితుల ఇళ్లలో కలిపి 30 ప్రాంతాల్లో ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. నిఖేశ్ పేరిట పలు ఫామ్‌హౌజ్‌లు, వ్యవసాయ భూములు, ఇళ్లు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో మూడు ఫాంహౌజ్‌ల విలువే రూ.80 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. రెడ్ హిల్స్‌లోని రంగారెడ్డి జిల్లా ఎస్ఈ కార్యాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏఈ నిఖేశ్ గతంలో పట్టుబడ్డాడు. ఒక అనుమతి కోసం దరఖాస్తుదారుడి నుంచి రూ. 2,50,00 0 డిమాండ్ చేసి, ఈఈ బన్సీలాల్, మరో ఏఈ కార్తీక్‌తో కలిసి నిఖేశ్ ఏసీబీకి చిక్కాడు. అప్పటి నుంచి నిఖేశ్ సస్పెన్షన్‌లో ఉన్నాడు.

"ప్రజాపాలన విజయోత్సవాల" కార్యక్రమాలకు

# కల్వకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వెదిరె



**విశ్వంభర, కల్వకుర్తి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "మొదటి సంవత్సరం ప్రజాపాలన విజయోత్సవాల "కార్య క్రమాలకు కల్వకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెదిరె యోగెశ్వర్ రెడ్డిని నియమిస్తూ.. టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ పెద్దలు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు ఉత్తర్వులు జారీ చేశారు.



సఫిల్‌గుడా, కృష్ణ నగర్ కాలనీలో కాఖరుపతి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అయ్యప్ప 18వ మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజకు వందలాదిగా అయ్యప్ప భక్తులు హాజరయ్యారు. కార్యక్రమానికి కేఎల్ వెంకట్ నాథ్, కే లక్ష్మి, జోగు వెంకటేష్, నాగ గురు గౌడ్, ఆర్టీప నాగరాజ్ స్వామి, భజన గంగపుత్ర నర్సింగ్ రావు బస్తీ వాసులు భక్తులు హాజరయ్యారు. - విశ్వంభర, సికింద్రబాద్

# మాలల సింహ గర్జన సభను విజయవంతం చేద్దాం

## డివిజన్ అధ్యక్షుడు జగన్



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1వ తేదీన జరిగే మాలల సింహ గర్జన సభను విజయవంతం చేద్దామని ఆర్కేపురం డివిజన్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు ముచ్చింతల జగన్, ఉపాధ్యక్షుడు వానపోస వెంకటేష్ పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ.. రామకృష్ణాపురం డివిజన్ నుంచి వేలాదిమంది మాల కులస్తులను, మాల ఉద్యోగులను, మాల సంఘాల విద్యార్థులను, యువకులను పెద్ద ఎత్తున తరలిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి ఉపయోగపడ్డ మాలలు కావాలా.. భారతీయ జనతా పార్టీకి ప్రచారం చేసి బీజేపీని గెలిపించమని బహిరంగంగా ప్రచారం నిర్వహించిన మందకృష్ణ కావాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చుకోవాలని అన్నారు. డిసెంబర్ ఒకటో తేదీన జరిగే మాలల సింహగర్జన చారిత్రాత్మకమైనదని.. తెలంగాణలో ఉన్న మాల శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు పార్లమెంటు సభ్యులు అందరు కూడా కలిసికట్టుగా వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలను అణచివేయాలని చూస్తున్నారని, ఇది మన సమాజం గమనిస్తున్నదని.. ఎస్సీ రిజర్వేషన్లను ఎత్తివేయాలని మనవాదులు చేస్తున్న కుట్రలో మందకృష్ణ పావుగా వాడుకొని ఎస్సీలకు రిజర్వేషన్ లేకుండా చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఇది మాల మాదిగలు గ్రహించాలని అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ మీద తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



హైదరాబాద్, మౌలాలి శాంతినగర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి పురస్కరించుకుని, బీజేపీ సీనియర్ లీడర్ శారదా మల్లేష్ మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పలువురు బీజేపీ ప్రముఖులు హాజరయ్యారు. - విశ్వంభర, సికింద్రబాద్

# ఘనంగా అయ్యప్ప పడిపూజ



**విశ్వంభర, కొత్తపేట్:** మోహన్ నగర్ బాలాజీ కాలనీలో ప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో కామరౌతు రామరాజు వర్మ స్వామి 18వ మహా పడిపూజ వారి నివాసం వద్ద చేశారు. ఈ కార్యక్రమానికి INTUC వైస్ ప్రెసిడెంట్ టీపీసీసీ అధికార ప్రతినిధి HWW&SKU అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనంతుల సురేందర్ రెడ్డి వెళ్లి స్వామివారి ఆశీర్వాదం తీసుకొని ప్రసాద్ గురుస్వామి, రామరాజు వర్మ స్వాములను శాలువతో సన్మానించి వారికి స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వేడుకున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వందలాది అయ్యప్ప స్వాములు, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.




పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహిస్తున్న హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జీ చరమందరాజు ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బంది యొక్క మానసిక, శారీరక ఉల్లంఘన పని ఒత్తిడి నుండి ఉపశమనం కోసం, క్రమశిక్షణ కోసం ప్రతి శనివారం పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహిస్తున్నారు. ఈ పరేడ్‌లో హుజూర్ నగర్ సర్కిల్ పరిధిలోని 5 గురు ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.
- విశ్వంభర, హుజూర్ నగర్



అల్కాపురి కాలనీలో శ్రీ విద్యాశక్తి పీఠం దర్శనం చేసుకున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనంతుల సురేందర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి ఐఎన్‌టీసీ వైస్ ప్రెసిడెంట్ మొగుళ్ళ రాజిరెడ్డి. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమం పాల్గొని మఠాధిపతులను కలుసుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. - విశ్వంభర, ఎల్బీనగర్



# సమస్త మానవ సంక్షేమ వికాసాలే సనాతన హైందవ ధర్మ వైశిష్ట్యం

దైవదత్తమైన వేదముల నుండి ఆవిర్భవించినది సనాతన హైందవ ధర్మం. రుషులు ఈ ధర్మానికి ప్రచారకులు మాత్రమే. వారు స్థాపకులు కారు. లోక కళ్యాణార్థం వారు వేద విజ్ఞానాన్ని ఆధారం చేసుకుని ధర్మమనే ఒక మార్గాన్ని ఈ సమస్త లోకానికి ప్రసాదించారు. దీని ముఖ్య ఉద్దేశ్యం మానవ కల్యాణం. సంఘానికి మేలు చేకూర్చడం, ప్రతి జీవికి ఐహిక సుఖాన్ని, ముక్తిని, ఉత్తమలోక ప్రాప్తిని ప్రసాదించడం. ఈ విధంగా ఎందరో మహాత్ముల ద్వారా వివరించబడిన తత్వాలు, వారి ఉపదేశాలు ఆ తర్వాత తరాలవారికి మార్గదర్శకాలయ్యాయి.

వేదాల సారాంశమే ఉపనిషత్తులలో ఉంది. వేదాలలో ప్రతిపాదించబడిన సత్యాలను సామాన్య ప్రజలలోనికి తీసుకొని వెళ్లడానికి పురాణాలు వ్రాయబడినాయి. నిజానికి దైవం వల్ల లభించిన జ్ఞానం ఒక వ్యక్తికి గాని, ఒక దేశానికి గాని, ఒక జాతికి గానీ సంబంధించినది కాదు. ఇది అన్ని కాలాలకు, అందరికీ సంబంధించినది. సనాతన ధర్మము ప్రాచీన శాశ్వతమైన సత్యాలపై నిలబడి ఉంది. ఈ సత్యాలను సరియైన సాధనతో ఎవ్వరైనా, ఎప్పుడైనా ఆచరించి సాక్షాత్కరింప చేసుకోవచ్చు. సనాతన ధర్మాన్ని నాలుగు విధాలుగా నిర్వచింపవచ్చును.

**మొదటి నిర్వచనం**

సనాతనస్య ధర్మ ఇతి సనాతన ధర్మః

సనాతనుని అనగా శాశ్వతుని లేక పరమాత్ముని ధర్మమును సనాతన ధర్మం అంటారు. స్థాపిత స్థాపక సంబంధమును తెలుపుచున్నది. ఈ పదము సనాతనుడైన భగవానుని చేత స్థాపించబడినదగుటచే దీనిని సనాతన ధర్మము అందురు. ఉదాహరణకు క్రైస్తవులు, మహమ్మదీయులు, బౌద్ధులు- క్రీస్తును, మహమ్మదును, బుద్ధుని ఆయా మతముల యొక్క స్థాపకులుగా విశ్వసిస్తారు. అలాగే సనాతన ధర్మము సనాతనుడైన భగవానుని చేతనే అమలు జరుపబడినది. కానీ మరి ఏ మానవ మాత్రుని చేత కాదని స్పష్టమవుతుంది. సనాతన ధర్మమును తప్ప మిగిలిన మతములను రెండు విధాలుగా విభజించవచ్చు.1) భూతకాలంలో ఉండి వర్తమాన కాలంలో లేనివి. 2) భూత కాలములో లేక వర్తమాన కాలములో ఉన్నవి. అయితే సనాతన ధర్మము మాత్రమే ఈ రెండు తెగలకు సంబంధించినది కాదు. సనాతన ధర్మము అన్ని ధర్మముల కంటే ముందు నుండి ఉన్నది. ఇప్పుడు కూడా జీవించి ఉన్నది. కానీ దీని భవిష్యత్తు ఏమిటి? అనే ప్రశ్న మనకు కలగక మానదు. దీనికి సమాధానమును ఇచ్చేటప్పుడు మనం ప్రకృతి నియమాన్ని మనసులో ఉంచుకోవాలి. ఏదైతే పుడుతుందో అది గిట్టక మానదు. ఈ నియమాన్ని ఉల్లంఘించడానికి ఎవరికి సాధ్యం కాదు. ఇలా ఉల్లంఘించడం కూడా ఇంతకుముందు ఎన్నడూ జరగలేదు.. భవిష్యత్తులో కూడా జరగబోదు. భగవానుడు సహితము ధర్మసంస్థాపనార్థమై అనేక రూపాల్లో అవతరించినప్పుడు కూడా ఆయా కార్యములు నెరవేరిన వెంటనే తమ అవతారాలను చాలించుకున్నాడు. ప్రకృతి నియమాన్ని ఉల్లంఘించడం సాక్షాత్తు భగవంతుడికి కూడా సాధ్యము కాదు. సనాతన ధర్మానికి పుట్టుక అంటూ లేదు. కాబట్టి గిట్టుట కూడా ఉండదు. ఇది సూర్య చంద్రులు ఉన్నంత వరకు శాశ్వతమైనది.

**రెండవ నిర్వచనం**

సనాతనశ్చాసౌ ధర్మశ్చ ఇతిసనాతన ధర్మః

సనాతనమైనది శాశ్వతమైనది అయిన ధర్మం అగుటచే దీనిని సనాతన ధర్మము అందురు. సనాతనుడైన భగవంతుని చేత స్థాపింపబడుట చేతనే దీనిని సనాతన ధర్మము అనలేము. ఇది స్వతః సనాతన అగుటచే దీనిని సనాతన ధర్మము అని మహర్షులు వక్కాణించిరి. సనాతన ధర్మమునకు ఆద్యంతములు లేవు. ఇది సృష్టి తో పాటు ఆవిర్భవించింది. సృష్టి ఉన్నంతవరకు ఇది కూడా నిలిచే ఉంటుంది. ఇది నశించదు. అప్పుడు కూడా ఇది సూక్ష్మ బీజరూపంలో ఉండి మరల సృష్టి మొదలైనప్పుడు ఇది కూడా ప్రజలను రక్షించుటకు వారి నైతిక విలువలను పెంచుటకును ఆవిర్భవించును. సృష్టితో పాటు ఇది కూడా భ్రమిస్తూనే ఉంటుంది. అందువలన సనాతన ధర్మమునకు ఆదియును అంతమును లేదు. ఇది శాశ్వతమైనది. ఇంతే కాకుండా ప్రజల యొక్క నైతిక విలువలను పెంచుటకు కావలసిన ప్రబోధములను చేస్తుంది. అందుచేత ఇది ధర్మము అని చెప్పబడుచున్నది. కాబట్టి ఇది సనాతన ధర్మము అయి ఉంది. మరియు ధర్మము కనుక ఇది సనాతన ధర్మము.

**మూడవ నిర్వచనం**

సదా భవః సనాతనః సనాతనం కరోతి ఇతి సనాతన యతి | సనాతన యతీతి సనాతనః సనాతనశ్చా సౌ ధర్మశ్చ ఇతి సనాతన ధర్మః|

శాశ్వతముగా నిలిచి యుండునది సనాతనము. ఒక వ్యక్తిని సనాతనునిగా చేయునది కూడా సనాతనమే అవుతుంది. ఏదైతే సనాతనము మరియు ధర్మము అయిందో అది సనాతన ధర్మం. సనాతన ధర్మము సనాతనుడైన భగవానుని చేత స్థాపించబడినది. కావున తాను స్వతహాగా సనాతనమగుటచేత దానిని విశ్వసించి ఆచరించిన వారిని సనాతనులుగా కూడా చేస్తుంది. అనగా వారికి మృత్యువును రానివ్వకుండా అమరత్వాన్ని అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది. ఇన్ని కారణాల చేత దీనిని సనాతన ధర్మం అని అన్నారు. ఇప్పుడు సనాతన ధర్మము ఆచరించువారికి ఏ విధమైన అమృతత్వము లభిస్తుంది అనే ప్రశ్న ఉదయించక మానదు. దీనికి సమాధానమే నాలుగవ నిర్వచనంలో విషాధికరించబడినది.

**నాల్గవ నిర్వచనం**

**సనాతనయతి ఇతి సనాతనః**

సనాతనుని చేయును కనుక సనాతనమని పైన చెప్పబడినది. ఏ విధమైన సనాతనత్వమును ప్రసాదిస్తుంది అంటే ఆ విషయము ఇప్పుడు వివరంగా తెలుసుకోవచ్చు. సనాతన యతి అనిన దానికి అర్థము సనాతనం పరమాత్మ స్వరూపం ప్రాపయతి ఇతి అనగా పరమాత్మ స్వరూపమును పొందుటకు సనాతన ధర్మము మనకు సహకరిస్తుంది అని భావము. శుద్ధితో సనాతన ధర్మమును ఆచరించే వ్యక్తులు ఆత్మసాక్షాత్కారమును పొంది పరమాత్మునిలో లీనమవుతారు మోక్షాన్ని పొందుతారు ఇదే సనాతన ధర్మం యొక్క గొప్పదనము. భారతదేశము విశ్వంలో గురు స్థానంలో ఉండడానికి ప్రధాన కారణము సనాతన ధర్మమే అని చెప్పక తప్పదు. భారతీయ సంస్కృతి అనే భవనము విదేశీయ దాడులను ప్రతిఘటించి ఈనాటికీ జరుగుతున్న దాడులను ఎదుర్కొంటూ చెక్కుచెదరకుండా తన శోభను కోల్పోకుండా నిలబడిందంటే దాని కారణం సనాతన ధర్మమే ఆ ధర్మము అడుగు వేసిన దృఢమైన బలమైన పునాదులే అని చెప్పక తప్పదు.

సనాతన ధర్మము శృతి స్మృతి పురాణములలో మహోన్నతమైన దైవీయ దృష్టితో దర్శనాత్మకంగా ప్రవచించిన సర్వధర్మముల యొక్క క్రోడీకరణము సనాతన ధర్మమునకు మూలాధారములను మనుస్మృతి ఈ శ్లోకములో చక్కగా వివరిస్తుంది.

**శ్లోకం**

వేదః స్మృతి హి సదాచారః;
స్వ స్య చ ప్రియమాత్మనః|
ఏతచ్చతుర్విధం ప్రాహుః;
సాక్షాత్ ధర్మస్య లక్షణం||

1) వేదములు, 2) స్మృతులు, 3) సాధుసంతుల యొక్క ఆచార వ్యవహారములు, 4) ఆత్మకు ఆహ్లాదమును కలిగించు సత్కర్మలు. ఈ నాలుగు లక్షణములపైనే సనాతన ధర్మము ఆధారపడియున్నది. అని మనుధర్మశాస్త్రములో చెప్పబడినది.

**సనాతన ధర్మం లో గోవుకు ప్రాధాన్యత**

సనాతన ధర్మంలో వ్యక్తుల జీవితం ఈ క్రింద చెప్పబడిన ఆశ్రమాలలో విభజింపబడింది. బ్రహ్మాచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్తాశ్రమము, సన్యాసము. ప్రతి జీవి తన కర్మ ఫలాన్ని హెచ్చుతగ్గులు లేకుండా పక్షపాతం లేకుండా పొందగలదని, అందువల్ల సుఖప్రదమైన భవిష్యత్తును నేటి కర్మల ద్వారా వ్యక్తి నిర్మించుకోవాలని సనాతన ధర్మం సమస్త మానవాళికి హితబోధ చేస్తుంది. పరపీడనం పాపమని, పరులకు మేలు చేయడం తద్వారా వారికి ఆనందం కలిగించడం పుణ్యమని ఈ ధర్మం నొక్కి వక్కాణిస్తుంది పరోపకారాయ పుణ్యాయ పాపాయ పరపీడనం అని శాస్త్రంలో చెప్పబడిన విషయాన్ని మనం గమనించవచ్చు. సనాతన ధర్మం వివేకాన్ని సంపాదించుకోమని, వైరాగ్యాన్ని అవలంబించమని, ద్వేషాన్ని విడనాడమని, ఈశ్వరుడిని శరణు వేడమని తెలియజేస్తుంది. దీనిలో ఉన్నటువంటి వైశిష్ట్యాల కారణంగానే ఈ ధర్మం భారతీయుల హృదయాలలో, వారి విశ్వాసాలలో, జీవితపు విలువలలో, ప్రవృత్తిలో, జీవన విధానంలో లోతుగా వ్యాపించింది. ఈ ధర్మంలో గోవులకు పరమోన్నత స్థానం ఇవ్వబడింది. అందుకే సనాతన ధర్మం గోవును మాతగా భావించి గోమాతగా పూజిస్తుంది.

నాలుగు పురుషార్థాలు సనాతన ధర్మపు మూల స్తంభాలు. సమస్త ప్రాణికోటి హితవు, సార్వత్రిక దృష్టి, సంపూర్ణ ఆధ్యాత్మికత, భూతదయ, సత్ప్రవర్తన, లాంటి మానవ ధర్మాలలో విశ్వాసం. దీని వైశిష్ట్య ధర్మాలు. వ్యక్తులకు గల మనోబలము, దీక్ష, పరిస్థితుల ప్రభావం కారణంగా ఉత్తములు సర్వకాల సర్వావస్థలలో కష్టనష్టాలలో కూడా సనాతన ధర్మ ముఖ్య సూత్రాలను పాటిస్తున్నారు. సామాన్యులు కష్టకాలంలో పరీక్షా సమయంలో వీటిని విస్మరిస్తున్నారు. వేలాది సంవత్సరాల నాగరికతలో ఎన్నో విషయాలు మార్పు చెందాయి. కానీ నేటికీ సజీవంగా ఉన్నటువంటి ధర్మమే సనాతన ధర్మము. అందుకే జైన, బౌద్ధ, సిఖ్ఖు మత సిద్ధాంతాల పైన కూడా సనాతన ధర్మ ప్రభావం ఎంతగానో ఉంది. దేహమే దేవాలయం జీవాత్మే పరమాత్మ యని ఆత్మజ్ఞానం ద్వారా వ్యక్తులు పరమాత్మను చేరుకోగలుగుతారని సనాతన ధర్మం తెలియజేస్తుంది.



**భారత్ ను గురు స్థానంలో నిబెట్టేది సనాతన హైందవ ధర్మం**


సనాతన ధర్మం ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేయబడింది. సమస్త మానవ సంక్షేమ వికాసాలే ఈ సనాతన ధర్మం లక్షణాలు. ఇది కాలానుగుణంగా ఎదోచితమైన బాహ్యరూప నూతనత్వాన్ని పొందగలిగింది. అంతరంగమందు గల తత్వము మార్పు లేకుండా ఉండగలిగింది. కాని వేలాది సంవత్సరాల ఈ ప్రయాణంలో యజ్ఞ యాగాదులలో ప్రశుహింస, కుల వ్యవస్థ, మూఢనమ్మకాలు వంటివి కొన్ని చెడులు ఈ ధర్మంలో చేరినప్పటికినీ దీనంత ప్రజాస్వామికమైన, ఉదారమైన, సార్వజనీయమైన, సార్వ కాలికమైన ధర్మము మరొకటి లేదని చెప్పక తప్పదు. క్రైస్తవ మతంలో, ఇస్లాం మతంలో ఆ మత సిద్ధాంతాలను విమర్శించిన వారు అందులో కొనసాగలేరు. కాని సనాతన ధర్మంలో దాన్ని విమర్శించిన వారు కూడా గౌరవప్రదంగా కొనసాగ గలుగుతారు. ఎందుకంటే దీనిలో ఇతరుల అభిప్రాయాలను గౌరవించే సహృదయత, పరమతాలను సహించే తత్వము, ఇతరుల ఆలోచన విధానాలను గౌరవించే సంస్కారము అనే గొప్ప శక్తి ఉన్నది. కనుకనే నేడు సమస్త విశ్వంలో భారతదేశాన్ని మరల గురు స్థానంలో నిలబెట్టగలిగే శక్తి సామర్థ్యాలు కేవలం సనాతన హైందవ ధర్మానికి మాత్రమే కలదని పండితులు, వేదాంతులు భావిస్తున్నారు.



"సాహిత్య కళా విభూషణ"
కాళోజీ ప్రతిభా పురస్కార గ్రహీత
-చౌదూరి నరసింహారావు
ఆధ్యాత్మిక,సామాజిక విశ్లేషకులు

# చిత్తనూరు ఇథనాల్ కంపెనీ రద్దు ఎప్పుడు?

నిర్మల్ జిల్లా దిలావర్ పూర్‌లో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా గత సంవత్సర కాలంగా అక్కడి ప్రజలు, రైతులు పోరాడుతున్నారు. దిలావపూర్ ,గుండంపల్లి తదితర బాధిత గ్రామాల ప్రజలు, రైతులు శాంతియుతంగా ప్రజాస్వామ్యయుతంగా వివిధ రూపాలలో పోరాడారు. 140 రోజులుగా రిలే నిరాహార దీక్షా శిబిరాలను నడిపారు. గత అక్టోబర్ 18న వేలాది మందితో దిలావర్‌పూర్ మండల కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఆ సభకు ఎం.ఎల్.సి కోదండరాం, ప్రజాశాస్త్రవేత్త కె.బాబురావ్ లాంటి వారు హాజరై దిలావర్‌పూర్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలనే తమ డిమాండును ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోనప్పుడు మీకు మేమెందుకు సహకరించాలని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను బాధిత ప్రజలు బహిష్కరించారు. ఇథనాల్ ఉత్పత్తి వల్ల ప్రధానంగా రైతులు చేస్తున్న వ్యవసాయం దెబ్బతింటుంది.గాలి, నీరు, వాతావరణం కలుషితమై తమ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందనే ఆందోళన మహిళలలో పెరిగిపోయింది.అంతేగాక చిత్తనూరు (నారాయణపేట జిల్లా) ఇథనాల్ కంపెనీ ఉత్పత్తిని కొనసాగిస్తున్న ప్రస్తుత సందర్భంలో అక్కడ చుట్టుపక్కల బాధిత గ్రామాల ప్రజలు పడుతున్న కష్టనష్టాలను స్వయంగా వెళ్లి కళ్లారా చూశారు. ఆ కంపెనీ చుట్టూ 25 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలకు విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుండడాన్ని స్వయంగా వారు గమనించారు.



**ఇథనాల్ ఉత్పత్తితో ఎన్నో నష్టాలు**

ఇథనాల్ ఉత్పత్తి వల్ల ఘన, ద్రవ, వాయు రూపాలలో వెలువడే వ్యర్థపదార్థాల వల్ల వాతావరణంలోకి యథేచ్ఛగా వచ్చి చేరే కర్బన ఉద్గారాల వల్ల ఉష్ణతాపం పెరిగిపోతుంది.కంపెనీ నుండి వెలువడే ఎసిటలిన్, ఫార్మల్డిహైడ్, అక్రోలిన్ లాంటి రసాయనాలు వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. గర్భస్థ శిశువులు వికలాంగులుగా మారే దుష్పరిణామాలు సంభవిస్తాయని ప్రజా శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకున్నారు.అట్లాంటి ఇథనాల్ పరిశ్రమను ఇక్కడ ఎట్టి పరిస్థితులలో ఏర్పాటు చేయనీయరాదనే దృఢ సంకల్పానికి వచ్చారు. బాధిత ప్రజలు తమ పోరాటాన్ని ఉద్ధృతం చేయడంతో వారిని భయాందోళనలోకి నెట్టడానికి పోరాటానికి అండగా ఉన్నాడని స్థానిక ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.అంతేకాకుండా దిలావర్‌పూర్ ,గుండంపల్లి బాధిత గ్రామాలలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను దించారు.ఇథనాల్ వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటున్న రైతులు యువకులపై అక్రమ కేసులు బనాయించారు.

**నిర్బంధం అణచివేత చర్యలపై పెల్లుబికిన జనాగ్రహం**

ప్రజాపాలన పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఇథనాల్ కంపెనీని కొనసాగించడానికి పోరాడుతున్న ప్రజలపై నిర్బంధం, అణిచివేత చర్యలకు పూనుకోవడంతో బాధిత ప్రజలు సహించలేకపోయారు. కంపెనీ యజమానులకు వత్తాసు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి విసిగిపోయిన బాధిత ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో గత రెండు రోజుల క్రితం నిర్మల్ భైంసా జాతీయ రహదారిని వేలాది మందితో దిగ్బంధించారు. మహిళలు వృద్ధులు ముందు వరుసలో ఉండి 12 గంటలు రాస్తారోకోను చేపట్టారు. ఇథనాల్ కంపెనీ రద్దు చేసే వరకు ఇక్కడ నుండి కదలమనే అల్టిమేటమ్ ఇచ్చారు.రోడ్డు పైనే వండుకుని అక్కడే తింటూ రెండు రోజులు కదలకుండా బైఠాయించారు.

**దిగివచ్చిన ప్రభుత్వం**

బాధిత ప్రజల సంఘటిత పోరాట శక్తి ముందు పోలీసు నిర్బంధం ఏమి పని చేయలేకపోయింది. విధిలేని పరిస్థితులలో దిగివచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత ప్రజలతో చర్చించడానికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను పంపింది. బాధిత ప్రజలు ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లు ఒకటి: దిలావర్‌పూర్ ఇథనాల్ కంపెనీని అక్కడి నుండి తరలించాలి. రెండు: రైతులు యువకులు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి.మూడు: ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ పై విధించిన అక్రమ సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే విధులలోకి తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ పై డిమాండ్లను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించడమే కాకుండా, దిలావర్‌పూర్ ఇథనాల్ కంపెనీ చేపట్టిన నిర్మాణాలను వెంటనే ఆపివేయాలని ఆదేశించారు. తమ డిమాండ్లను నెరవేరుస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇవ్వడంతో బాధిత ప్రజలు తమ నిరవధిక పోరాటాన్ని విరమించారు. దిలావర్‌పూర్ పరిసర ప్రాంత ప్రజల సంఘటిత పోరాటం ఆవిధంగా విజయవంతం అయ్యింది.దిలావర్‌పూర్ ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ప్రజలు చేసిన సంఘటిత పోరాటం ప్రజాస్వామ్య పోరాటాలకు ఎంతో బలాన్నియిస్తుంది.అంతేకాదు తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఇథనాల్ పరిశ్రమలపై పెద్ద ఎత్తున చర్చ జరగడానికి అవకాశం ఏర్పడుతుంది.

**చిత్తనూరు ఇథనాల్ కంపెనీని రద్దు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించినా..**

చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాటంతో స్ఫూర్తిని పొందిన దిలావర్‌పూర్ ప్రాంత ప్రజలు ఇథనాల్ కంపెనీని రద్దు చేసేవరకు పట్టువిడువలేదు. ఏ పోరాటంతో ప్రేరణ పొంది తమ పోరాటాన్ని విజయం అంచులకు చేర్చారో ఆ పోరాటం, ఆ కంపెనీ మాత్రం నేటికీ కొనసాగుతున్నాయి. చిత్తనూరులో ఏర్పాటైన ఇథనాల్ కంపెనీ భారత దేశంలోనే అతిపెద్దది. ఆ కంపెనీ ఉత్పత్తి చేసే ఇథనాల్ వల్ల ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

చిత్తనూరు ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని బాధిత గ్రామాల ప్రజలు పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాలు నిరంతరాయంగా శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతులలో పోరాడారు. బహిరంగ సభలు,రౌండ్ టేబుల్ సమావేశాలు, ధర్నాలు, పాదయాత్రలు చేశారు. బాధిత ప్రజల ఇథనాల్ వ్యతిరేక పోరాటంలో నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి, జి. మధుసూదన్ రెడ్డిలు స్వయంగా పాల్గొన్నారు.తమ పార్టీ అధికారంలోకి వస్తే చిత్తనూరు ఇథనాల్ కంపెనీ రద్దు చేస్తామని వారు హామీ ఇచ్చారు.

బాధిత ప్రజల సంఘటిత పోరాటాన్ని సహించలేని బీఆర్ఎస్ ప్రభుత్వం కాలుష్యాన్ని తరలిస్తున్న ట్యాంకర్ ను పట్టుకున్న రైతులు,ప్రజలపై అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో 22 అక్టోబర్ 2023న క్రూరంగా లాఠీఛార్జ్ చేసింది.వందల మందిపై అక్రమ కేసులు బనాయించింది.చిత్తనూరు,ఎక్లాస్పూర్,జిన్నారం గ్రామాలలో వందల మంది పోలీస్ బలగాలను దించి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది.రైతులు,యువకులు,పోరాట కమిటీ ప్రతినిధులపై థర్డ్ డిగ్రీని ప్రయోగించింది.నెలరోజులు అక్రమంగా జైలులో ఉంచింది.లాఠీ ఛార్జ్ లో తీవ్రంగా గాయపడిన మహ్మద్ ఖాసీం అనే రైతు చికిత్స పొందుతూ చనిపోయాడు. బాధిత ప్రజల న్యాయమైన పోరాటంలో భాగమైన లెక్చరర్ బండారి లక్ష్మయ్య (బాధిత ఎక్లాస్పూర్ గ్రామం) ను సస్పెండ్ చేసింది.

ప్రజాస్వామ్యపాలన పునరుద్ధరిద్దరిస్తామనే హామితో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వము బాధిత ప్రజలపై బీఆర్ఎస్, బిజెపి ప్రభుత్వం కొనసాగించిన దమనకాండపై కనీసం విచారణ జరుపలేదు. కంపెనీని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని మరచిపోయింది.ఆ విషయమే తమకు తెలియనట్లు స్థానిక కాంగ్రెస్ ఎం.ఎల్.ఏ లు నటిస్తున్నారు. బాధిత గ్రామాల రైతులు, పోరాట కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేలను, మంత్రులను, ముఖ్యమంత్రిని కలిసి ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ ఇథనాల్ కంపెనీ రద్దుకు కనీసమైన చర్యలు తీసుకోలేదు. అంతేకాదు బిఆర్ఎస్ ప్రభుత్వం కంటే ఒక అడుగు ముందుకేసి రైతులు, పోరాట కమిటీ ప్రతినిధులపై రౌడీషీట్ తెరిచింది. కాలుష్యకారక చిత్తనూరు ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ఒక చిన్న ఆందోళన కూడ జరగకుండా పోలీసుశాఖ నేటికీ నిర్బంధాన్ని అలాగే కొనసాగిస్తున్నది. పర్యావరణ అనుమతులను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్న చిత్తనూరు ఇథనాల్ కంపెనీ పై ఈగ కూడా వాలకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కంపెనీ యజమానులకు కాపలా కాస్తోంది. దిలావర్‌పూర్ ఇథనాల్ కంపెనీ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులదే అని మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, బీజెపి తెచ్చిన, బీఆర్ఎస్ అమలు చేసిన ఇథనాల్ పాలసీని రద్దు చేయడానికా పూనుకుంటారా, తెలంగాణలో ఏర్పాటవుతున్న 30 ఇథనాల్ కంపెనీలపై తమ వైఖరి ఏంటో తెలియజేస్తారా అని తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ ఒక సంవత్సర విజయోత్సవాలలో భాగంగా మహబూబ్ నగర్ పట్టణంలో జరుగుతున్న మూడు రోజుల రైతు సదస్సు ముగింపు సభలో పాల్గొనడానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆ సందర్భంగానైనా చిత్తనూరు ఇథనాల్ కంపెనీ రద్దు చేస్తామని ప్రకటిస్తారని ఎదురు చూస్తున్నారు.మహబూబ్ నగర్ జిల్లా వాసిగా తమ ప్రాంత ప్రజలు, రైతులకు కాలుష్యకారక ఇథనాల్ కంపెనీలు కల్గిస్తున్న కష్టనష్టాల నుండి గట్టెక్కిస్తాడని ఆశిద్దాం.

-బండారి లక్ష్మయ్య
చిత్తనూర్ విత్తనాల పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

## ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం



**విశ్వంభర, షాద్‌నగర్ :** విద్యాశాఖ మంత్రి లేకుండా సంవత్సరం పాలనా విద్యావ్యవస్థపై సమీక్ష ఏది గురుకుల, సంక్షేమ హాస్టల్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ ఫయిజాన్‌తో అస్వస్థకు గురవుతున్నారు. వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నవంబర్ 30న ప్రభుత్వ పాఠశాలల బంద్ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలు బంద్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సుమేర్, శివ శంకర్, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్, షాద్‌నగర్ అధ్యక్షుడు నరేష్, నాయకులు రాహుల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహభరితంగా కేక్ మిక్సింగ్ వేడుక



**విశ్వంభర, సంగారెడ్డి :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని హాస్పిటాలిటీ (ఆతిథ్య) విభాగం ఆధ్వర్యంలో శనివారం కేక్ మిక్సింగ్ వేడుకను ఉత్సాహభరితంగా విద్యార్థుల కేరింతల మధ్య పండుగ వాతావరణంలో నిర్వహించారు. హాస్పిటాలిటీ డిప్యూటీ డైరెక్టర్ అంభికా ఫిలిప్ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకలో విద్యార్థులు, పలువురు సిబ్బంది, పాకశాస్త్ర నిపుణులు శాంతాక్రజ్ వేషధారణలో పాల్గొని ముందస్తు క్రిస్మస్ వేడుక వాతావరణాన్ని సృష్టించారు. ఈ కేక్ మిక్సింగ్ వేడుకలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలువురు చెఫ్ లు, ఆతిథ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

## ఎన్ బాలమల్లేష్ గుండెపోటుతో మృతి



**విశ్వంభర, హైదరబాద్ :** సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎన్ బాల మల్లేష్ శనివారం గుండెపోటుతో మరణించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకుడిగా రాష్ట్ర అధ్యక్షులుగా, భారత కమ్యూనిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా చేసి ప్రస్తుతం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాధ్యతలో ఉన్నాడు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేశారు. పార్టీకి తీరంలోటని, ఆయన లేని లోటు భర్తీ చేయడం కష్టమన్నారు.

## విద్యార్థులకు సైకిళ్ళ పంపిణీ



**విశ్వంభర, బడంగ్‌పేట్ :** రోటరీ గ్లోబల్ ఛాంపియన్స్ రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ ఆధ్వర్యంలో వెల్జాన్ ప్రాజెక్ట్ సహకారంతో మహిళా సాధికారతలో భాగంగా బాలాపూర్ ఉన్నత పాఠశాలలో తల్లితండ్రులు లేని విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామానుజన్ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరం నుంచి పాఠశాలకు చేసిన రోటరీ సేవలను కొనియాడారు. రోటరీ గ్లోబల్ ఛాంపియన్స్ అధ్యక్షుడు రొటేరియన్ బీకే కర్ణ మాట్లాడుతూ.. అన్ని విధాల పాఠశాలకు పూర్తి సహకారం అందిస్తామని, విద్యార్థులు చక్కని విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని కోరారు. డైరెక్టర్ ఆఫ్ రోటరీ గ్లోబల్ ఛాంపియన్స్ అమెజాన్ సీనియర్ మేనేజర్ రొటేరియల్ వంశీ మాట్లాడుతూ.. ఇంకా పాఠశాల కావలసినటువంటి మౌలిక వసతులు సదుపాయాలు అంచలంచలుగా రోటరీ తన సేవను కొనసాగిస్తుందని అని అన్నారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు గడించాలని ఇంకా నిరుపేదలైన తల్లిదండ్రులు లేని విద్యార్థులకు విడుదలవారీగా సైకిల్ అందించడానికి పంపిణీ చేస్తామని తెలిపారు. పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ కుట్టు మిషన్లు, విద్యార్థులకు షూస్ ఇవ్వడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ రోటరీ గ్లోబల్ ఛాంపియన్స్ రొటేరియన్ కిరణ్ కర్ణ, రోటరీ గ్లోబల్ ఛాంపియన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ బీకే కర్ణ, డైరెక్టర్ ఆఫ్ రోటరీ ఛాంపియన్స్ వంశీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### టాలెంట్ పరీక్షలో

## గాధంపల్లి విద్యార్థి మణిదీప్ ప్రతిభ



**విశ్వంభర, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహర్ మండలం గాదంపల్లి నల్లాల వెంకటేష్ రమాదేవి దంపతుల కుమారుడు మణిదీప్ మ్యాథమెటిక్స్ టాలెంట్ పరీక్షలో కనభరిచాడు. కాటారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇటీవల జరిగిన మండల స్థాయి మ్యాథమెటిక్స్ టాలెంట్ పరీక్షలో వివిధ పాఠశాలల నుంచి 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కాటారం ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో గాదంపల్లికి చెందిన మనీదీప్ మొదటి స్థానంలో గెలుపొందడంతో పాఠశాల యజమాన్యం అభినందనలు తెలిపారు.

### వసతి గృహాల్లో విద్య, వైద్యం,

# శానిటేషన్‌లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు విజయంతం చేయాలి
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ వేగంగా స్పష్టంగా నమోదు చేయాలి
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలి
- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్ :** శనివారం ఉదయం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, కే వీర బ్రహ్మాచారిలతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉన్న అన్ని విభాగాల 1221 పాఠశాలలు, 127 వసతి గృహాలు, మొత్తం 1348 ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలలో పిల్లలకు అందిస్తున్న ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఫుడ్ కమిటీ ద్వారా తనిఖీలు చేసి నివేదికల సమర్పించాలని, ప్రత్యేక అధికారులు సంబంధిత ఆర్సీవోలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ప్రిన్సిపాల్స్ ప్రతినిత్యం మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్ మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, అందించాలని, నాణ్యమైన సరుకులను అందించాలని, నిల్వచేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉండాలన్నారు. వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు 24, జిల్లాలో ఇప్పటికే రాష్ట్రస్థాయి సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, జిల్లాలోని సాంస్కృతిక సారధులచేత మూడు బృందాలుగా విభజించి ప్రభుత్వం సూచనల ప్రకారం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు.

డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రత్యేక కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించుటకు తెలిపినందున, జిల్లాలో 1 తేదీ నుండి 9వ తేదీ వరకు విద్యాశాఖ, వైద్య ఆరోగ్య స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్, టీజీ ఎఫ్డిఎఫ్, పీఆర్ అండ్ రూరల్ డెవలప్మెంట్, విద్యుత్, హోమ్, పరిశ్రమలు, తదితర శాఖలపై రోజువారి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని, రైతులకు త్వరగా డబ్బులు జమ అయ్యేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీ స్పష్టంగా వేగంగా చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అధికారులు వసతి గృహాలు, పాఠశాలలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై తనిఖీలు నిర్వహిస్తూ నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో డీసీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీసీఈవో పురుషోత్తం, ఎస్ఈ ఎన్పీడీసీఎల్ నరేష్, డీహెచ్ఓ మరియన్న, ఈఈ భీమ్లా నాయక్, డీపీఓ హరిప్రసాద్, డీఈవో రవీందర్ రెడ్డి, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అమ్మనబోలును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

### - బీఆర్ఎస్ అమ్మనబోలు గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ము యాదగిరి






**విశ్వంభర, అమ్మనబోలు :** రాష్ట్రంలో నూతన మండల కేంద్రాలను ప్రకటిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అమ్మనబోలు మండల కేంద్రం ఏర్పాటుపై తుది గెజిట్‌ను జారీ చేయాలని బీఆర్ఎస్ అమ్మనబోలు గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ము యాదగిరి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మనబోలు మండల కేంద్రం ఏర్పాటు కావాలని, ఎన్నో ఏళ్లుగా ప్రజలు పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే అన్నారు. ప్రజల పోరాటాలను, ఆకాంక్షను గుర్తించిన గత ప్రభుత్వం సెప్టెంబర్ 27/2023న 8 గ్రామాలతో కూడిన అమ్మనబోలు మండల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ.. ప్రాథమిక నోటిఫికేషన్(G.O.Rt.No:333)ను జారీ చేసి, అక్టోబర్ 12/2023 వరకు అభ్యంతరాలకు గడువిచ్చిందని గుర్తుచేశారు. అదే సమయంలో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో, మండల ఏర్పాటు ప్రక్రియ తుది నోటిఫికేషన్‌కు ఆటంకం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నూతన మండల కేంద్రాలను ప్రకటిస్తున్న నేపథ్యంలో ప్రజల కోరిక మేరకు అమ్మనబోలు మండల ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను జారీ చేసే విధంగా చర్యలు తీసుకోగలరని డిమాండ్ చేశారు. లేని యెడల అమ్మనబోలును మండల కేంద్రంగా ప్రకటించే వరకు అమ్మనబోలు మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేస్తామని బీఆర్ఎస్ అమ్మనబోలు గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ము యాదగిరి హెచ్చరించారు.

## అభివృద్ధికి నిధులు కేటాయించాలని కలెక్టర్‌కు వినతి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎల్బీనగర్ నియోజకవర్గ సమస్యలను వివరించడం జరిగింది. వివిధ కాలనీలలో రోడ్లు, డ్రైనేజీలతో పాటు, పాఠశాలల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ విడుదల చేసి అభివృద్ధి పనులు చేపట్టాల్సిందిగా కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి నిధులను విడుదల చేస్తానని హామీ ఇచ్చినట్లు మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు.

## సీనియర్ సిటిజన్ భవన్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తాం

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీలోని సీనియర్ సిటిజన్‌ను పూర్తిస్థాయిలో ఆధునికరించి అందుబాటులోకి తీసుకువస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శనివారం అగ్రి కల్చర్ కాలని, ఖాద్రి కాలని సభ్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అగ్రికల్చర్ కాలనిలో గతంలో సీనియర్ సిటిజన్ భవన్ సభ్యుల కోసం స్లాబ్ వేసినట్లు గుర్తు చేశారు. సీనియర్ సిటిజన్ భవనం వెంటనే అసంపూర్తిగా ఉన్న నిర్మాణంలో గోడలు నిర్మించి దానిమీద మరో అదనపు అంతస్థు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఖాద్రి కాలనీ నందు కొన్ని గల్లీల నందు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అగ్రికల్చర్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న సీనియర్ సిటిజన్ భవన్‌ను పూర్తి స్థాయిలో ఆధునికీకరణ చేయించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. దాదాపు రూ. 80 లక్షల వ్యయం కావడం జరుగుతుందని తెలిపారు. ఖాద్రి కాలనీ నందు మిగిలిపోయిన గల్లీల నందు సీ.సీ.రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ నాయక్, రఘుమారెడ్డి, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, హరివర్ధన్, అల్వాల్ రెడ్డి, మణిపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను సత్కరించిన భీమారం కబడ్డీ క్రీడాకారుల బృందం



**విశ్వంభర, హన్మకొండ :** హన్మకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మొహమ్మద్ అజీజ్ ఖాన్ రెండవ సారి ఎన్నికైన సందర్భంగా శనివారం 55వ డివిజన్ భీమారంలో నేతాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సరిపడా పుస్తకాలు అందిస్తూ వారికి తోడ్పడాలని తెలిపారు. కబడ్డి అసోసియేషన్ బాధ్యులుగా కబడ్డి క్రీడాకారులకు తోడ్పాటునందించి, భవిష్యత్తులో మరింత మందిని క్రీడాకారులను తయారు చేస్తూ.. క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కబడ్డి అసోసియేషన్ హన్మకొండ జిల్లా సెక్రటరీ ఆకుల సారంగపాణి, అడ్వైజర్ బిన్నీ లక్ష్మణ్, జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కందుల సృజన్ కుమార్, జాతీయ స్థాయి కబడ్డి క్రీడాకారులు చెట్లపెల్లి లింగమూర్తి, సంగాల విక్టరీ బాబు, ఆకుల కుమార్, పల్లపు కిషన్, సంగాల రాజు, జక్కుల రాజు, అటికం శ్రావణ్, పల్లపు రవికుమార్, చింతల నరేష్, బర్ల రేవంత్ మరియు కబడ్డి క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మనసుకు ప్రశాంతత

### చిలుక ఉపేందర్ రెడ్డి

**విశ్వంభర, సరూర్‌నగర్ :** ఆధ్యాత్మిక చింతనతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ అయ్యప్ప దీక్ష మాలలో హైదరాబాద్ నుంచి శబరి మాలై వరకు కాలి నడకన అయ్యప్ప దర్శనం చేసుకొని తిరిగి వచ్చిన యాల్లాస్కంపేట్ మహేష్ స్వామిని శనివారం చిలుక ఉపేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప మాల ధరించి ఎంతో నిష్టగా పూజలు నిర్వహిస్థారన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, పెద్దవూర సైదులు, పగడాల శ్రీశైలం, శివ, వట్టికోటి అనిల్, ప్రశాంత్, అనుదీప్, క్రాంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, మర్పల్లి :** మర్పల్లిలో శనివారం మాలల సింహా గర్జన పోస్టర్ ఆవిష్కరణ చేశారు. హైదరాబాద్‌లో జరగబోయే మాలల సింహా గర్జన సభ విజయవంతం చేయాలని మర్పల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు తక్కలి శివ మాట్లాడుతు రేపు జరగబోయే మాలల సింహ గర్జన మాలల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే ఒక శుభ సూచిక అని యావత్ దేశం రేపు జరుగబోయే మాలల సింహ గర్జన గురించి చర్చించే స్థాయిలో తరలి రావాలని ఆయన పేర్కొన్నారు. కోల్పోతున్న మాలల ఉనికిని కాపాడాల్సిన బాధ్యత మన అందరి పైన ఉన్నది అని ఆయన తెలిపారు. బానిస సంకెళ్ళు బరితెగిస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో రేపు జరగబోయే సింహ గర్జన లో సమాజానికి తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు యాదయ్య. జగన్, శోభన్, పెంటయ్య, శేఖర్, పైలు నర్సింలు, భరత్ తదితరులు ఉన్నారు.

## ఎస్సీ హాస్టల్ నూతన భవనం ప్రారంభించాలి

### యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరబాబు



**విశ్వంభర, మహబూబాబాద్ :** కొరివి మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ని యూఎస్ఎఫ్ఐ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరబాబు మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్ విద్యార్థుల కోసం గత ప్రభుత్వం గతంలో నూతన భవనాన్ని పోరాటాల ఫలితంగా నూతన భవనాన్ని కేటాయించారని ఆయన అన్నారు. కాని నేటికీ హాస్టల్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రారంభానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు నూతన భవనం ప్రారంభించాలని వారు అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు అద్దె భవనంలోని రేకుల షెడ్‌లో ఇరుకు గదుల్లో వర్షం వస్తే కురిసేటువంటి ఇంట్లో ప్రస్తుతం విద్యార్థులు ఉంటున్నారు అని, ఈ రేకుల షెడ్ లో విద్యార్థులు ఉండడంవల్ల ఎప్పుడు ఏం జరుగుతుందో భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం అయినా వేగవంతంగా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి హాస్టల్‌ని ప్రారంభించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఇద్దరు నకిలీ విలేకరుల అరెస్ట్



**విశ్వంభర, మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు నకిలీ విలేకరులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం.. ఈ నెల 24న మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన చౌదారపు వెంకటరమణ అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా మెట్పల్లి పట్టణంలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు తన సాతారంలో గల ఇంటికి వెళ్తున్న క్రమంలో కొంత కిరాణ సామాన్ కారులో తీసుకు వెళ్తుండగా వేంపేట శివారులోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ వద్ద కారులో ఒక వ్యక్తి వచ్చి వెంకటరమణ కారును ఆపి నకిలీ సామానులను తీసుకు వెళ్తున్నావని వెంకటరమణను బెదిరింపులకు శేఖర్ అనే వ్యక్తి పాల్పడ్డాడు. దీంతో కంగారుపడిన వెంకటరమణ నేను సామానుకున్న దుకాణంకు వెళ్దాము ఇవి నకిలీవి కావు అని శేఖర్‌కు చెప్పగా మరొక రిపోర్టర్లను ఫోన్ ద్వారా కార్తీక్ అనే విలేకరిని పిలిపించాడు ఇరువురు కలిసి వెంకటరమణను బెదిరించి అతని సెల్ ఫోన్ లాక్కొని అందులో గల నాలుగు వేల రూపాయలను శేఖర్ అకౌంట్‌కు ట్రాన్స్ఫర్ చేసుకొని వెంకటరమణను వదిలివేయడంతో వెంకటరమణ మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వీరి ఇరువురిపై ఫిర్యాదు చేయగా అప్పటినుండి పరారీలో ఉన్నారు. నిందితులిద్దరు మెట్‌పల్లి లోని పెట్రోల్ పంపు వద్ద ఉన్నారన్న పక్క సమాచారంతో వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒక కారు, ఒక బైక్ రెండు ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. విలేకరుల ముసుగులో బెదిరింపులు అక్రమ వసూలుకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## ఆంగ్ల భాషపై పట్టు ఎంతో ముఖ్యం

### డీఆర్డీఓ సైంటిస్ట్ డా. బసంత్ కుమార్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు ఎంతో ముఖ్యం అని డీఆర్డీఓ సైంటిస్ట్ డా. బసంత్ కుమార్ అన్నారు. శనివారం ఎల్బీనగర్ నారాయణ స్కూల్, దిల్‌సుక్‌నగర్‌కు చెందిన నారాయణ విద్యా సంస్థల 11 బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులకు ఆంగ్ల బాషా పైన మాస్టర్ ఓరియంట ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా .బసంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో తట్టుకొని ఉద్యోగాన్ని త్వరగా సాధించాలంటే ఇంగ్లీష్ భాష ఎంతో ముఖ్యమన్నారు. ఇంగ్లీష్ భాషపై ప్రావీణ్యం పెంచుకుంటే అవకాశాలు పుష్కలంగా వస్తాయన్నారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్యూరీ మెంబర్స్ ప్రో. రవి కుమార్, విశ్రాంత లెక్చరర్ సుబ్బారావు, నారాయణ గ్రూప్ స్కూల్స్ జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం హేమెంబెర్, ఆర్ఐ రవి ప్రసాద్, నారాయణ విద్య సంస్థల జోన్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఆర్ అండ్ డీ హెడ్ మహేశ్వరి, జోనల్ కోర్డినేటర్ గాయత్రి, ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఏఓ కరుణాకర్, పీఈటీ శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# 'సమూహ' రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- కరపత్రాల ఆవిష్కరణ
- కార్యక్రమ విజయవంతానికి కవి సమ్మేళనాలు నిర్వహించాలని పిలుపు
- రాజ్యాంగ విలువలను కాపాడే అన్ని సంస్థలు పాల్గొనాలని విజ్ఞప్తి




**విశ్వంభర, మహబూబ్ నగర్:** 'సమూహ' సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభలు డిసెంబరు 14 న మహబూబ్ నగర్ పట్టణంలో జరగనున్నాయి. కాబట్టి ఈ సభలను విజయవంతం చేయాలని కోరుతూ 'సమూహ' కరపత్రాలను రాష్ట్ర బాధ్యులు కాత్యాయని విద్మహే, మెట్టు రవీందర్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరణ చేశారు .
భారత రాజ్యాంగం
ఆదర్శవంతమైన లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్య స్థాపనకై అన్ని మతాలు కలిసి సహోదరత్వం తో కలిసి సుఖంగా జీవించడానికి అనువైన వాతావరణం భారత రాజ్యాంగం కల్పించింది. ప్రజలు భిన్న మతావిశ్వాసాల పట్ల పరస్పర గౌరవంతో సామరస్యంగా,సోదర భావంతో జీవించాలనే లౌకిక ప్రజాస్వామిక విలువలు రాజ్యాంగంలో పొందుపరిచారు. ఎవరి మత విశ్వాసాలను వారు అనుసరిస్తూనే మిగతా మతాలను గౌరవించేటటువంటి ఒక స్నేహపూర్వకమైన ప్రజాస్వామ్య విలువలను మనందరం కూడా కాపాడుకోవాలి. లౌకిక సామ్యవాద భావనలను భారత రాజ్యాంగంలో నుండి తీసివేయాలనేటటు వంటి కుట్రలను మనందరం కూడా ఖండించాలని వక్తలు పిలుపు నిచ్చారు. ఈ సభలు విజయవంతం కావడానికి ఉమ్మడి జిల్లా కేంద్రాలలో ఈ కరపత్రాలను ఆవిష్కరించి, కవి సమ్మేళనాలను నిర్వహించి ఈ సభల ఉద్దేశాన్ని విరివిగా ప్రచారం చేయాలని కోరడం జరిగింది. సమూహ ఆశయాలను లక్ష్యాలను భారత రాజ్యాంగ పరిధిలో అందరికీ తెలియజేయాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో సమూహ కార్యవర్గ సభ్యులు ఉదయమిత్ర, గుడిపల్లి నిరంజన్, అదే విధంగా ఆహ్వాన కమిటీ సభ్యులు రాఘవాచారి ,ఎస్ జగపతిరావు, కె లక్ష్మణ్ గౌడ్, ఖలీల్, వామన్ కుమార్,ఉదయ్,సుభాష్ సతీష్,సృజన, ఖలీల్,అజీజ్, శ్రీశైలం,రెహమాన్, జనార్ధన్ పాల్గొన్నారు.

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురించి
# మాట్లాడే అర్హత కొండా సురేఖకు లేదు
### మండల ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్ నాయక్



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం :** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురించి మాట్లాడే కనీస అర్హత కొండా సురేఖకు లేదని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకులాల్లో నాసిరక ఆహారంతో విద్యార్థులు అవస్థలు పడుతున్న తరుణంలో దానిని సరి చేయాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని మరిచి, కొండ సురేఖ మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ల విషయంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తముందని చెప్పడం కొండ సురేఖ విజ్ఞానానికి వదిలేస్తున్నామని అన్నారు. ఆ శాఖ కు మంత్రి లేకపోవడం వలన విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యం అయిందన్నారు. ఇప్పటికైనా గురుకులాల్లో విద్యార్థులు పడుతున్న అవస్థలను గుర్తించి వారికి నాణ్యమైన ఆహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా గురుకులల్లో ఉద్యమాన్ని చేపడుతామన్నారు.

# పంతకాని రాజుకు వరల్డ్ పిక్టోరియల్ ఫోటోగ్రఫీ డే అవార్డు






**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఫోటోగ్రాఫర్ పంతకాని రాజు ఆదివాసీ జీవన కళా సౌందర్యంపై తీసిన ఫోటోకు పిక్టోరియల్ కళాత్మక ఉత్తమ ఛాయాచిత్ర కారుడి అవార్డు లభించింది. 132వ "వరల్డ్ పిక్టోరియల్ ఫోటోగ్రఫీ డే" డిసెంబర్ 1సందర్భంగా ఉభయ రాష్ట్రాలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ & ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన ఫోటో కాంటెస్ట్ లో ఈ అవార్డు లభించింది. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆవరణలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రో. రామమోహన రావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంచార్జీ వైస్ ఛాన్సలర్ గంగాధర రావు, డిపార్ట్మెంట్ ఆఫ్ జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్ బాధ్యులు డా.మధు బాబు, కార్యక్రమ సమన్వయ కర్త తమ్మ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్, మెడల్‌ను అందుకోవడం జరిగింది. ప్రకృతి,సహజమైన జీవన చిత్రాలు రేపటికి ఒక రూపంగా,కళాత్మకంగా భద్రపరిచే పిక్టోరియల్ ఫోటోగ్రఫీ లో ఈ అవార్డు రావడం మాకు చాలా సంతోషంగా ఉందని పంతకాని రాజు అన్నారు.

# నర్సింగ్ విద్యార్థులకు ఎయిడ్స్ పై అవగాహన



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సింగ్ విద్యార్థులకు హెచ్ ఐ వీ ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమము నిర్వహించారు. కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్ హెచ్ పీ డాక్టర్ వందన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహాదేవపూర్ సమీకృత సలహా పరీక్ష కేంద్రం కౌన్సిలర్ రమేష్ అవగాహన కల్పించారు. హెచ్ఐవీ వ్యాధి వ్యాప్తి నివారణ చర్యలు తీసుకోవాలని జాగ్రత్తల గురించి వారికి వివరించారు. సమాజంలో హెచ్ఐవీ వ్యాధి చాప కింద వ్యాపిస్తున్న నేపథ్యంలో యువత విద్యార్థులు మేల్కొని సమాజాన్ని జాగ్రత్త చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్, వివేకానంద ఒకేషనల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి
### - మాజీ సర్పంచ్ ఉజ్జిని నరేందర్ రావు



**విశ్వంభర, చింతపల్లి :** విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఉజ్జిని నరేందర్ రావు పేర్కొన్నారు. చింతపల్లి మండలం గడియ గౌరారం గ్రామానికి చెందిన ఉజ్జిని శ్రీధర్ రావు నాగర్ కర్నూల్ జిల్లాలో ఇరిగేషన్ ఈఈ గా ఉద్యోగం చేస్తూ శనివారం పదవి విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఉజ్జిని నరేందర్ రావు పాల్గొని మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ ఈఈ అధికారిగా ఉజ్జిని శ్రీధర్ రావు తనకు కేటాయించిన విధుల పట్ల నిబద్ధతో పనిచేశారని, ఇరిగేషన్ శాఖ సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షించారన్నారు. ఆయన వెంట ఉజ్జిని రఘు రామారావు, ఆదిరాల కృష్ణయ్య, కంబాలపల్లి సైదులు ఉన్నారు.

### జిల్లా వ్యాప్తంగా నెల రోజులపాటు
# 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు
### జిల్లాఎస్ పీ రూపేష్



విశ్వంభర, సంగారెడ్డి: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు (డిసెంబర్ 1 నుండి 31 వరకు) 30, 30(ఎ) పోలీసు యాక్ట్1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్ పి రూపేష్ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసులకు సహకరించవలసిందిగా సూచించారు.అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

### పదవీ విరమణ సందర్బంగా
# ఎస్.ఐ వెంకటరాములుకు ఘనంగా సన్మానం



**విశ్వంభర, మహబూబాబాద్:** పోలీస్ శాఖ నందు సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి ప్రస్తుతం మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తు పదవీ విరమణ పొందిన ఎస్ఐ పి. వెంకటరాములు జిల్లా పోలీస్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమం లో జిల్లా అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య వారిని శాలువా,పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలియజేశారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి తెలియజేశారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, రూరల్ సీఐ శరవయ్య, ఆర్.ఐ అడ్మిన్ అనిల్, రూరల్ ఎస్.ఐ దీపిక,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కోతలు లేని విద్యుత్తును అందించడమే లక్ష్యం

**విశ్వంభర, భూపాలపల్లి :** నియోజకవర్గ పరిధిలోని చిట్యాల మండలం నైన్ పాక గ్రామంలో సుమారు రూ.110 లక్షలతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు ఒడితల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన కోతలు లేని విద్యుత్ ను అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. నైన్ పాక సబ్ స్టేషన్ లో మొత్తం మూడు ఫీడర్లు (నైన్ పాక, చైన్ పాక, వరికోల్ పల్లి) ద్వారా నిరంతర విద్యుత్ సౌకర్యం అందనున్నట్లు తెలిపారు.

# పోలీస్ శాఖలో ఫిజికల్ ఫిట్నెస్ చాలా కీలకం

- ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ పెరేడ్
- నూతనంగా నియమించబడిన ఎ.ఆర్, సివిల్ కానిస్టేబుల్స్ కు వీక్లీ పెరేడ్
- వివిధ సెక్షన్, వర్టికల్స్ విభాగాలపై అవగాహన కార్యక్రమం
- సత్ ప్రవర్తకన కలిగి, ప్రజలలో పోలీసు ఇమేజ్ పెంచే విధంగా విధులు నిర్వహించాలి
- ఎస్.పి రూపేష్



**విశ్వం భర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్స్ నందు నూతనంగా నియమించబడిన ఎ.ఆర్ మరియు సివిల్ కా నిస్టేబుల్స్ కు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ పరేడ్ ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్ పి రూపేష్ తెలియజేశారు. ఫిట్నెస్ ను కాపాడుకోవాలని, శారీరకంగా, మానసికంగా ఫిట్ గా ఉన్నప్పుడే ఎలాంటి పరిస్థితులలోనైనా తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలం అని అన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, ఆపదలో స్టేషన్ కు వచ్చిన వారికి మీ మాటతీరు వారిలో ఒక భరోసాను కల్పించాలని అన్నారు. మీ యొక్క ప్రవర్తన ప్రజలలో పోలీస్ యొక్క ఇమేజ్ పెంచే విధంగా ఉండాలన్నారు. వీక్లీ ప్రాతిపాదికన నిర్వహిస్తున్న ట్రైనింగ్ కార్యక్రమంలో పోలీస్ శాఖ పని తీరు, వివిధ సెక్షన్స్, వర్టికల్స్ మరియు నూతన చట్టాల గురించి వివరించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు అన్ని విభాగాల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండి ఎలాంటి విధులనైనా సమర్ధవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్ పీ సూచించారు.పోలీస్ స్టేషన్ నందు సీనియర్స్ తో మరియు అధికారులతో మర్యాదగా నడుచుకోవాలని, అధికారులు చెప్పిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరు కూడా తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్ హెడ్ క్వార్టర్స్ నందు నివాసం ఉండాలని 24*7 అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఇతర దూర ప్రాంతాల నుండి ప్రయాణాలు ప్రమాదలకు దారితీసే అవకాశం ఉందని పోలీస్ స్టేషన్ హెడ్ క్వార్టర్స్ నందు నివాసం ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు, బానిసలు కాకూడదని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, ఇటు పోలీస్ శాఖకు, అటు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నానని, అదేవిధంగా జిల్లా పోలీస్ శాఖలో చేరుతున్న సిబ్బంది అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్.పీ ఎ.సంజీవ రావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, పటాన్ చేరు డీ.యస్.పీ రవీందర్ రెడ్డి, యస్.బి సీఐ విజయ్ కృష్ణ, ఆర్.ఐ.లు రామ రావ్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, శ్రీనివాస్ మరియు జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్ ఇన్స్పెక్టర్ ప్లటూన్ ఇంచార్జ్ లు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత
### మాజీ జెడ్పీటీసీ కంకణాల ప్రవీణా వెంకట్ రెడ్డి



**విశ్వంభర, చింతపల్లి :** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చింతపల్లి మాజీ జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో పెద్దమ్మ, ముత్యాలమ్మ దేవతలకు మకర తోరణాల ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. మకర తోరణాల దాతలు దెంది శోభ వెంకట్ రెడ్డి, దెంది వినోదమ్మ జంగారెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు. గత పది సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వంలో ప్రజలు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందించిందని ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ఈ సారి కూడా నిర్విఘ్నంగా ప్రభుత్వ పథకాలు అన్ని అంది, ప్రభుత్వ కార్యకలాపాలు ఆటంకాలు లేకుండా కొనసాగాలని మనసారా ఆ భగవంతుని ప్రార్థించునట్లు ఆమె తెలిపారు. ప్రజలు మంచి ఆరోగ్యంతో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమలో గొల్లపల్లి శివ మాల ధారణ స్వాములు, నక్కనమోని పరమేష్, కేతావత్ జగన్ నాయక్, శ్రీను నాయక్, పరమేష్ నాయక్, అనంతుల మల్లేష్, అనంతుల కాటమయ్య, శ్రీకాంత్, శివ, వెంకట్ రెడ్డి, బుచ్చి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నారయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ క్లబ్ లో ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్
### * ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ



**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ సుబేదారి లోని వరంగల్ క్లబ్ నందు సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు కి.శే..శ్రీనివాస్ గౌడ్ జ్ఞాపకార్థం 2లక్షల 50వేల రూపాయల బహుమతితో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ నేషనల్ లెవెల్ మెన్స్ ఓపెన్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే నాగరాజు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా దేశాల నుండి వచ్చిన క్రీడాకారులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. అదేవిధంగా వరంగల్ క్లబ్ టెన్నిస్ ఆర్గనైజేషన్ వారితో కలసి టెన్నిస్ ఓపెన్ టోర్నమెంట్ కు టాస్ వేసి ప్రారంభించడం జరిగింది. అలాగే ఆల్ ఇండియా నుంచి విచ్చేసిన మెంటర్స్ క్రీడాకారులు ఉమ్మడి వరంగల్ జిల్లా విశిష్టతను కాకతీయుల నాటి కళ ఖండాలను వీక్షించి కాకతీయ చరిత్రను ఇక్కడ ఉన్న ప్రాచీనమైన దేవాలయాలను దర్శించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్లా మురుగు, రాజేశ్వరరావు, సెక్రెటరీ మోహన్ రెడ్డి, క్యాషియర్ ప్రవీణ్, జాయింట్ సెక్రెటరీ కన్నారెడ్డి ఈసీ మెంబర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### మైనారిటీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను సందర్శించిన
# టీపీసీసీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు

**విశ్వంభర, మెట్ పల్లి:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మైనారిటీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ను ఆకస్మిక తనిఖీ చేసిన టీపీసీసీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు వారితో పాటు ఆర్డీఓ శ్రీనివాస్ ఎంఈఓ చంద్రశేఖర్ ,పాఠశాలలోని భోజనశాల, భోజనానికి సంబంధించిన డ్రింకింగ్ వాటర్, పడక గదులను పరిశీలించిన అనంతరం స్కూల్ పిల్లలతో కలిసి భోజనం చేశారు. అలాగే వారు స్కూల్ ప్రిన్సిపాల్ తిరుపతి తో మాట్లాడి దీనిని ఇలానే కంటిన్యూ చేయాలని ఏమైనా అసౌకర్యాలు, ఇబ్బందులు ఉన్నచో ఆర్డీవోకి, ఎంఈఓ కి అలాగే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పడం జరిగినది . కార్యక్రమంలో పట్టణ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి లింగం,అల్లూరి మహేందర్ రెడ్డి,కౌన్సిలర్లు యమా రాజయ్య, ఎర్రోళ్ల హన్మాంళ్లు మాజీ సర్పంచ్ లు పుదారి నర్సా గౌడ్,కోమిరెడ్డి లింగారెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ జీవన్,కోరుట్ల పట్టణ,మండల,బ్లాక్ అధ్యక్షులు గంగాధర్,కోమతం రాజం ,సత్యనారాయణ గౌడ్,ముకేమ్,ఉప సర్పంచ్ ఆగ బాలయ్య టి రాంప్రసాద్ నాయకులు పాల్గొన్ననారు.



# రైతుల పై కాంగ్రెస్ ప్రభుత్వం మొసలి కన్నీరు
### - మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్

**విశ్వంభర, కడ్తాల్ :** కాంగ్రెస్ సర్కారు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ రైతులకు నయా పైసా న్యాయం చేయకుండా రైతు పండగ చేయడం హాస్యాస్పదంగా ఉందని కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. రేవంత్ సర్కార్ రైతుల కోసం చేస్తుంది రైతు పండగ కాదని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే దండగాని మండిపడ్డారు. రైతు పండగ కోసం రైతులు ఎవ్వరూ రావడానికి ఇష్టపడట్లేదని తమను నమ్మించి నట్టేట ముంచిన రేవంత్ సర్కార్ పై దుమ్మెత్తి పోస్తున్నారని ఫైర్ అయ్యారు. కడ్తాల్ మండల కేంద్రంలో రుణమాఫీ కానీ రైతులతో సెల్ఫీలు దిగి రేవంత్ సర్కార్ కి కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నామని తెలిపారు. రైతులకు రుణమాఫీ కాలేదని, రెండు పంటలు పండించిన ఇంతవరకు రైతుబంధు రాలేదని మండిపడ్డారు. దీనికి తోడు పాడి రైతులను పట్టించుకునే నాధుడే కరువయ్యాడని తెలిపారు. అధికారంలోకి రావడం కోసం రేవంత్ రెడ్డి మాట్లాడినవన్నీ బ్రోకర్ మాటలేనని అధికారంలో వచ్చినంక కూడా అదే బ్రోకర్ మాటలు మాట్లాడుతున్నారని మండి పడ్డారు. రుణమాఫీ కానీ రైతులతో తాము దిగిన సెల్ఫీలను చూసి అయినా రేవంత్ సర్కార్ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచించారు. రైతు పండగ కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు ఎవరు రావడానికి సుగుముఖంగా లేరని రైతు పండుగకు రావాలని ఏవోలు రైతులను బతిమిలాడుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, సులోచన సాయిలు, భాగ్యమ్మ, జంగయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, మంగళపల్లి నరసింహ, అశోక్ మహేష్, రామచంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, భూపాలపల్లి :** శనివారం భూపాలపల్లి నియోజకవర్గం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి, పెద్దకుంటపల్లి, కాశింపల్లి, జంగేడు తోపాటు భూపాలపల్లి గ్రామీణ మండలం గుడాడుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో విక్రయించాలని రైతులకు సూచించారు. ధాన్యం తూకం విషయంలో రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.

# ఎల్ఓసీని అందజేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే



**విశ్వంభర, హనుమకొండ :** హన్మకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల పరిధిలోని ల్యాబర్తి బొక్కలగూడెం గ్రామానికి చెందిన వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ నాయకులు కుల్ల యాకాంతం తల్లి కుల్ల అరుణ ఆరోగ్య అవసరాల కోసం 1 లక్ష రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి (LOC) లెటర్‌ని వారి కుటుంబ సభ్యులకు వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోశాల వెంకన్నగౌడ్, భీమానాయక్, కొండేటి బాలకృష్ణ, మరుపట్ల సాయికుమార్, ల్యాబర్తి గ్రామ కాంగ్రెస్ నాయకులు బత్తిని రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు కుటుంబాలకు బాసటగా భద్రత స్కీమ్
### భద్రత ప్రమాద భీమా చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ విభాగం నందు సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న శ్రీనివాస్ రెడ్డి ఆకాలంగా మరణించడం జరిగినది. ఇతని కుటుంబ సభ్యులకు పోలీసు భద్రత స్కీమ్ ద్వారా 8 లక్షల రూపాయల చెక్కును ఈరోజు జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ జిల్లా పోలీసు కార్యాలయం నందు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుంది. భద్రత పథకం సిబ్బంది కుటుంబాలకు బాసటగా ఉన్నది అన్నారు. ఈ కార్యక్రమం నందు అధనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఓ మంజు భార్గవి, పోలీసు సమంఘం సెక్రెటరీ వెంకన్న, సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

# అంధుల పాఠశాలకు మూడు కంప్యూటర్ టేబుల్స్ వితరణ

**విశ్వంభర, మలక్‌పేట్ :** అంధుల ప్రాథమిక పాఠశాలకు సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అయినటువంటి అభిరామి వెంకటేష్ మామగారైన కీర్తిశేషులు సెల్వరాజ్ కృష్ణమూర్తి జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థుల కొరకు మూడు కంప్యూటర్ టేబుల్స్ అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. తమ తరఫున మరింత సహకారం అందిస్తామని, విద్యార్థులు దానిని ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జావీద్, రవీందర్ రెడ్డి, జానయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



## బీఆర్ ఎస్ అబద్ధాల ప్రచారాలు

*** ఆ పార్టీనేతలు తెలంగాణను నాశనం చేశారు**

*** టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్**



**విశ్వంబర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబంతో సహా బీఆర్ ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు దోచుకుని నాశనం చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినా బీఆర్ ఎస్ అబద్ధాలు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. గ్రామాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని కాంగ్రెస్ నేతలకు పిలుపునిచ్చారు. కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, అన్ని రకాల పదవుల్లో నాయకులకు అవకాశం ఇస్తామని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో ఎస్టీ సెల్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. భారాస, భాజపా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రిని చేసేందుకు మనందరం కృషి చేయాలన్నారు. నాగార్జునసాగర్‌లో వారంరోజులపాటు ఆదివాసీ క్యాంపు ఏర్పాటు చేసి వారి అంశాలపై లోతుగా చర్చిస్తామని ఏఐసీసీ నాయకుడు కొప్పుల రాజు తెలిపారు. ఆదివాసీ క్యాంపులో రోజుకు 7, 8 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు.

## ప్రజా విజయోత్సవ కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** డిసెంబర్ 1 నుండి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను అదేశించారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, ఆదివారం జరుగనున్న ప్రజా పాలన విజయోత్సవ వేడుక కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యాలయాలు విద్యుద్దీకరణ తదితర అంశాలపై శనివారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీ నుండి 9వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వేతర సంస్థలను విద్యుద్ధికరణ చేయాలని ఆదేశించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలో ని ప్రధాన కూడళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు సుభాష్ నగర్ కాలనీలోని, సింగరేణి కమ్యూనిటీ హాలులో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో జరుగనున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. 1 నుండి 9 వరకు ప్రతిరోజు ఒక్కో శాఖ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ప్రతి రోజు చేసిన కార్యక్రమాలను డాక్యుమెంటేషన్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీపీఆర్వో శ్రీనివాస్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## బొల్లారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం బొల్లారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.పీ రఘునందన్ రావు ని మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను సభ్యులు ప్రస్తావించారు. వాటిలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. కేంద్రం నుంచి అందుతున్న నిధులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎం.పీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చేలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయా వార్డులలో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలపై బడ్జెట్ కేటాయింపులు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంగతాయారు,కౌన్సిలర్ లు ,కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ మల్లికార్జున్,(ఆర్ ఓ) నర్సింలు , ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగంలో హక్కుల కొరకే మా పోరాటం

**- ధర్మ సమాజ్ పార్టీ**



**విశ్వంభర, ఆమనగల్లు:** అణగారిన వర్గాలైన పేద ప్రజలు బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు,విద్యా,వైద్యం, ఉపాధి ,భూమి,ఇల్లు అందించాలని ప్రధానమైన అంశాలపై ఆమనగల్లు తాహాసీల్దార్ కార్యాలయం ముందు ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో 25 శాతం నిధులు విద్యకి కేటాయించాలని, 25 శాతం నిధులు వైద్యానికి, 25 శాతం నిధులు ఉపాధికి కేటాయించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రీలే నీరహదీక్షలు రాస్తారోకోలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ధర్మ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా కో కన్వీనర్ కల్వకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ వంకేశ్వరం రమేష్, ఆమనగల్లు మండల నాయకులు బలరాం తలకొండపల్లి మండల నాయకులు జగన్ మాడుగుల మండల నాయకులు హరి, ప్రవీణ్, యాదగిరి, మహేష్, గోపాల్ నాయక్, పరమేశ్వర్, శ్రీశైలం,శివ,జంగయ్య పాల్గొన్నారు.

## నిమోనియా లక్షణాలను గుర్తించే పోస్టర్ విడుదల

**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో శనివారం డాక్టర్ జి మురళీధర్, నిమోనియా లక్షణాలను గుర్తించే పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నిమోనియా అంటే ఊపిరితిత్తులలో క్రిముల ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే వ్యాధి అని, నిమోనియా ఒక తీవ్రమైన వ్యాధి మనదేశంలో ఐదేళ్లలోపు పిల్లలు మరణాలకు ఇదే ప్రధాన కారణమన్నారు. నిమోనియా లక్షణాలను కనిపించిన వెంటనే బిడ్డను ఆరోగ్య కార్యకర్త లేదా ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. శ్వాస తీసుకునేటప్పుడు పక్కటెముకలు కదలడం లేదా ఛాతి లోనికి పోవడం తీవ్రమైన జ్వరం, నిమోనియా యొక్క తీవ్రమైన లక్షణాలు, తినలేక త్రాగలేకపోవడం, మగతగా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ ప్రమీల,ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ,డాక్టర్ సారంగం, హెల్త్ ఎడ్యుకేటిర్స్ కె.వి.రాజు, గీత, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, ఎల్ డి కంప్యూటర్ అరుణ్ మరి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**కాకతీయ విశ్వవిద్యాలయంలో**

# విద్యార్థుల సమకాలీన సమస్యల పరిష్కారంపై సమీక్ష



**విశ్వంభర, హనుమకొండ:** కాకతీయ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రతాప్ రెడ్డి,రిజిస్టర్ మల్లారెడ్డి పాలక వర్గం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి,మౌళిక సదుపాయాల కల్పన,విద్యార్థుల సుదీర్ఘ,సమకాలిక సమస్యల పరిష్కారంపై పరిపాలన భవన మందిరంలో స్థానిక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి , వరంగల్ ఎంపీ శ్రీమతి కడియం కావ్య తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో అన్ని విభాగాల అధ్యాపకుల గురించి పలు అంశాల పైన కూలంకుషంగా చర్చించటం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేయగా నేడు మన ప్రజా ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులు ఇబ్బంది పడవద్దనే సదుద్దేశంతో యూనివర్సిటిని ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం అయ్యాయి అనే అంశం పైన కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల గురించి నాక్ నుంచి వచ్చే నిధుల గురించి పార్ట్ టైం అధ్యాపకుల జీతభత్యాలు తదితర అంశాల పైన కూలంకుషంగా చర్చించటం జరిగిందన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి మీద ఒక డీపీఆర్ తయారుచేసి గౌరవ రేవంత్ రెడ్డి కి అందజేసి అభివృద్ధి జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమానికి పునాదిగా ఒక చరిత్ర లో నిలిచిపోయే విధంగా విద్యార్థి విద్యార్థినీలు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా తెలంగాణ ఉద్యమంలో కొట్లాడి ఎన్నో కేసులపాలై జైలకు వెళ్లిన వారు ఉన్నారు. రాబోయే తరాల కోసం ఒక విద్యావ్యవస్థగా రూపుదిద్దుకుంటున్న యూనివర్సిటీని అన్ని రకాల వసతులు కల్పించాలని, సానుకూలంగా స్పందించే సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో హాస్టల్ వసతి తదితర అంశాలపై చర్చించామన్నారు. గత ప్రభుత్వ పాలనలో తుగ్లక్ పాలన చేసి యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ కాలేజీలకు కేటాయిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను భ్రష్టు పట్టించారన్నారు. బీఆర్ఎస్ తుగ్లక్ పాలలను చూసి ప్రజలు విసిగి చింది గొప్ప మనసుతో ప్రజలందరూ మన ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పట్టం కట్టారన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాగా సుమారు 50 వేల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చాము మళ్లీ త్వరలోనే మరొక కొత్త నోటిఫికేషన్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. యూనివర్సిటీలో ఉన్న విద్యార్థి విద్యార్థినీలను యూనివర్సిటీ భూములను కాపాడే బాధ్యత నేను మా ఎమ్మెల్యేలు ఎంపీలు తీసుకొని త్వరగా అభివృద్ధి జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. యూనివర్సిటీలో తొందర లోనే మళ్లీ ఒక సమీక్ష సమావేశం నిర్వహించుకుని మళ్లీ కులం కుశంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.ఈ సమావేశంలో ఎక్జిక్యూటివ్ మెంబర్స్ అనితా రెడ్డి,చిర్ర రాజు,సురేష్ లాల్,రమ,పుల్లూరు సుధాకర్, సుదర్శన్ కాకతీయ విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థల ప్రిన్సిపల్స్,డీన్ లు ,విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరిపాలనను గాలికొదిలేసిన ప్రభుత్వం

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**విశ్వంభర, కాటారం:** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో కొన్ని సమస్యలు పరిష్కారం అయినా మరికొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఒక విద్యార్థి అస్వస్థతకు గురై ఉందని, ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నామన్నారు. రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం పరిపాలనను మరిచి ప్రతిపక్షాలపై దాడులకు ప్రాముఖ్యత ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారో ఏడాదైన ఒక విధానం చెప్పడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలు, మోడల్ స్కూల్‌లలో విద్యార్థులను చేర్చేందుకు రికమండేషన్‌లు ఉండేవని, కానీ ఈనాడు రేవంత్ సర్కార్‌లో గురుకులాలు, మోడల్ స్కూల్‌లపై నమ్మకం సన్నగిల్లుతోందని, గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులు వెళ్లిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలు,మోడల్ స్కూల్‌ల్లో అన్ని వసతులు కల్పించి బలోపేతం చేసే దిశగా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం మోడల్ స్కూల్స్‌లో వంట గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన పేదింటి విద్యార్థులు చదువుకునే గురుకులాలు, మోడల్ స్కూల్‌ల బలోపేతం చేయాలని, మంచి వాతావరణం, నాణ్యమైన బోజనం అందించేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## అందెను కలిసిన ఫోర్త్ సిటీ భూ బాధిత రైతులు

- ఫోర్త్ సిటీ రోడ్డు నిర్మాణం కొరకు తమ భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పిన రైతులు
- రైతులకు అండగా భారతీయ జనతా పార్టీ ఉంటుంది : అందెల శ్రీరాములు




**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలంలోని ఫ్యూచర్ సిటీ కొరకు వేయబోతున్నటువంటి 300 ఫీట్ల రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతులు బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ ని నియోజకవర్గ కార్యాలయంలో కలిసి వారి ఆవేదన తెలిపారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు శ్రీరాములు తో మాట్లాడుతూ తమ భూములు ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఇవ్వబోమని దాదాపుగా 1900 కుటుంబాలు తమ భూమిని కోల్పోతున్నారని అందులో అందరూ కూడా చిన్న సన్న కారు రైతులని పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడే కుటుంబాలని, ఇట్టి రోడ్డు కోసం తమ భూములు ప్రభుత్వానికి ఇచ్చినట్లయితే తామంతా రోడ్డున పడతామని, తమ భూమి కోసం ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టం చేశారు. రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ అండగా నిలబడాలని వారు శ్రీరాములు కి వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పూర్తిగా రైతుల పక్షాన అండగా ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లో రైతులకు ఇష్టం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయకూడదని తెలిపారు. రైతులు ఎవరు కూడా అధైర్య పడొద్దు అని త్వరలోనే రంగారెడ్డి జిల్లా ముద్దుబిడ్డ కేంద్ర మంత్రివర్యులు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి ని కలిసి ఇట్టి విషయంపై చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని, అలాగే జాతీయ బీసీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ వారికి కూడా మీ యొక్క ఆవేదన తెలియజేస్తామని, ఇట్టి విషయం పైన తాను ఎంతవరకైనా రైతుల పక్షాన పోరాడుతానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్ . మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్. తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా ఉండాలి : జిల్లా కలెక్టర్




**విశ్వంభర, మహబూబాబాద్:** డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం శనివారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ పురుషుల నిష్పత్తి సమానంగా ఉండేటట్టు ప్రజలలో అవగాహన కల్పించాలని, స్కానింగ్ సెంటర్లను తనిఖీలో భాగంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు గుర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోబడునని, స్కానింగ్ సెంటర్లలో క్వాలిఫైడ్ డాక్టర్లు మాత్రమే పనిచేయాలని, జిల్లాలో ఎక్కడైతే స్త్రీ పురుష నిష్పత్తి తక్కువగా ఉన్న గ్రామలను గుర్తించి కలజాత బృందాల చే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, చట్ట ప్రకారం అన్ని జన్యు సంబంధ పద్ధతులు పరీక్షలు నిర్వహించే వ్యక్తులు సంస్థలు ప్రైవేటు మరియు ప్రభుత్వ సంస్థలు వైద్యులు సంబంధిత జిల్లా ప్రత్యేక నిర్దేశిత అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వద్ద తప్పనిసరిగా నిర్దేశించిన రుసుముతో నమోదు చేయించుకోవాలని, చట్ట పరిధిలో అన్ని అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాలు లేదా పరికరాలు తప్పనిసరిగా నమోదు చేయించాలని, నమోదు చేయించుకున్న తర్వాత తిరిగి ఐదు సంవత్సరాలకు ఒకసారి తిరిగి రెన్యువల్ చేయించుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పురుషులు సమానమే అని, స్త్రీ పురుషుల మధ్య ఏ వివక్షత ఉండకూడదని నిజానికి పురుషుడు కంటే స్త్రీ ఏ విషయంలో తక్కువ కాదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు గణేష్ కే. కృష్ణవేణి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతిరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రమీల, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సారంగం, డాక్టర్ శ్రవణ్ కుమార్, కె.వి.రాజు హెల్త్ ఎడ్యుకేటర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, ఎల్డి కంప్యూటర్ అరుణ్, మనోహర్ పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిన రేవంత్ సర్కార్ : సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలం కొత్తగూడ కస్తూర్బా బాలికల పాఠశాల, కళాశాలను అకస్మాత్తుగా తనిఖీ చేసి స్థితిగతులను పరిశీలించి విద్యార్థులతో మాటామంతి నిర్వహించిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి . ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు అందజేస్తున్న భోజనం నాణ్యత పరిశుభ్రత పాటించాలని ముఖ్యంగా టాయిలెట్లు ఇతర పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు క్లీన్ గా ఉంచాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులారా మీకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా నేను మీకు అండగా ఉంటా ఎప్పుడైనా నాకు ఫోన్ చేయండి అంటూ తన వ్యక్తిగత ఫోన్ నెంబర్ ని విద్యార్థులకు అందజేశారు. సదుపాయాల గురించి అడిగి మరి తెలుసుకున్నారు. భోజనశాల అందులో వంట సామాగ్రి అందజేస్తున్న అన్నం కూరగాయలు బియ్యాన్ని ఇతర సామాగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వంటగది ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్ఐ

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ప్రభుత్వ పాఠశాలలో గురుకుల పాఠశాలలో వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ వల్ల పలుచోట్ల విద్యార్థులు అస్వస్థకు గురవుతున్న దృష్ట్యా పెద్ద శంకరంపేటలోని కేజీబీవీపీ పాఠశాలలోని వంటగదితోపాటు పాఠశాల పరిసరాలను పెద్ద శంకరంపేట ఎస్సై శనివారం ఆకస్మికంగా పరిశీలించారు.శంకరంపేట మండలంలోని కేజీబీవీ హాస్టల్ పరిసరాలను కూరగాయలను గుడ్లను, వంటశాలను పరిశీలించిన ఎస్సై మంట వారికి పలు సూచనలు చేశారు. పాడైపోయిన కూరగాయలతో పాటు కాలం చెల్లిన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించకూడదని సూచించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని వారికి సూచించారు. ఎస్ఐ వెంట కేజీ వి బి ప్రిన్సిపాల్ ఉన్నారు.



## అంతిరింతుర కొండపై సామూహిక వ్రతాలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల పరిధిలోని అంతరింతుర కొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం లో కార్తిక మాస ముగింపు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. స్వాముల భజన తో కొండ మార్మోగింది. మాల ధారణ మాలాధారణ స్వాములకు అన్నదాన భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆలయ కమిటీ ని గ్రామ పెద్దలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పబ్బు పరమేష్, దుడ్డు ఆంజనేయులు యాదవ్,రాజు, రవీందర్, రామచంద్రయ్య, మల్లేష్, తిరుపతి, నరసింహ, శ్రీశైలం, విజయ్. శ్రీశైలం. మహేష్ నారాయణ, కుమార్, ఆనంద్, కృష్ణ, పాపయ్య, పాల్గొన్నారు.

## కురుమూర్తి వెంకటేశ్వర స్వామి ని దర్శించుకున్న డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా



**విశ్వంభర, ఆమనగల్లు:** కార్తీక మాసం ముగింపు శుభ సందర్భాన్ని పురస్కరించుకొని కురుమూర్తి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అధికారులు వెంకటేష్‌గుప్తకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ప్రవీణ్ కుమార్, ఈవో మోహన్ రెడ్డి లు గంప వెంకటేష్ గుప్తాను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకొని సన్మార్గంలో పయనించాలన్నారు. ఆయన వెంట కురుమూర్తి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న వారిలో కే మురళి, శ్రీనివాసరెడ్డి, రాజేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల ప్రాణాలు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

**- ఏఐఎస్ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ షంషుద్దీన్**




**విశ్వంభర, చింతపల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ తలపెట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ కార్యక్రమం విజయవంతమైందని ఏఐఎస్ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ షంషుద్దీన్ అన్నారు. మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం పాలన పూర్తయిందని సంబరాలు చేసుకున్నారు. కాని ఇప్పటి వరకు విద్యా వ్యవస్థపై సమీక్షా చేయలేదని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో అస్వస్థకు గురవుతున్నారు. వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్ ప్రభుత్వ పాఠశాలల బంద్ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈరోజు చింతపల్లి మండలంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయడం జరిగింధని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ చింతపల్లి మండల అధ్యక్షుడు వలవోజు శివ, నాయకులు ఎర్ర చిన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలు పడిన రోడ్లను మరమ్మతులు చేయాలి




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని రామన్నపేట నుండి కొమ్మాయిగూడెం వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారి ప్రయాణాలు నరక ప్రాయంగా మారుతున్నాయని, ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగటి ఉపేందర్ డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసిన అనంతరం డి.ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్లు అస్తవ్యస్తంగా మారి గుంతలమయంగా మారినాయని, రోడ్ల వెడల్పులో భాగంగా వేసిన నూతన రోడ్డు కూడా ప్రమాదకరంగా మారి ప్రమాదాల జరుగుతున్నాయని అన్నారు. పలుసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని తెలిపారు. వెంటనే ప్రభుత్వ అధికారులు చొరవ చూపి గుంతల రోడ్లను మరమ్మత్తులు చేసి, ప్రజల సమస్యను పరిష్కరించాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రామచంద్రం, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, డీవైఎఫ్ఐ మండల నాయకులు గుణగంటి మల్లేశం, ఆకిటి శ్రీనివాస్, జల్లెల మల్లేశం, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాను లెప్రసీ రహిత జిల్లాగా ప్రకటించాలి

**విశ్వంభర, మహబూబాబాద్:** శనివారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో లెనిన్ వత్సల్ టోప్పో ఆధ్వర్యంలో ఎల్సీడీసీ పైన జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను లెప్రసి రహిత జిల్లాగా ప్రకటించాలని, కేసులు లేకుండా చూడాలని, ప్రతి ఒక్కరిని పరీక్షించాలని మందులు త్వరగా వాడినచో అంగవైకల్యం లేకుండా ఉండొచ్చని పేర్కొంటూ ఈ పక్షోత్సవాలు డిసెంబర్ 2 నుండి 15 వరకు ప్రతి ఇంటింటికి ఆశా కార్యకర్త వెళ్లి ఇంట్లో ఉన్న వారందరికీ చర్మం పైన ఏమైనా మచ్చలు ఉన్నచో అనగా స్పర్శ లేకుండా రాగి వర్ణం గల మచ్చలు ఉన్న వారిని గుర్తించి దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి దగ్గరికి పంపించాలని, దీనికి లైన్ డిపార్ట్మెంట్స్ అన్నీ కూడా సహకరించి ఈ కార్యక్రమాన్ని ముందంజలో ఉంచాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి మురళీధర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయకుమార్, డాక్టర్ రాజకుమార్ జాదవ్,పురుషోత్తం సీఈఓ, డీపీఓ, డిస్టిక్ పారామెడికల్ ఆఫీసర్ వాలియా, ఎల్లయ్య, కెవి రాజు హెల్త్ ఎడ్యుకేటర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, ఎపిడిమాలజిస్ట్ రవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతుకు న్యాయం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వం

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- ఫోర్త్ సిటీలో భవిష్యత్ అవసరాలను తగ్గట్టు మౌలిక సదుపాయాలు : కే ఎల్ ఆర్



**విశ్వంభర, మహేశ్వరం :** ప్రతిపక్షాలు ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టిన, విమర్శించిన సంక్షేమం ఆగదని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ కందుకూరు మండలం నేదునూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల మేనీ పేస్టలో పెట్టిన వాగ్దానాలను నెరవేరుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడదిలోపే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2011లో నిర్వహించిన గ్రూప్ 1 పరీక్ష తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే గ్రూప్ 1 పరీక్ష ను నిర్వహించామన్నారు. రైతంగానికి ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ను నెరవేర్చి ప్రతి ధాన్యపు గింజలు కొనుగోలు చేస్తామన్నారు. తరుగు పేరుతో రైతులు మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్త నగరం నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రజల అభిప్రాయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందన్నారు. ఎన్నికల్లో మేనిఫెస్టో లో చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు ఐటీ శాఖ మంత్రి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు . మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సబిత ఇంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి , తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్ బిగ్గోల హేమలత రాజు గౌడ్ . కాంగ్రెస్ పార్టీ నాయకులు . మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కే ఎల్ ఆర్, దేప భాస్కర్ రెడ్డి , ఏనుగు జంగారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బొక్క జంగారెడ్డి, పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

### కరకట్ట నిర్మాణంలో భూములు కోల్పోతున్న

# రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

**గ్రామసభలో సీపీఎం డిమాండ్**



**విశ్వంభర, భద్రాద్రికొత్తగూడెం:** సుభాష్ నగర్ వెనుక గోదావరి కరకట్ట నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందివ్వాలని గ్రామ సభలో సీపీఎం డిమాండ్ చేసింది. భద్రాచలం ఆర్డీవో అధ్యక్షతన జరిగిన గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కరకట్ట నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల అంశం ఎజెండాగా పెట్టిన గ్రామసభలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడారు..కరకట్ట నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు అరా, కొర నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం మానుకోవాలని, 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.గోదావరి ముంపు నుండి భద్రాచలం రక్షణకు కరకట్ట పొడిగించాలని సీపీఎం అనేక పోరాటాలు చేసిందని ఫలితంగా వచ్చిన ఈ కరకట్టను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని అన్నారు. ప్రస్తుతం నిర్మించే ఈ కరకట్ట 700 మీటర్లు పొడవు మాత్రమే ఉందని దీనికి కేవలం 38 కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. దీనితోపాటు రామాలయం నుండి సుభాష్ నగర్ కాలనీ వరకు, బుజ్జి సెంటర్ నుండి ఎటపాక చివరి వరకు కరకట్టను అభివృద్ధి చేయాలని దాని ఎత్తు పెంచి, పొడిగించాలని దానికి కావలసిన నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేసి పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ గ్రామసభలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామితో పాటు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు, పట్టణ కమిటీ సభ్యులు నకిరికంటి నాగరాజు, భూపేంద్ర శాఖ కార్యదర్శి రాధా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో భద్రతపై పోలీసుల తనిఖీ



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో భద్రతపై జిల్లా పోలీసులు తనిఖీ నిర్వహించారు. బ్యాంకుల్లో భద్రతా లోపాలు ఉండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ అన్నారు. బ్యాంకుల్లో దొంగతనాల నివారణకు, ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా జిల్లా పరిధిలోని ఎస్ ఐ లు, సీ ఐ లు, డీఎస్పీలు ఏక కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో మరియు ఏటీఎం ల వద్ద భద్రతా పరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే ఘనపురం మండల కేంద్రంలోని డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ బ్యాంక్ లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ టీవీ కెమెరాలు జిల్లాలోని అన్ని బ్యాంకులు భద్రత ప్రయోజనాల కోసం కలిగి ఉండాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న జాతీయ, ప్రైవేట్ బ్యాంకు శాఖలలో పోలీసులు జరిపిన తనిఖీల్లో గుర్తించన విషయాలపై భద్రతాపరంగా తగిన చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులకు సూచించారు. బ్యాంకు ఆవరణ అంతా కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్, సెక్యూరిటీ గార్డ్, సీసీ కెమెరాలు, లైటింగ్, బ్యాంకుల్లో భద్రత లోపాలు ఉండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ తనిఖీల్లో భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్ ఐ లు పాల్గొన్నారు.

### యువ విద్యార్థుల్లో

# వ్యవస్థాపక ప్రోత్సాహమే బీవీఆర్ సైంట్ లక్ష్యం

**- బీవీఆర్ సైంట్ సీఈవో డా. సుధాకర్ పాటుకుచ్చి**




**విశ్వంభర, హనుమకొండ:** యువ విద్యార్థుల్లో వ్యవస్థాపక ప్రోత్సాహాన్ని నింపాలన్నదే బి.వి.ఆర్ సైంట్ లక్ష్యమని సంస్థ సీఈవో డాక్టర్ సుధాకర్ తెలిపారు. వ్యవస్థాపన వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించేందుకు వరంగల్ నగరంలో ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం హనుమకొండ జిల్లా మడికొండలోని ఐటి పార్కులో గల సైయేంట్ కార్యాలయంలో డాక్టర్ బి.వి.ఆర్ మోహన్ రెడ్డి స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రి షిప్(బివిఆర్ సైంట్) సహకారంతో విద్యార్థుల మాస్టర్ క్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. 25 పైగా ఇంజనీరింగ్ కళాశాల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు సృజనాత్మకతతో సమస్యలు పరిష్కరించడానికి అవకాశాలను సృష్టించడానికి ఇంజనీరింగ్ ఒక ప్రక్రియ లాంటిదని అన్నారు. ఇది సాంకేతిక నైపుణ్యాలకు సంబంధించింది కాదని సమస్యల పరిష్కారానికి సరికొత్త ఆలోచనలతో ముందుకు వచ్చే ఒక పదునైన ఆలోచనకు దారి వేసేదని అన్నారు. ఈ తరం ఇంజనీర్లను సాంకేతికత, వ్యాపార మరియు సమాజంలో అగ్రగామిగా తయారు చేయవచ్చనే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే బి.వి.ఆర్ సైంట్ ఫౌండేషన్ ద్వారా పలు దాతృత్వ సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడానికి సహాయపడుతున్నట్లు తెలిపారు. ఈ ఫౌండేషన్ చొరవతో గ్రామీణ మరియు పట్టణ నిరుద్యోగ మహిళలకు సాధికారత కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.వి.ఆర్ సైంట్ సంస్థ ప్రతినిధులు, సెయేంట్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


### హిందూ సమాజం ఏకం కావాలని

# రామాలయం కమిటీ పాదయాత్ర



**విశ్వంభర, మిర్యాలగూడ:** నల్గొండ జిల్లా మిర్యాలగూడ హనుమాన్ పేట శ్రీ సీతారామాంజనేయ దేవాలయం నుండి అవంతిపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు పాదయాత్రగా నగర సంకీర్తనలు, భజనలు చేసుకుంటూ సనాతన ధర్మాన్ని హిందూ ధర్మాన్ని, హిందూ ధర్మ పరిరక్షణ, భవిష్యత్తులో జరిగే వీఘాతాలను చేదించడం కోసం హిందూ సమాజం ఏకం కావాలని కోరుకుంటూ హనుమాన్ పేట రామాలయం కమిటి వారి ఆధ్వర్యంలో ఈ పాదయాత్రను చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి కూరపాటి సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో హిందూవులపై జరిగే దాడులను ఖండిస్తూ హిందూ శక్తి ఐక్యత కోసం హనుమాన్ పేట రామాలయం వేదికగా సనాతన ధర్మాన్ని మన దేవి దేవతల ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకోని వెళ్లి ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. అలాగే ఇస్కాన్ కృష్ణదాస్ అక్రమ అరెస్ట్ ను వెంటనే వాపసు తీసుకోని బంగ్లాదేశ్ ప్రజలు వెంటనే క్షమాపన చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిలుకూరి శ్యామ్, లక్ష్మినారాయణ, కుప్పాల సబ్బారావు, దేవేందర్, లక్ష్మి, శివప్రసాద్,కుప్పల శ్రీను సునీత, రమణ, కుమారి, ధనలక్ష్మి,జాహ్నవి రామలక్ష్మి, దాచేపల్లి మురళి మల్లయ్య,సత్యం నర్సింహా రావు, తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాలో 14 మంది ఎంపిక



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యం లో శ్రీ సాయి అగ్రి టెక్నాలజీస్ , మహబూబాబాద్ కంపెని లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ స్టాఫ్/మార్కెటింగ్ సేల్స్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయుటకు నవంబర్ 30, 2024 న జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 65 మంది హాజరవగా సంస్థ మేనేజర్ సందీప్ ఇంటర్వ్యూ తీసుకోగా 14 మందిని ప్రాథమికంగా ఎంపిక చేసారని జిల్లా ఉపాధి అధికారి టి.రజిత తెలియజేసారు.

# మానవత్వం చాటిన మాజీ ఎంపీపీ



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ వరంగల్ జాతీయ రహదారి 163 హైవే రోడ్డుపై శనివారం కొండమడుగు గ్రామానికి చెందిన సాయి రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో అటు నుంచి వెళ్తున్న ఘట్కేసర్ మండల మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి చూసిన వెంటనే స్పందించి తన కారులో ఎక్కించుకొని దగ్గరలో ఉన్న సూర్య హాస్పిటల్లో అడ్మిట్ చేసి పేషెంట్ కుటుంబానికి తెలియజేశారు.

### చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో జిల్లా స్థాయిలో

# సత్తా చాటిన గాంధీజీ విద్యార్థులు



**విశ్వంభర, చండూరు:** తెలంగాణ జన విజ్ఞాన వేదిక ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు 2024 కార్యక్రమంలో భాగంగా బాలబాలికల విద్యా, విజ్ఞానం, వికాసం కోసం గత వారం నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో చండూరు మండలం నుండి స్థానిక గాంధీజీ విద్యాసంస్థలకు చెందిన పందిరి శివ ప్రియ (10వ తరగతి), శిరంశెట్టి అక్షర (9వ తరగతి), ఎం.ఇందు (8వ తరగతి) ముగ్గురు విద్యార్థులు మండల మొదటి స్థానం సాధించి ఈనెల 28వ తేదీన నలగొండ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ లో పాల్గొని జిల్లా స్థాయి తృతీయ స్థానం సాధించినారు. ఇట్టి విజేతలను మండల విద్యాధికారి ఉట్కూరి సుధాకర్ రెడ్డి మరియు ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, రఘు సురేష్, ప్రిన్సిపల్స్ సత్యనారాయణ మూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళలకు అవగాహన సదస్సు




**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ ఆధ్వర్యంలో చింతల్ ప్రాంతంలో నివసిస్తున్న 60 మంది, జీడిమెట్ల గండి మైసమ్మ చౌరస్తా పరిధిలో 45 మందితో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. మహిళల యొక్క హక్కులు, వారికి అవసరమైన చట్టాలు కుటుంబ సమస్యలు వివాహ సంబంధ సమస్యలను చర్చల ద్వారా సామరస్యంగా సీడీఈడబ్ల్యూ సిబ్బంది వివరించడం జరిగింది. గృహహింస బాధితుల కోసం సలహా కేంద్రం ఏర్పాటు చేశామని సెంటర్లో ఇండివిద్యుయల్ కపుల్ అండ్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సర్వీసెస్ అందజేస్తామని కూడా తెలిపారు. కార్యక్రమంలో జీడిమెట్ల పీఎస్ హెచ్ ఓ జి. మల్లేష్ పీఎండబ్ల్యూ టీమ్, సీడీఈడబ్ల్యూ, జీడిమెట్ల ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బంది, పలువురు ఎన్.జీ.ఓ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మరోసారి పెద్దపులి దాడి.. తీవ్రంగా గాయపడ్డ రైతు

**కొమురం భీం జిల్లాలో ఘటన**

**విశ్వంభర, సిర్పూర్.టి:** కొమురం భీం జిల్లాలో పులి దాడిలో ఓ యువతి ప్రాణాలు కోల్పోయిన ఘటన మరవక ముందే.. మరో వ్యక్తిపై దాడి జరిగింది. పొలంలో పనిచేస్తున్న రైతుపై పులి దాడి చేసింది. స్థానికుల కేకలతో అది పారిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రైతు సురేశ్‌ను ఆస్పత్రికి తరలించారు. సిర్పూర్.టి మండలం దుబ్బగూడలో ఈ ఘటన చోటు చేసుకుంది. పులి వరుస దాడులతో ఆ ప్రాంతంలోని ప్రజలు భయంతో వణికిపోతున్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లే లక్ష్మి (21) నజ్రుల్‌నగర్ గ్రామ శివారులోని చేనులోకి పత్తి ఏరేందుకు వెళ్లగా పులి దాడి చేసి నోటకరచుకుని వెళ్లింది. ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనల నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి జాడ కోసం చర్యలను ముమ్మరం చేశారు. డ్రోన్ సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.



# ఎలాంటి విచారణకైనా సిద్ధం

* ఉరికంభం ఎక్కడానికి కూడా సిద్ధంగా ఉన్నా
* మంత్రి కొండా సురేఖ ఆరోపణలపై ఆర్ ఎస్ ప్రవీణ్ కమార్
* కేటీఆర్ గురుకుల బాట పిలుపుతో కాంగ్రెస్‌కు భయం పట్టుకుందని వ్యాఖ్య

**విశ్వంభర, హైదరాబాద్ :** తన హయాంలో గురుకులాల్లో తప్పు చేశానని తేలితే జైలుకు వెళ్ళడానికి సిద్ధం.. ఉరికంభం ఎక్కడానికి సిద్ధంగా ఉన్నానని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తేల్చిచెప్పారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉందన్న మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఆకునూరి మురళీ విద్యా కమీషన్ చైర్మన్ కాకముందు ఒకలా ఇప్పుడు మరోలా మాట్లాడుతున్నారు. ఆయన ఫుడ్ పాయిజన్‌పై ఎందుకు మాట్లాడటం లేదు. సంవత్సరం నుండి తెలంగాణలో విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు లేరు. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చనిపోతున్నారు. రాష్ట్రంలో గురుకుల విద్యావ్యవస్థ కుప్పకూలింది. కేసీఆర్ హయాంలో గురుకుల విద్యావ్యవస్థ ఆదర్శంగా నిలిచింది. గురుకుల విద్యార్థులు రోడ్ ఎక్కుతున్నారు. ఒకే జిల్లాలో మూడు సార్లు గురుకుల విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారు. 28 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు.

గురుకులాల్లో పని చేస్తున్న టీచర్లకు ఆరు నెలల నుండి జీతాలు రావడం లేదు. కేటీఆర్ గురుకుల బాటకు పిలుపునిచ్చారు. గురుకులాల్లో ఉన్న సమస్యలపై అధ్యయనం చేసి రిపోర్ట్ ఇస్తాం. గురుకుల బాట పిలుపుతో కాంగ్రెస్ పార్టీకి భయం పుట్టింది. సీఎం రేవంత్ రెడ్డికి విద్యాశాఖపై అవగాహన లేదు. మతిస్థిమితం లేని మంత్రులతో నాపై రేవంత్ రెడ్డి మాట్లాడిస్తున్నారు. మంత్రి కొండా సురేఖను తెలంగాణ సమాజం తిరస్కరించింది. ఆమెకు మంత్రి పదవిలో ఉండే అర్హత లేదని ఆర్ఎస్పీ చెప్పారు.

నేను ప్రభుత్వ హాస్టల్స్‌లో చదువుకుని ఐపీఎస్ అయ్యాను. దేశ రక్షణ కోసం పనిచేశాను. ఏడు సంవత్సరాల సర్వీసును వదిలి రాజకీయాల్లోకి వచ్చాను. పోలీస్ యూనిఫార్మ్ పక్కన పెట్టి గురుకులాల సెక్రటరీగా తొమ్మిది సంవత్సరాలు పనిచేశాను. గురుకులాలపై రేవంత్ రెడ్డికి, మంత్రులకు శ్రద్ధ లేదు. మంత్రి సీతక్క తన మూలాలు మర్చిపోయి మాట్లాడుతున్నారు. కొండా సురేఖ మత్తులో ఉండి మాట్లాడుతున్నారు. గురుకులాలపై రేవంత్ రెడ్డి కుట్ర చేశారు. ఆరు నెలల నుండి విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు లేవు. ఫుడ్ పాయిజన్ గురించి కనీస అవగాహన మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు లేదు. మీకు చేతకాకపోతే విద్యా శాఖను బీఆర్ఎస్ పార్టీకి అప్పగించండి. నేను తొమ్మిది సంవత్సరాలు గురుకులాల కార్యదర్శిగా ఉన్నా. నా రికార్డులు సంక్షేమ భవన్‌లో భద్రంగా ఉన్నాయి. అధికారం మీ చేతుల్లో ఉంది. ఏసీబీ మీ చేతుల్లోనే ఉంది. ఎలాంటి విచారణకు అయినా సిద్ధమని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తేల్చిచెప్పారు.

# ఆరు రోజుల్లో 18 మంది చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు

* సత్యసాయి ఆస్పత్రి సేవలపై హరీశ్‌రావు ప్రశంసలు
* కొండపాకలోని ఆస్పత్రి సందర్శన



**విశ్వంభర, సిద్దిపేట :** ఆరు రోజుల్లో 18 మంది చిన్నారులకు విజయవంతంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించడంతో సత్యసాయి ఆస్పత్రి సేవలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశంసల వర్షం కురిపించారు. చిన్న వయసులోనే తీవ్రమైన గుండె సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు ఉచిత చికిత్సలు అందిస్తూ పేద కుటుంబాలకు ఆశాజ్యోతిగా నిలుస్తున్న ఆస్పత్రి సేవలను కొనియాడారు. కొండపాకలోని సత్యసాయి సంజీవని ఆస్పత్రిని హరీశ్ రావు శనివారం సందర్శించారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సత్యసాయి ఆస్పత్రి సేవలను దేశంలోని 10వేల గ్రామాల్లోని చిన్నారులకే కాకుండా, 18 ఇతర దేశాల్లోని పిల్లలకు కూడా అందుబాటులో ఉన్నాయి. గత 12 ఏళ్లలో 33,600 మందికి పైగా చిన్నారులకు సర్జరీలు నిర్వహించారు. పేద కుటుంబాల ఆవేదనలకు ఈ ఆస్పత్రి ముగింపు పలుకుతున్నది. అత్యాధునిక పరికరాలు, ప్రపంచ స్థాయి వైద్య సౌకర్యాలతో దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నది. ప్రభుత్వాలు చేయలేని పనిని సత్యసాయి ట్రస్ట్ ఘనంగా చేసి చూపుతోంది. మహారాష్ట్ర, హర్యానా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు మన తెలంగాణలోనూ ఇలాంటి ఆస్పత్రి ఉండటం మన రాష్ట్ర ప్రజల అదృష్టం. మూడు లక్షల నుంచి పది లక్షల వరకు ఖర్చయ్యే గుండె ఆపరేషన్లను పేద కుటుంబాలకు ఉచితంగా అందించడం గొప్ప సేవ. ఇక్కడి వైద్యులు, సిబ్బంది సేవాస్ఫూర్తితో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సత్య సాయి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌ను, మధుసూదన సాయిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. వారిద్దరి నాయకత్వం వల్లే ఇలాంటి గొప్ప సేవా సంస్థలు సమాజానికి లభిస్తున్నాయి. వారికి కృతజ్ఞతలు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ప్రతి సంవత్సరం రెండు లక్షల మంది పిల్లలు గుండె సమస్యలతో జన్మిస్తుంటే, వారిలో కేవలం 10వేల మందికకి మాత్రమే అవసరమైన చికిత్స లభిస్తోంది. ఈ పరిస్థితుల్లో సత్యసాయి ట్రస్ట్ సేవలు మరింత విస్తరించి, చిన్నపిల్లల ప్రాణాలు కాపాడాలని మనసారా కోరుకుంటున్నాను. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది అందరికీ హృదయపూర్వక అభినందనలు. ఈ ఆస్పత్రి గుండె ఆపరేషన్లకే పరిమితం కాకుండా, ప్రపంచ స్థాయి వైద్య సౌకర్యాలతో ప్రజలకు సేవ చేస్తోంది. కేవలం ఆరు రోజుల్లో 18 మంది పిల్లలకు సర్జరీలు పూర్తిచేసి, వారికి పునర్జన్మ ప్రసాదించడం గొప్ప విషయం అని హరీశ్‌రావు కొనియాడారు.

ఇక్కడి వైద్యులు మనసుతో పని చేస్తూ మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కోట్ల రూపాయలు సంపాదించే అవకాశాలు ఉన్నప్పటికీ, తమ సేవలను పేద పిల్లల జీవితాలను కాపాడటానికి అంకితమిచ్చిన వైద్యులు నిజమైన దేవదూతలు. ఇది కేవలం వైద్యసేవ మాత్రమే మాత్రమే కాదు. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం కూడా. ఇలాంటి గొప్ప సేవలను అందించినందుకు సత్య సాయి ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. సత్యసాయి ట్రస్ట్ సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొంటూ, ఈ సేవలను విస్తరించి తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి కుటుంబానికి చేరాలి అని హరీశ్‌రావు ఆకాంక్షించారు.

# ప్రతి అవరోధం.. అభివృద్ధికి సోపానం: గౌతమ్ అదానీ

**జైపూర్:** అదానీ గ్రూప్, అనుబంధ సంస్థలపై అమెరికాలో కేసులు నమోదైన నేపథ్యంలో ఆ సంస్థ అధిపతి గౌతమ్ అదానీ స్పందించారు. తమపై జరిపే ప్రతీ దాడి తమని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఇలాంటి కేసులు ఎదుర్కోవడం అదానీ సంస్థలకు కొత్తకాదని అన్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన 51వ జెమ్ అండ్ జ్యూవెలరీ అవార్డ్స్ ప్రదానోత్సవానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు.

''అదానీ సంస్థలపై రెండు వారాల కిందట అమెరికాలో వచ్చిన ఆరోపణల గురించి మీలో చాలా మందికి తెలిసే ఉంటుంది. ఇలాంటి సవాళ్లు సంస్థకు కొత్తేం కాదు. మనపై జరిగిన ప్రతీ దాడి మనల్ని మరింత బలపడేలా చేస్తుందని కచ్చితంగా చెప్పగలను. సంస్థకు ఎదురైన ప్రతి అవరోధం.. అభివృద్ధికి సోపానంగా మారుతుంది. అదానీ సంస్థలపై ఎన్ని ఆరోపణలు వచ్చినప్పటికీ ఎఫ్‌సీపీఏ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించినట్లుగానీ, న్యాయాన్ని అడ్డుకోవడానికి కుట్ర పన్నినట్లుగానీ రుజువు కాలేదు. సంస్థకు చెందిన కనీసం ఒక్క వ్యక్తిపైనా ఇప్పటివరకు చర్యలు లేవు. నేటి ప్రపంచంలో వాస్తవాలకంటే.. అబద్ధాలే వేగంగా వ్యాపిస్తున్నాయి. అదానీ గ్రూప్ ఎన్నో విజయాలను సొంతం చేసుకుంది. వీటితోపాటు ఎదుర్కొన్న సవాళ్లు కూడా పెద్దవే. ఎన్ని సవాళ్లు ఎదురైనా అదానీ సంస్థల్ని విచ్ఛిన్నం చేయలేవు. అవి మనల్ని మరింత దృఢంగా తయారు చేస్తాయి. ప్రతి పతనం.. మనలో అచంచలమైన నమ్మకాన్ని కలిగిస్తుంది. మరింత బలంతో ముందుకు కదిలేందుకు దోహదపడుతుంది'' అని అదానీ పేర్కొన్నారు.

సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందేందుకు భారత్‌లో పెద్దఎత్తున లంచాలు ఇచ్చారని అదానీ గ్రూప్ అనుబంధ సంస్థలపై ఇటీవల అమెరికాలో కేసు నమోదైన సంగతి తెలిసిందే. అదానీ, దాని అనుబంధ సంస్థలు 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభం పొందగల సౌరశక్తి సరఫరా ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు సుమారు 265 మిలియన్ డాలర్లు లంచాలు ఆఫర్ చేసినట్లు న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అనంతరం అమెరికా, అంతర్జాతీయ మదుపర్లకు తప్పుడు సమాచారం తెలియజేసి నిధులు సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించినట్లు పేర్కొంది. అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా.. ఆ కంపెనీ రుణ దాతలు, పెట్టుబడిదారుల నుంచి 3 బిలియన్ డాలర్లకు పైగా రుణాలు, బాండ్లను సేకరించిందని ఆరోపిస్తూ న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపారు.

## జీవో 317.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు

**విశ్వంభర, హైదరాబాద్:** జీవో 317కు సంబంధించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు అనుగుణంగా మార్గదర్శకాలు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి మార్గదర్శకాలతో కూడిన 243, 244, 245 ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్, స్పౌస్, మ్యూచువల్ ఆధారంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు కేటగిరీలకు సంబంధించి విడివిడిగా మార్గదర్శకాలు జారీ చేశారు. ఖాళీలకు లోబడి స్థానిక కేడర్‌లో మార్పు, బదిలీకి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియలో ప్రస్తుతం ఆయా స్థానాల్లో ఉన్న ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది.

# ఇలాంటి అధికార దుర్వినియోగం మునుపెన్నడూ చూడలేదు: పవార్

పుణె: ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో అధికార మహాయుతి తీరుపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ విమర్శలు గుప్పించారు. దేశంలో ఇంతకు ముందెన్నడూ చూడనివిధంగా మహారాష్ట్ర ఎన్నికల్లో అధికార దుర్వినియోగం జరిగిందన్నారు. కొందరు నేతలు, మీడియా వర్గాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుపెట్టిందని ఆరోపించారు. పార్లమెంటు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎప్పుడూ ఇలా జరగలేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ నిరసనకు దిగిన సామాజిక కార్యకర్త బాబా అధవ్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. బాబా అధవ్.. సంఘ సంస్కర్త జ్యోతిబా ఫూలే నివాసమైన ఫూలే వాడలో మూడు రోజులు నిరసన చేపట్టారని, కాని ఇది మాత్రమే చాలదని పవార్ అన్నారు. ప్రజల్లో తిరుగుబాటు రాకపోతే ప్రజాస్వామ్యం నాశనమవుతుందని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఈవీఎంలలో అవకతవకలు జరిగినట్లు ప్రతిపక్ష మహావికాస్ అఘాడి (ఎంవిఎ) నేతలు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈవిషయంపై పవార్ మాట్లాడుతూ.. దేశ పగ్గాలు తమ చేతుల్లో ఉన్నవారు ఎన్నికల్లో జరుగుతున్న అవకతవకలను పట్టించుకోవడం లేదన్నారు. వారికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకొని చట్టాలు రూపొందించుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈవీఎంలలో జరుగుతున్న అవకతవకల విషయంలో దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చలు జరుగుతున్నా.. విపక్షాలు పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తడానికి ప్రయత్నిస్తున్నా కేంద్రం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అంశాలపై పార్లమెంటులో మాట్లాడడానికి ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నా.. అవకాశం ఇవ్వట్లేదని..ఈవిధంగా వారు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. నవంబర్ 20న జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో శివసేన, భాజపా, ఎన్సీపీలతో కూడిన మహాయుతి 288 అసెంబ్లీ స్థానాల్లో 230 స్థానాల్లో విజయం సాధించగా, ప్రతిపక్ష మహావికాస్ అఘాడి



కేవలం 46 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఈ ఫలితాలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు వద్దని.. బ్యాలెట్ పేపర్లే తాము కోరుకుంటున్నామన్నారు.

## ఫెంగల్ ఎఫెక్ట్.. చెన్నై ఎయిర్‌పోర్ట్ మూసివేత.. ప్రయాణికుల ఇబ్బందులు



చెన్నై: నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైవున్న వాయుగుండం శుక్రవారం తుఫానుగా మారింది. ఇది శనివారం సాయంత్రానికి పుదుచ్చేరి సమీపంలో కరైకల్ – మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఈ తుఫాను ప్రభావంతో తమిళనాడు వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఫెంగల్ తుఫాను ప్రభావంతో రాజధాని చెన్నైలో కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు పూర్తిగా నీటమునిగాయి. బలమైన ఈదురు గాలులతో కురుస్తున్న భారీ వర్షాలకు విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. శనివారం సాయంత్రం 7 గంటల వరకూ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఇండిగో సహా పలు విమాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఎయిర్‌పోర్ట్ మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## బైడెన్ చేతిలో యాంటీ ఇజ్రాయెల్ బుక్..

### నాలుగేళ్లు ఆలస్యమైందన్న రచయిత



వాషింగ్టన్: శత్రువులను అణచివేసే లక్ష్యంతో ఇజ్రాయెల్ సైన్యం చేస్తోన్న దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇజ్రాయెల్‌కు తొలినుంచి అమెరికా పూర్తి మద్దతు ఇస్తోంది. ఈనేపథ్యంలో అధ్యక్షుడు జో బైడెన్ చేతిలో కనిపించిన పుస్తకం అందరినీ ఆశ్చర్యపరిచింది. 'బ్లాక్ ఫ్రైడే' షాపింగ్‌లో భాగంగా 'ద హండ్రెడ్ ఇయర్స్ వార్ ఆన్ పాలస్తీనా' పుస్తకం ఆయన వద్ద ఉండటం చర్చనీయాంశంగా మారింది. కొలంబియా యూనివర్సిటీ గౌరవ ప్రొఫెసర్ రషీద్ ఖలీది ఆ పుస్తకాన్ని రాశారు. అది మసాచుసెట్స్‌లోని బుక్ స్టోర్‌లో బైడెన్ చేతిలో కనిపించింది. "తమ ఇష్టాలకు విరుద్ధంగా మాతృభూమిని ఇతరులకు విడిచిపెట్టాలని కొన్ని వర్గాలు స్థానికులపై ఒత్తిడి తెస్తున్నాయి. స్థానికులకు వ్యతిరేకంగా జరుగుతోన్న వలసవాద యుద్ధం ఇది అని ఆ పుస్తకంలో వివరించారు" అని గతంలో ఈ పుస్తకం గురించి న్యూయార్క్ పోస్ట్ రాసుకొచ్చింది. బైడెన్ ఆ పుస్తకం కొన్నారా..? లేక షాప్‌లో ఎవరైనా దానిని ఆయనకు ఇచ్చారా..? అనేది తెలియరాలేదు. అయితే ఆ షాప్ నుంచి బయటకు వచ్చేప్పుడు మాత్రం ఆయన దానిని చేత్తో పట్టుకొనే కనిపించారు. దీనిపై రచయిత ఖలీది స్పందిస్తూ.. "నాలుగు సంవత్సరాలు.. చాలా ఆలస్యం" అని వ్యాఖ్యానించారు. గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ దాడి చేయడంతో ఇజ్రాయెల్ చేస్తోన్న ప్రతిదాడులకు గాజాలో సామాన్యులు సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. రెండు వర్గాల మధ్య కాల్పుల విరమణకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఇప్పటివరకు ఆశించిన ఫలితం రాలేదు. అయినా బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వానికి మాత్రం అమెరికా పూర్తి మద్దతు ఇస్తూనేఉంది. "నాపాలనలో ఇజ్రాయెల్ భద్రతకు ఇచ్చే మద్దతు అచంచలమైనది. వారి ప్రజలకు సాయం చేయడంలోను.. వారిపై జరిగే దాడుల్ని ప్రతిఘటించడంలోను వెన్నంటే ఉంటాం" అని గతంలో అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. ఇటీవల గాజాలో పౌరుల మరణాల విషయంలో ఇజ్రాయెల్ నిబంధనలకు కట్టుబడటం లేదని బైడెన్ ఆగ్రహం వ్యక్తంచేసిన సందర్భాలు ఉన్నాయి. దాంతో ఇరుదేశాల నేతల మధ్య దూరం పెరిగినట్లు వార్తలు వచ్చాయి.

# డ్రాగన్ కవ్వింపు చర్యలకు అమెరికా అడ్డుకట్ట..

## తైవాన్‌కు భారీగా ఆయుధాలు



తైవాన్: చైనా- తైవాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే అమెరికా ఓ కీలక ప్రకటన చేసింది. తైవాన్‌కు 385 మిలియన్ డాలర్ల ఆయుధాలను విక్రయించేందుకు అమెరికా ఆమోదం తెలిపింది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ మరికొన్ని రోజుల్లో అధికారం నుంచి వైదొలుగుతున్న నేపథ్యంలో ఈమేరకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. తైవాన్ అధ్యక్షుడు లాయ్ చింగ్–తె పసిఫిక్ దేశాల పర్యటనకు సిద్ధమవుతున్న నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఎఫ్–16 జెట్‌లు, రాడార్‌ల విడిభాగాలతో సహా 385 మిలియన్ డాలర్ల ఆయుధాలను తైవాన్‌కు విక్రయించాలని అమెరికా నిర్ణయించినట్లు పెంటగాన్ పేర్కొంది. మరోవైపు మొబైల్ సబ్‌స్క్రైబ్ ఎక్విప్‌మెంట్‌ను మెరుగుపరిచేందుకు 65 మిలియన్ డాలర్లను అదనంగా అందించనున్నట్లు వెల్లడించింది. ఇక, ఈ విక్రయాలకు సంబంధించిన ఒప్పందాలు ఒక నెలలో పూర్తవుతాయని తైవాన్ రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. చైనా నుంచి తైవాన్ తనను తాను రక్షించుకునే మార్గాల్లో సాయం అందించేందుకు అమెరికా కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. గత నెలలో 2 బిలియన్ డాలర్ల ఆయుధాల విక్రయానికి అమెరికా ఆమోదించిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే మరో ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. తైవాన్ తమ దేశంలో భాగమని బీజింగ్ ఎప్పటినుంచో వాదిస్తోంది. ఈ క్రమంలోనే ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇటీవల తమ దేశం చుట్టూ 153 చైనా సైనిక విమానాలు చక్కర్లు కొట్టినట్లు తైవాన్ రక్షణశాఖ వెల్లడించింది. అదే సమయంలో యుద్ధానికి సిద్ధం కావాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తమ దళాలకు పిలుపునిచ్చినట్లు అక్కడి మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే తైవాన్‌కు భారీ మొత్తంలో ఆయుధాల విక్రయానికి అగ్రరాజ్యం ఆమోదం తెలుపుతుండటం గమనార్హం.

## అమెరికాకు చెందిన మోడల్ కుటుంబం కిడ్నాప్..!



వాషింగ్టన్: అమెరికాకు చెందిన ఓ మోడల్‌ను, ఆమె కుటుంబసభ్యులను కొందరు దుండగులు కిడ్నాప్ చేశారు. బ్రెజిల్‌లోని ఓ రెస్టారంట్‌లో కిడ్నాప్ చేసిన దుండగులు దాదాపు 12 గంటలపాటు ఓ గుడిసెలో బంధించినట్లు తెలుస్తోంది. ఈమేరకు అక్కడి వార్తా పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. బ్రెజిల్‌కు చెందిన లియా కర్టిస్ ప్రస్తుతం తన భర్త హెన్రిక్ జెండ్రే, ఇద్దరు పిల్లలతో న్యూయార్క్‌లో నివాసముంటున్నారు. ఈనెల 27న తన కుటుంబంతో కలిసి బ్రెజిల్‌లోని సావో పాలోలోని ఓ రెస్టారంట్లో ఉండగా.. కొందరు దుండగులు అకస్మాత్తుగా దాడి చేశారు. ఈనేపథ్యంలోనే గన్‌తో బెదిరించి ఆమెను, ఆమె భర్త, వారి 11 ఏళ్ల కుమార్తెని కిడ్నాప్ చేశారు. అనంతరం వారిని బ్రెసిలాండియాలోని ఓ గుడిసెలో బంధించారు. ఈక్రమంలో వారి బ్యాంకు అకౌంట్ల నుంచి డబ్బులు బదిలీ చేయాలని దుండగులు బెదిరింపులకు పాల్పడ్డారు. అయితే, మోడల్ పెద్ద కుమార్తె తల్లిదండ్రులు ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపుచర్యలు చేపట్టారు. అయితే, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేలోపే దుండగులు వారిని విడిచిపెట్టి పరారయ్యారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లియా కర్టిస్ 1993లో మోడల్ ఆఫ్‌ది వరల్డ్ పోటీలో బ్రెజిలియన్ ఫైనల్‌గా నిలిచారు. మేరీ క్లైర్, కాస్మోపాలిటన్ వంటి ప్రఖ్యాత ఫ్యాషన్ మ్యాగజైన్‌లలో ఆమె ఫొటోను కవర్ పేజీలో ప్రచురించారు.

## మీ అనుమానాలు వింటాం.. వచ్చి చెప్పండి కాంగ్రెస్‌కు ఈసీ పిలుపు



దిల్లీ: మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అనుమానాలు వ్యక్తంచేస్తోన్న సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఈసీ స్పందించింది. ఆ అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు డిసెంబరు 3న కాంగ్రెస్ ప్రతినిధులు రావాలని ఆహ్వానించింది. "ఎన్నికలు ప్రతి దశలోనూ పారదర్శకంగా జరిగాయి. వారి చట్టపరమైన ఆందోళనలను మేం పరిశీలిస్తాం. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల బృందం అనుమానాలు విన్న తర్వాత రాతపూర్వక సమాధానం ఇస్తాం" అంటూ హస్తం పార్టీ బృందాన్ని ఈసీ ఆహ్వానించింది. మహారాష్ట్ర ఎన్నికల్లో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. వ్యక్తిగతంగా హాజరై తమ అనుమానాలు తెలియజేస్తామని కోరింది. ఈక్రమంలోనే ఈసీ నుంచి పిలుపు వచ్చింది. ఇటీవల వెల్లడైన మహా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి భారీ విజయాన్ని సాధించింది. భాజపా 132 సీట్లు సొంతం చేసుకోగా.. శిందే శివసేనకు 57, అజిత్ పవార్ ఎన్సీపీకి 41 సీట్లు దక్కాయి. విపక్ష మహావికాస్ అఘాడీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. కాంగ్రెస్‌కు కేవలం 16 సీట్లు దక్కగా.. శివసేన(యూబీటీ) 20, ఎన్సీపీ(ఎస్పీ) 10 స్థానాలు సొంతం చేసుకుంది.

## బంగ్లాదేశ్‌లో 17 ఇస్కాన్ బ్యాంక్ అకౌంట్లు సీజ్

ఢాకా: ఇస్కాన్‌తో లింకున్న 17 అకౌంట్లను 30 రోజుల పాటు ఫ్రీజ్ చేయాలని బంగ్లాదేశ్ అధికారులు ఆదేశించారు. మాజీ సభ్యుడు చిన్మయ్ కృష్ణదాస్‌ను దేశద్రోహం కింద అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సియస్‌నెస్‌ను బ్యాన్ చేయాలని దాఖలైన పిటీషన్‌ను బంగ్లాదేశ్ హైకోర్టు కొట్టివేసింది. ఇస్కాన్‌కు చెందిన బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేయాలని కోరుతూ వివిధ బ్యాంకులను బంగ్లాదేశ్ ఫైనాన్సియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ ఆదేశించింది. అక్టోబర్ 30వ తేదీన కృష్ణదాస్‌తో పాటు మరో 19 మందిపై చాటోగ్రామ్ కొత్వాల్ పోలీసు స్టేషన్‌లో దేశద్రోహం కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. చాటోగ్రామ్ మార్కెట్ ప్రాంతంలో హిందువులు ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో బంగ్లాదేశ్ జాతీయ జెండాను అవమానించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఢాకాలోని హజ్రత్ షాజలాల్ ఎయిర్‌పోర్టులో దాస్‌ను అరెస్టు చేశారు. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు.

## దిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం.. పడిపోయిన ఉష్ణోగ్రతలు



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతోంది. దీనికి తోడు ఉష్ణోగ్రతలు కూడా పడిపోయాయి. దీంతో చలి తీవ్రతకు దిల్లీ వాసులు గజగజ వణికిపోతున్నారు. వరుసగా మూడోరోజు దిల్లీలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవాళ 9.8 డిగ్రీల సెల్సియస్‌తో ఈ సీజన్‌లో రెండో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఢిల్లీలో గాలినాణ్యత చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 349గా నమోదైంది. అలిపూర్‌లో 351, బురారీ క్రాసింగ్ వద్ద 351, డీటీయూ వద్ద 377, ఐటీవో ప్రాంతంలో 328గా ఏక్యూఐ లెవల్స్ నమోదయ్యాయి. వాయు కాలుష్యంతోపాటు ఢిల్లీని పొగమంచు కమ్మేసింది. కన్నాట్ ప్రాంతం, ఇండియా గేట్, ఆనంద్ విహార్ ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ఇద్దరు గగనయాత్రికుల ప్రాథమిక శిక్షణ పూర్తి : ఇస్రో



బెంగుళూరు: అమెరికా అంతరిక్ష శిక్షణా కేంద్రం నాసా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ఆధ్వర్యంలో.. ఇద్దరు భారతీయ వ్యోమగాములు అమెరికాలో శిక్షణ పొందుతున్నారు. అయితే ఆ ఇద్దరికి చెందిన ప్రాథమిక శిక్షణ పూర్తి అయినట్లు ఇస్రో ప్రకటించింది. ప్రైమ్ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, బ్యాకప్ గ్రూపు కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణ నాయర్ .. అమెరికాలో శిక్షణ పొందుతున్నారు. ఏక్సియమ్ మిషన్ 4 కోసం ఈ ఏడాది ఆగస్టు నుంచి వాళ్లు శిక్షణలో ఉన్నట్లు ఇస్రో తెలిపింది. ఇద్దరు గగనయాత్రికుల ప్రాథమిక శిక్షణ విజయవంతంగా పూర్తి అయినట్లు ఇస్రో పేర్కొన్నది. ఆ శిక్షణ సమయంలో.. మిషన్ సంబంధిత గ్రౌండ్ ఫెసిలిటీ టూర్స్, మిషన్ లాంచ్ ఫేస్, స్పేస్‌ఎక్స్ సూట్ ఫిక్స్ చెక్స్, ఫుడ్ ఆప్షన్స్ గురించి శిక్షణ తీసుకున్నారు. స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ గురించి కూడా భారతీయ వ్యోమగాములు శిక్షణ పొందారు. అంతరిక్షంలో ఏర్పడే అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై తొలి దశ శిక్షణలో తెలిపారు

# ఏక్‌నాథ్ శిందేను పక్కనబెట్టే ప్రయత్నాలు శివసేన సంచలన ఆరోపణలు



ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన మహాయుతి కూటమి ప్రభుత్వ ఏర్పాటుపై మాత్రం ఏకాభిప్రాయానికి రాలేకపోతోంది. తదుపరి సీఎం, శాఖల కేటాయింపులపై పార్టీల మధ్య చర్చలు ఇంకా కొలిక్కి రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. మరోవైపు, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే .. కూటమి ముఖ్యనేతల భేటీని రద్దు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల వేళ శివసేన నేత సంజయ్ శిర్సాట్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వంలో శిందేను పక్కనబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. "శిందే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం వల్ల ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రయోజనం చేకూరింది. కొన్ని పథకాలకు ఎన్సీపీ అభ్యంతరం చెప్పినప్పటికీ శిందే వాటిపై ముందుకెళ్లారు. అవన్నీ ఎన్నికల్లో కూటమికి ఓట్లు కురిపించినవే. సాధారణంగా హోంశాఖను డిప్యూటీ సీఎంకే ఇస్తారు. ఇప్పుడు భాజపా ముఖ్యమంత్రి పదవి తీసుకుంటే.. హోంశాఖను శివసేనకు ఇవ్వాలి. అలా కాదని సీఎం వద్దే ఉంచుకోవడం సరికాదు. కొత్త ప్రభుత్వంలో శిందేకు కీలక శాఖలు ఇవ్వకుండా పక్కనబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది" అని సంజయ్ శిర్సాట్ ఆరోపించారు.

## వారణాసి రైల్వేస్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం.. 200 వాహనాలు దగ్ధం



వారణాసి: ఉత్తరప్రదేశ్ లోని వారణాసి రైల్వేస్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 200 వాహనాలు కాలి బూడిదయ్యాయి. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వారణాసి రైల్వేస్టేషన్‌లో మంటలు చెలరేగినట్లు సమాచారం అందింది. వెంటనే జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులతో పాటు 12 ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశాయి. దాదాపు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో దాదాపు 200 ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. దగ్ధమైన వాహనాల్లో రైల్వే అధికారులకు చెందినవే ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అదానీ వ్యవహారం.. విదేశాంగ శాఖ చెప్పింది కరెక్టే: కాంగ్రెస్ వ్యంగ్యాస్త్రాలు



దిల్లీ: అదానీ,దాని అనుబంధ సంస్థలు.. సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు పెద్దఎత్తున లంచాలు ఆఫర్ చేశారన్న ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదవడం ఇటీవల సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఆ వ్యవహారంపై భారత విదేశాంగ శాఖ నుంచి వచ్చిన స్పందనపై కాంగ్రెస్ విమర్శలు చేసింది. గురువారం విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ.. 'ఇది ప్రైవేటు సంస్థలు, కొంతమంది వ్యక్తులు, అమెరికా న్యాయశాఖకు సంబంధించిన అంశం. ఇటువంటి కేసుల్లో అనుసరించాల్సిన విధానాలు, చట్టపరమైన మార్గాలు స్పష్టంగా ఉన్నాయి. అవి వాటిని అనుసరిస్తాయని విశ్వసిస్తున్నాం. ఇప్పటివరకు భారత సర్కారుకు ఎటువంటి సంబంధం లేని ఈ అంశంపై అమెరికా ప్రభుత్వంతో ఎటువంటి చర్చలు జరపలేదు" అని తెలిపారు. అలాగే అదానీ కేసులో భారత్‌కు అమెరికా సమన్లు లేదా వారెంటు ఇచ్చిందా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. భారత్‌కు అటువంటి విజ్ఞప్తి ఏదీ రాలేదన్నారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు స్పందించారు. "అదానీ గ్రూప్ వ్యవహారంలో అమెరికా దర్యాప్తులో భారత ప్రభుత్వం భాగం కాదని విదేశాంగ శాఖ ప్రతినిధి చాలా స్పష్టంగా చెప్పారు. ఈ ప్రభుత్వం తనకు తాను దర్యాప్తులో ఎలా భాగం అవుతుందిలే..?" అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రభుత్వంపైనే విమర్శలు వచ్చాయనే ఉద్దేశంలో ఈ విమర్శలు చేశారు.

## ఎంపీ హెూదాలో.. తొలిసారి వయనాడ్‌కు ప్రియాంక గాంధీ



వయనాడ్: కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవలే కేరళలోని వయనాడ్ స్థానానికి జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించి పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు. రెండు రోజుల క్రితం ఎంపీగా ప్రమాణ స్వీకారం కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ హెూదాలో ప్రియాంక తొలిసారి తన నియోజకవర్గం వయనాడ్‌కు వెళ్లారు. సోదరుడు రాహుల్ గాంధీ తో కలిసి శనివారం ఉదయం కేరళ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అక్కడ ఘన స్వాగతం లభించింది. శనివారంవయనాడ్‌లో నిర్వహించిన పబ్లిక్ మీటింగ్‌లో ప్రియాంక పాల్గొని ప్రసంగించనున్నారు.

# బియ్యం అక్రమ రవాణా అంశాన్ని పవన్ సీరియస్‌గా తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాం

## ఎంపీ పురందేశ్వరి



**విశ్వంభర, అమరావతి:** బియ్యం అక్రమ రవాణాపై తనిఖీలు జరుగుతున్నాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిఅన్నారు. అనేక సందర్భాల్లో బీజేపీ ఈ అంశంపై పోరాడుతూనే ఉందన్నారు. ఈవిషయాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాకినాడ పోర్టును కేంద్రంగా చేసుకొని విదేశాలకు అక్రమంగా బియ్యం రవాణా చేసిన అంశాన్ని తాము కూడా గతంలో ప్రశ్నించామని.. ఇప్పుడు ఆ ప్రాంతంలో పవన్ పర్యటన ద్వారా తమ వాదనకు బలం చేకూరిందని చెప్పారు.రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వివిధ ప్రాంతాల్లో చేసిన తనిఖీల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా, గోదాముల్లో నిల్వలు బయటపడ్డాయన్నారు. ఇవన్నీ కాకినాడ పోర్టు నుంచి నౌకల ద్వారా తరలిస్తున్నట్లు గుర్తించారని చెప్పారు. గత ప్రభుత్వంతో, ఆ పార్టీతో సంబంధం ఉన్న నాయకుల పేర్లు.. విదేశాలకు బియ్యం అక్రమంగా తరలించడంతో బయటకొచ్చాయన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలపై బీజేపీ గళం వినిపించిందన్నారు. వైఎస్సార్ జిల్లాలోని ఆర్టీపీపీ బూడిద తరలింపుపై జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి వర్గీయుల మధ్య తలెత్తిన వివాదం గురించి పురందేశ్వరిని మీడియా ప్రశ్నించింది. దీంతో ఇప్పటికే సీఎం చంద్రబాబు వారిద్దరినీ పిలిచారని.. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సీఎంకు తన వివరణను ఇచ్చారని చెప్పారు. ఇది ఆ ఇద్దరి నాయకుల మధ్య వ్యాపార సంబంధ అంశమన్నారు. రాష్ట్రానికి తీసుకురావాల్సిన నిధుల గురించి కేంద్రంతో చర్చిస్తున్నామని.. పార్లమెంటు సమావేశాల్లోనే పలు అభివృద్ధి అంశాలపైనా మాట్లాడతామని చెప్పారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాజమహేంద్రవరం నియోజకవర్గానికి రూ.98 కోట్లను అఖండగోదావరి అభివృద్ధికి కేటాయించిందని అన్నారు.

# దేశంలో పింఛను ఎక్కువగా ఇచ్చే రాష్ట్రం మనదే: సీఎం చంద్రబాబు



నేమకల్లు: అణగారిన వర్గాలకు అండగా ఉండటమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అనంతపురం జిల్లా నేమకల్లులో పింఛన్ల పంపిణీ అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో సీఎం ప్రసంగించారు. రాష్ట్రంలో 64లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. "దేశంలో పింఛను ఎక్కువగా ఇచ్చే రాష్ట్రం మనదే. పింఛన్ల కింద ఐదు నెలల్లో రూ.18వేల కోట్లు ఇచ్చాం. పెంచిన పింఛన్లు ఏప్రిల్ నుంచి ఇచ్చాం. పింఛను 3 నెలలకోసారి తీసుకునే సౌకర్యం కల్పించాం. లబ్ధిదారుల్లో కూలీలు, కార్మికులు ఉన్నారనే ఇలా ఏర్పాటు చేశాం. ప్రజల్లో ఆనందం శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నా. అనంతపురం జిల్లా అంటే నాకు ప్రత్యేక అభిమానం. రాయదుర్గం వెనుకబడిన ప్రాంతం. ఈ నియోజకవర్గం ఏడారిగా మారకుండా చర్యలు తీసుకున్నాం. రాయదుర్గం ప్రజల్లో వెలుగులు నింపే బాధ్యత తీసుకుంటాం. హంద్రీనీవాపై రూ.4,500 కోట్లు ఖర్చు చేశాం. రాయలసీమలోని ప్రాజెక్టులకు రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టాం. ఇక్కడున్న నేమకల్లు ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత మాది. రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని హామీ ఇచ్చా" అని చంద్రబాబు అన్నారు.

## నేమకల్లులో పింఛన్ల పంపిణీ.. పాల్గొన్న సీఎం చంద్రబాబు

**విశ్వంభర, నేమకల్లు:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం అనంతపురం జిల్లాలో పర్యటించారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు తమ గ్రామానికి రావడంతో నేమకల్లు వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

# స్థానికులకు డిసెంబర్ 3న తిరుమల శ్రీవారి దర్శనం



**విశ్వంభర, తిరుమల:** తిరుపతిలోని స్థానికులకు తిరుమల శ్రీనివాసుడి దర్శనాన్ని తితిదే ధర్మకర్తల మండలి ఇటీవల పునరుద్ధరించింది. ఈక్రమంలో డిసెంబర్ 1న తిరుపతి మహతి ఆడిటోరియంలో, తిరుమలలోని బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేయనున్నారు. తితిదే ధర్మకర్తలమండలి నవంబర్ 18న జరిగిన తొలి సమావేశంలో ప్రతి నెలా మొదటి మంగళ వారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డిసెంబర్ 3న (మొదటి మంగళవారం) స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు తితిదే ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమలకు చెందిన స్థానికులు తమ ఆధార్ ఒరిజినల్ కార్డును చూపించి టోకెన్లు పొందవచ్చని టీటీడీ తెలిపింది.

# నాగార్జున వర్సిటీలో విద్యార్థినుల ధర్నా.. పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశం



**విశ్వంభర, గుంటూరు:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వసతిగృహ మెస్‌లో వడ్డిస్తున్న ఆహారంలో తరచూ పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు శుక్రవారం రాత్రి నిరసనకు దిగారు. గత కొన్ని రోజులుగా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదనిఆరోపించారు. అధికారుల తీరును నిరసిస్తూ వసతిగృహం వద్ద ధర్నాకు దిగారు. ఈ ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విద్యార్థుల ఆరోపణలపై విద్యా శాఖ పూర్తి స్థాయి విచారణకు ఆదేశించింది. తప్పు తేలితే వెంటనే వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించింది. ఫుడ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

## అధికారుల దిద్దుబాటు చర్యలు..

ఈ ఘటనపై అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం అల్పాహారాన్ని రిజిస్ట్రార్ దగ్గరుండి చేయించారు. వసతి గృహంలో మెస్, కిచెన్‌ను గుంటూరు ఆర్డీవో పరిశీలించారు. వాటర్ ప్లాంట్ పరిశుభ్రంగా లేకపోవడంతో వార్డెన్‌పై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం మధ్యాహ్నం ముగ్గురు విద్యార్థినులు భోజనాలు చేస్తున్న సమయంలో సాంబారులో కప్ప రావడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే వార్డెన్ దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయం బయట చెబితే భవిష్యత్‌లో ఇబ్బంది పడతారని హెచ్చరించి వారికి టమాట కూర చేసి పెట్టారు. ఈ విషయం బయటకు రావడంతో విద్యార్థినులంతా తమ సొంత డబ్బులతో బయటే భోజనాలు చేశారు. శుక్రవారం సాయంత్రం, రాత్రి అల్పాహారం, భోజనంలో పురుగులు రావడంతో ఆగ్రహం చెందిన విద్యార్థినులు వసతి గృహం వద్ద రాత్రి ధర్నా చేశారు. తమ తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకుని ఫీజులు చెల్లిస్తున్నారని, శుభ్రమైన భోజనం పెట్టలేరా? అంటూ మండి పడ్డారు. విద్యార్థినులు బయటకు రాకుండా సెక్యూరిటీ సిబ్బంది గేట్లకు తాళాలు వేశారు. రాత్రి 11గంటలసమయంలో వారంతా ఒక్కసారిగాగేట్లు నెట్టుకుంటూ బయటకు వచ్చారు. వీసీ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మద్దతుగా విద్యార్థులు భారీ సంఖ్యలతో తరలివచ్చారు. తమకు న్యాయం చేయాలంటూ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంను చుట్టుముట్టారు.

# జగన్ ఏపీకి ఏం చేశారని శాలువా కప్పాలి? మంత్రి గొట్టిపాటి



**విశ్వంభర, అమరావతి:** వైకాపా అధినేత జగన్ ఏపీకి ఏం చేశారని శాలువా కప్పాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేసి తొమ్మిదిసార్లు కరెంటు ఛార్జీలు పెంచినందుకు, ఐదేళ్లు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినందుకు శాలువా కప్పాలా అని ప్రశ్నించారు. దేశంలోనే అవినీతి సామ్రాట్ అని జగన్‌కు సన్మానం చేయాలా? అంటూ విమర్శించారు. విద్యుత్ వ్యవస్థలను రూ.లక్ష కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని మంత్రి దుయ్యబట్టారు. జగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. జగన్ అవినీతి ఆనాడు రాష్ట్రం దాటితే.. ఇప్పుడు దేశం దాటిందన్నారు. రాష్ట్రం పరువు తీయడమే కాకుండా గొప్పలకు పోతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తప్పులను కప్పిపుచ్చుకొని అవినీతిని కూడా గొప్పగా చెప్పుకోవడం జగన్‌కే సాధ్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు.

# తిరుమలలో రాజకీయ ప్రసంగాలపై నిషేధం



**విశ్వంభర, తిరుమల:** శ్రీవారి ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని తితిదే నిర్ణయించింది. గత కొంతకాలంగా కొందరు రాజకీయ నాయకులు దర్శనానంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో తిరుమలలోఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోంది.ఈ నేపథ్యంలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ బోర్డు ఇటీవల తీర్మానించింది. దీన్ని తాజాగా అమలులోకితీసుకువచ్చింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

# పవన్ కల్యాణ్ ఫొటో ఎందుకు పెట్టరు? జగ్గయ్యపేటలో టీడీపీని నిలదీసిన వైసీపీ కౌన్సిలర్!



విశ్వంభర, జగ్గయ్యపేట: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోపై ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట కౌన్సిల్ సమావేశంలో వాడీవేడీ జరిగింది. కౌన్సిల్ హాలులో పవన్ కల్యాణ్ ఫొటో ఎందుకు పెట్టలేదని వైసీపీ కౌన్సిలర్ నిలదీశారు. దీంతో ఆయనపై టీడీపీ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగడంతో కౌన్సిల్ సమావేశం రసాభాసాగా మారింది.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జగ్గయ్యపేట కౌన్సిల్ హాలులో మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటోను తీసేసి, చంద్రబాబు నాయుడు ఫొటోను ఏర్పాటు చేశారు. కానీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోను మాత్రం పెట్టలేదు. దీనిపైనే ఇవాళ జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్ మనోహర్ ప్రశ్న లేవనెత్తాడు. దీనిపై టీడీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏ ఫొటో ఎప్పుడు ఏర్పాటు చేయాలో మేం చూసుకుంటాం.. మీకెందుకు అని వైసీపీ కౌన్సిలర్‌పై టీడీపీ కౌన్సిలర్లు ఎదురుదాడికి దిగారు. టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం నెలకొంది. సమావేశం రసాభాసగా మారుతుండటంతో మున్సిపల్ చైర్మన్ రాఘువేంద్ర మధ్యలోకి వచ్చారు. ప్రోటోకాల్ ప్రకారం ఫొటోలను ఏర్పాటు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఇరు పక్షాల నేతలు సైలెంట్ అయ్యారు.

# తిరుచానూరులో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు..

## ముత్యపుపందిరిపై ఆదిలక్ష్మి ఊరేగింపు



**తిరుపతి :** తిరుచానూరు కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మూడో రోజు ఉదయం పద్మావతి అమ్మవారి ముత్యపుపందిరి వాహనంపై ఆదిలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముత్యాలు అలిమేలుమంగకు అత్యంత ప్రీతిపాత్రమైనవని వేద పండితులు తెలిపారు. తెల్లని చల్లని ముత్యపు పందిరిపై ఊరేగుతున్న అలమేలుమంగను సేవించిన భక్తులకు తాపత్రయాలు తొలిగి, కైవల్యం చేకూరుతుందని విశ్వాసమని పేర్కొన్నారు. మధ్యాహ్నంశ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరగనుందని వెల్లడించారు. రాత్రి పద్మావతి అమ్మవారు సింహ వాహనంపై భక్తులను కటాక్షించనున్నారని వివరించారు.వాహనసేవల్లో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో జె శ్యామల రావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

## ముందు రోజే పింఛన్ల పండుగ

నందిగామ: కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడంలో ముందడుగు వేస్తోందని ఏపీ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను అందిస్తారు. అయితే డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదని ఈ నెల 30న పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు నందిగామ మున్సిపాలిటీలో తంగిరాల సౌమ్య ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు.

# అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి.. 'ఫెయింజల్' తుపానుపై చంద్రబాబు సమీక్ష




**విశ్వంభర, అమరావతి:** 'ఫెయింజల్' తుపానుపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష చేపట్టారు. విపత్తు నిర్వహణ శాఖ, కలెక్టర్లు, సీఎంవో, రియల్ టైం గవర్నెన్స్ అధికారులతో చర్చించారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం శుక్రవారం మధ్యాహ్నానికి తుపానుగా మారినట్లు భారత వాతావరణశాఖ పేర్కొంది. దీనికి ఫెయింజల్‌గా నామకరణం చేశారు. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ శనివారం మధ్యాహ్నానికి కారైకాల్ (పుదుచ్చేరి), మహాబలిపురం (తమిళనాడు) మధ్యలో తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. ఈ కారణంగా ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం ఇన్‌ఛార్జి డైరెక్టర్ కేవీఎస్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో ఆకస్మికంగా వరదలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు.

# నర్సింగ్ విద్యార్థుల బస్సులో మంటలు..



**విశ్వంభర, చెరుకుపల్లి:** బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడవల్లి వద్ద జాతీయ రహదారిపై రేపల్లె ఐఆర్‌ఈఎఫ్ విద్యా సంస్థలకు చెందిన బస్సు దగ్ధమైంది. నర్సింగ్ విద్యార్థులను తీసుకువెళ్తున్న కళాశాల బస్సులో విద్యుదాఘాతం కారణంగా మంటలు చెలరేగడంతో పూర్తిగా కాలిపోయింది. ముందుగానే పొగను గుర్తించి విద్యార్థులు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గుంటూరులో నర్సింగ్ విద్యార్థులకు పరీక్ష ఉండటంతో వారిని తీసుకువెళ్తుండగా బస్సు మార్గమధ్యలో ప్రమాదానికి గురైంది. స్థానికులు స్పందించి నీళ్లు చల్లారు. రేపల్లె అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

# బస్‌లో యాసిడ్ దాడి.. ముగ్గురు మహిళా ప్రయాణికులకు గాయాలు



**విశ్వంభర, అమరావతి :** ఏపీలో మహిళలపై దాడులు కలవరానికి గురి చేస్తున్నాయి. విశాఖపట్నంలో ఓ అగంతకుడు బస్సుపై యాసిడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటనలో ముగ్గురు మహిళా ప్రయాణికులకు గాయాలు కాగా వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.విశాఖ కంచెరపాలెం ఐటీఐ జంక్షన్ వద్ద నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సుపై గుర్తు తెలియని వ్యక్తి బస్ ఎక్కి తన వెంట తెచ్చుకున్న యాసిడ్‌తో మహిళలపై దాడి చేసి పారిపోయాడు. ఈ ఘటనలో ముగ్గురు మహిళా ప్రయాణికులపై పడిందని విశాఖ పోలీస్ కమిషనర్ తెలిపారు.గాయపడ్డ మహిళలను ఊర్వశి జంక్షన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నామని పేర్కొన్నారు. నిందితుడిని త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని తెలిపారు.

# విజయనగరం జిల్లాలో రోడ్డు ప్రమాదం.. నలుగురి మృతి



**విశ్వంభర, భోగాపురం :** విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి అవతలి రోడ్డు వైపు దూసుకెళ్లి బోల్తాపడింది. అటుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. . మృతులను శ్రీకాకుళానికి చెందిన ద్రవిడ కౌశిక్, వడ్డే అభినవ్, మణిమాల, వాహన డ్రైవర్ జయేశ్‌గా పోలీసులు గుర్తించారు.

ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో

## గుకేశ్, లిరెన్ మధ్య ఐదో గేమ్ కూడా డ్రా



**సింగపూర్:** ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో వరుసగా మరో గేమ్ డ్రాగా ముగిసింది. భారత యువ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ , డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్ మధ్య శనివారం జరిగిన ఐదో గేమ్ డ్రా అయింది. ఈ గేమ్‌లో గుకేశ్ తెల్లపావులతో ఆడాడు. నిన్న (శుక్రవారం) జరిగిన నాలుగో గేమ్ కూడా డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. ఈ ప్రపంచ టైటిల్ మ్యాచ్‌లో ఇప్పటివరకు ఐదు గేమ్‌లు జరగ్గా మూడు డ్రాగా ముగిశాయి. ఐదు రౌండ్‌లు పూర్తయ్యేసరికి గుకేశ్, లిరెన్ 2.5 - 2.5 పాయింట్లతో సమానంగా ఉన్నారు. ఈ పోటీలో ఇంకా 9 రౌండ్లు మిగిలి ఉన్నాయి. ఈ ప్రపంచ టైటిల్ మ్యాచ్‌లో 14 రౌండ్లు ఉంటాయి. మొదట 7.5 పాయింట్లకు చేరుకున్న ఆటగాడు విజేతగా నిలుస్తాడు. ఒక గేమ్‌లో విజయం సాధిస్తే ఒక పాయింట్ ఇస్తారు. గేమ్ డ్రా అయితే ఇద్దరు ఆటగాళ్లు పాయింట్‌ను పంచుకుంటారు.

## సయ్యద్ మోదీ అంతర్జాతీయ సూపర్ 300 టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లిన పి.వి.సింధు



**లక్నో:** సయ్యద్ మోదీ అంతర్జాతీయ సూపర్ 300 టోర్నీలో భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి. సింధు ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్‌లో సింధు 21-12, 21-9తో భారత్‌కే చెందిన 17 ఏళ్ల ఉన్నతి హుడాపై విజయం సాధించింది. సింధు దూకుడుగా ఆడటంతో ఈ మ్యాచ్ కేవలం 36 నిమిషాల్లోనే ముగిసింది. భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ తనీషా క్రాస్టో, ధ్రువ్ కపిల కూడా ఫైనల్ చేరుకున్నారు. ఐదో సీడ్ అయిన భారత ద్వయం 21-16, 21-15తో నాలుగో సీడ్ అయిన హాంగ్ జౌ, జియా యి యాంగ్ (చైనా) పై వరుస గేమ్‌ల్లో విజయం సాధించింది. ఈ మ్యాచ్ 42 నిమిషాలపాటు సాగింది.

అండర్-19 ఆసియా కప్‌లో

# టీమ్‌ఇండియా ఓటమి



**దుబాయ్:** అండర్-19 ఆసియా కప్‌లో టీమ్‌ఇండియాకు పేలవ ఆరంభం. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 282 పరుగుల భారీ లక్ష్యఛేదనలో టీమ్‌ఇండియా 237 పరుగులకు ఆలౌటైంది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ నిఖిల్ కుమార్ (67; 77 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే రాణించగా.. మిగతా ఆటగాళ్లు భారీ స్కోర్లు చేయలేకపోయారు. భారత బ్యాటర్లు ఏ దశలోనూ పెద్ద భాగస్వామ్యాలు నెలకొల్పలేదు. నిఖిల్ నిలకడగా ఆడినా అతడికి సరైన సహకారం అందలేదు. ఆయుష్ మాత్రే (20), సిద్ధార్థ్ (15), కెప్టెన్ మహ్మద్ అమన్ (16), కిరణ్ చోర్మలే (20), హర్వాన్ష్ సింగ్ (26) పరుగులు చేశారు. టెయిలెండర్లు యుధాజిత్ గుహ (12*), మహ్మద్ ఈనాన్ (30; 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) పదో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత్ ఓటమి అంతరాన్ని తగ్గించారు. పాక్ బౌలర్లలో అలీ రజా 3, అబ్దుల్ సుభాన్ 2, ఫహమ్-ఉల్-హక్ 2, నవీద్ అహ్మద్ ఖాన్, ఉస్మాన్ ఖాన్ చెరో వికెట్ పడగొట్టారు. గ్రూప్ ఎలో ఉన్న భారత్ తదుపరి మ్యాచ్‌లో (డిసెంబరు 2) జపాన్‌తో తలపడనుంది.

**షాజైబ్ ఖాన్ భారీ శతకం**

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్.. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. ఓపెనర్ షాజైబ్ ఖాన్(159; 147 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్స్‌లు) భారీ శతకంతో విరుచుకుపడ్డాడు. మరో ఓపెనర్ ఉస్మాన్ ఖాన్ (60; 94 బంతుల్లో 6 ఫోర్లు) అర్ధ శతకం సాధించాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 160 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. తర్వాత భారత బౌలర్లు పుంజుకుని వరుసగా వికెట్లు పడగొట్టారు. మహ్మద్ రియాజుల్లా (27) పరుగులు చేశాడు. హరూన్ అర్షద్ (3), ఫర్హాన్ యూసఫ్ (0), ఫహమ్-ఉల్-హక్ (4), సాద్ బేగ్ (4) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. భారత బౌలర్లలో సమర్థ్ నాగరాజ్ 3, ఆయుష్ మాత్రే 2 వికెట్లు.. కిరణ్, యుధజిత్ గుహ చెరో వికెట్ పడగొట్టారు.

# షాజైబ్ ఖాన్ భారీ శతకం..

## టీమ్‌ఇండియా టార్గెట్ 282

**దుబాయ్:** అండర్-19 ఆసియాకప్‌లో భాగంగా భారత్ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో తలపడుతోంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్.. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. ఓపెనర్ షాజైబ్ ఖాన్(159; 147 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్స్‌లు) భారీ శతకంతో విరుచుకుపడ్డాడు. మరో ఓపెనర్ ఉస్మాన్ ఖాన్ (60; 94 బంతుల్లో 6 ఫోర్లు) అర్ధ శతకం సాధించాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 160 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. తర్వాత భారత బౌలర్లు పుంజుకుని వరుసగా వికెట్లు పడగొట్టారు. మహ్మద్ రియాజుల్లా (27) పరుగులు చేశాడు. హరూన్ అర్షద్ (3), ఫర్హాన్ యూసఫ్ (0), ఫహమ్-ఉల్--హక్ (4), సాద్ బేగ్ (4) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. భారత బౌలర్లలో సమర్థ్ నాగరాజ్ 3, ఆయుష్ మాత్రే 2 వికెట్లు.. కిరణ్, యుధజిత్ గుహ చెరో వికెట్ పడగొట్టారు.



# నా ఆరాధ్య దైవం బ్రియన్ లారా

## వైభవ్ సూర్యవంశీ



**పాట్నా:** ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ జాక్‌పాట్ కొట్టిన సంగతి తెలిసిందే. కనీస ధర రూ.30 లక్షలతో వేలం బరిలో నిలిచిన ఈ బిహార్ కుర్రాడు రూ.1.10 కోట్ల ధర పలికాడు. దిల్లీతో పోటీపడి మరీ అతణ్ని రాజస్థాన్ రాయల్స్ దక్కించుకుంది. దీంతో క్రీడా వర్గాల్లో వైభవ్ పేరు మార్మోగుతోంది. ప్రస్తుతం ఈ కుర్రాడు అండర్-19 ఆసియా కప్‌లో ఆడుతున్నాడు. ఈ సందర్భంగా స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్‌తో మాట్లాడాడు. ''నా చుట్టూ ఏం జరుగుతోందనే దాన్ని పట్టించుకోవడం లేదు. కేవలం ఆటపైనే ఫోకస్ పెట్టాను. ఆసియా కప్‌పై దృష్టిసారించాలనుకుంటున్నా. బ్రియన్ లారా నా ఆరాధ్యదైవం. అతనిలా ఆడటానికి ప్రయత్నిస్తాను. ఆటపరంగా నా నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకుంటా'' అని సూర్యవంశీ తెలిపాడు. ఎన్నో అంచనాలు పెట్టుకుంటే.. ఒక్క పరుగుకే ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకున్న తర్వాత వైభవ్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అండర్-19 ఆసియా కప్‌లో భారీగా పరుగులు చేస్తాడని భారత అభిమానులు ఆశిస్తున్నారు. కానీ, తొలి మ్యాచ్‌లో అతను నిరాశపర్చాడు. పాకిస్థాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ ఒక్క పరుగుకే వెనుదిరిగాడు. అలీ రజా బౌలింగ్‌లో వికెట్‌కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు.

నా మద్దతు ఆర్సీబీకేనని

# విరాట్‌తో చెప్పా

**ఆస్ట్రేలియా మినిస్టర్ టిమ్ వాట్స్**




**సిడ్నీ:** ప్రైమ్ మినిస్టర్స్ XIతో భారత జట్టు వార్మప్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. అందులోభాగంగా శుక్రవారం ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్‌తో టీమ్‌ఇండియా క్రికెటర్లు సమావేశమైన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆస్ట్రేలియా మినిస్టర్ టిమ్ వాట్స్ విరాట్‌ను కలిసినప్పుడు సంభాషణను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. విరాట్‌పై ఉన్న గౌరవంతోనే ఐపీఎల్‌లో ఆర్సీబీకి తాను మద్దతుగా ఉంటానని వెల్లడించారు. ''భారత ఆటగాళ్లను కలవడం థ్రిల్లింగ్‌గా ఉంది. ప్రైమ్‌మినిస్టర్స్ XIతో టీమ్‌ఇండియా వార్మప్ మ్యాచ్ ఆడనుంది. ఈక్రమంలో వారితో భేటీ కావడం ఆనందంగా ఉంది. ఐపీఎల్‌లో నేను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ధన్యవాదాలు చెబుతున్నా. అందుకు కారణం విరాట్ కోహ్లీ ఉండటమే. నేను అతడికి మద్దతుగా నిలవడం ఆర్సీబీ ద్వారానే సాధ్యమైంది. అంతర్జాతీయ క్రికెటర్‌ను ఎవరిని కలిసినా సముచిత గౌరవం ఇస్తాం. కానీ, విరాట్‌కు ఆస్ట్రేలియా క్రికెట్ అభిమానుల మనసులో ప్రత్యేక స్థానం ఉంది. అతడు మా ఆస్ట్రేలియన్ క్రికెటర్‌లా ఆడతాడు'' అని టిమ్ వాట్స్ తెలిపారు.

**వార్మప్ మ్యాచ్ మరింత ఆలస్యం**

అడిలైడ్ టెస్టుకు ముందు డే/నైట్‌లో పింక్‌బాల్‌తో వార్మప్ మ్యాచ్ ఆడదామని భావించిన భారత్‌కు నిరాశే మిగిలేలా ఉంది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9.10 గంటలకు భారత్ - ఆసీస్ ప్రైమ్‌మినిస్టర్స్ XI జట్ల మధ్య మ్యాచ్ ఆరంభం కావాలి. కానీ, వర్షం పడుతుండటంతో కనీసం టాస్ కూడా వేయలేని పరిస్థితి ఎదురైంది. అంతకుముందు కాన్‌బెర్రా స్టేడియానికి వచ్చిన ప్రధాని ఆంథోని ఆల్బనీస్ భారత క్రికెటర్లతో ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. అందులో గులాబీ బంతిని ప్రధాని చేతబట్టుకొని ఉన్నారు.

# యాషెస్ సిరీస్ కంటే.. భారత్-ఆసీస్ పోరే పెద్దది

**ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్**



**సిడ్నీ:** ఆసీస్ ప్రైమ్‌మినిస్టర్స్ XIతో వార్మప్ మ్యాచ్ నేపథ్యంలో క్రికెటర్లను ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్ కలిశారు. భారత్, ఆసీస్ ప్రైమ్‌మినిస్టర్స్ జట్లతో మరోసారి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆటగాళ్లను ఉద్దేశించి ఆల్బనీస్ ప్రసంగించారు. ప్రపంచ క్రికెట్‌లో భారత్ -ఆసీస్ పోరే అతిపెద్దదని వ్యాఖ్యానించారు. యాషెస్ సిరీస్‌ను తలదన్నేలా ఉంటోందని తెలిపారు. 1992 తర్వాత భారత్ ఆసీస్ ఐదు టెస్టుల సిరీస్‌ను తొలిసారి ఆడటం బాగుందని పేర్కొన్నారు. ''ఇప్పుడు క్రికెట్‌ను చూసే వారి సంఖ్య బాగా పెరిగింది. ఐపీఎల్ మెగా లీగ్‌గా మారిపోయింది. నేను కూడా ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి అహ్మదాబాద్ స్టేడియంలో మ్యాచ్‌ను చూశా. టెస్టులను చూసేందుకూ ప్రేక్షకులు భారీగా వస్తున్నారు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లోనూ ఇరు జట్లూ ఆడాయి. లండన్‌లో మేం విజయం సాధించాం. కానీ, సిరీస్‌లో మాత్రం రెండు జట్ల మధ్య పోరాటం నువ్వా నేనా అన్నట్లుగా ఉంది. గతంలో మూడు టెస్టుల సిరీస్ మాత్రమే ఎక్కువగా జరిగేది. ఇప్పుడు ఐదు జరగనుండటం అనందంగా ఉంది. బాక్సింగ్ డే టెస్టు (డిసెంబర్ 26) మ్యాచ్ కోసం కనీసం లక్ష మంది వస్తారని అనుకుంటున్నా. ఈ విధంగానూ ఆస్ట్రేలియా పర్యటక రంగం బాగుంటుంది'' అని ఆల్బనీస్ తెలిపారు.

**తొలి రోజు వర్షార్పణం..**

అడిలైడ్ వేదికగా డిసెంబర్ 6 నుంచి డే/నైట్ పింక్‌బాల్ టెస్టు జరగనుంది. అందుకు సన్నద్ధత కోసం ప్రైమ్‌మినిస్టర్స్ XIతో వార్మప్ మ్యాచ్‌కు సిద్ధమైంది. కాన్‌బెర్రా వేదికగా ఈ మ్యాచ్ రెండు రోజులపాటు జరగాల్సింది. కానీ, వర్షం కారణంగా ఇవాళ ఆట మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. కనీసం టాస్ కూడా వేయని పరిస్థితి కావడం గమనార్హం. ఇక రెండో రోజు (ఆదివారం) ఆటైనా సాధ్యపడుతుందో? లేదో చూడాలి.

తరచూ వార్తల్లో కనిపించే

# కంపెనీగా రిలయన్స్

**దిల్లీ:** అపరకుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ గురించి తెలీని వారుండరు. ఆదాయాలు, లాభాలు, మార్కెట్ విలువ పరంగా దేశంలోనే అతిపెద్ద కార్పొరేట్ కంపెనీ ఇది. ఆ సంస్థకు సంబంధించి ఏ చిన్న వార్త అయినా ప్రజలకు ఆసక్తే. అందుకే మీడియాలోనూ ఆ కంపెనీ తరచూ కనిపిస్తూ ఉంటుంది. అందుకే ఆ సంస్థ 2024 ఏడాదికి గానూ విజికీ వెలువరించిన న్యూస్ స్కోర్ ర్యాంకింగుల్లో అగ్రస్థానంలో నిలిచింది. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ కంపెనీల కంటే ఎక్కువగా వార్తల్లో కనిపించిన కంపెనీగా రిలయన్స్ నిలిచిందని విజికీ పేర్కొంది.100 పాయింట్ల న్యూస్‌స్కోర్‌కు గానూ రిలయన్స్ 97.43 పాయింట్లు సాధించింది. 2023లో ఇదే సంస్థ 96.46 పాయింట్లు, 2022లో 92.56 పాయింట్లు, 2021లో 84.9 పాయింట్లు సాధించిందని విజికీ పేర్కొంది. ఏటికేడు పాయింట్ల పరంగా రిలయన్స్ వృద్ధి నమోదు చేస్తోందని తెలిపింది. వార్తల పరిమాణం, పతాక శీర్షికల ప్రాధాన్యం, పబ్లికేషన్ల సర్క్యులేషన్, పాఠకుల సంఖ్య ఈ స్కోరును లెక్కిస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, మెషిన్ లెర్నింగ్, మీడియా ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలను వినియోగించి సుమారు 4 లక్షల పబ్లికేషన్లను ఉపయోగించి ఈ స్కోర్‌ను లెక్కించినట్లు విజికీ తెలిపింది. రిలయన్స్ తర్వాత ఎక్కువ వార్తల్లో సంస్థగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెండో స్థానంలో నిలిచింది. ఈ సంస్థ 89.13 పాయింట్లు సాధించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (86.24), వన్97 కమ్యూనికేషన్స్ (84.63), ఐసీఐసీఐ బ్యాంక్ (84.33), జొమాటో (82.94) ఉన్నాయి. ఎయిర్‌టెల్ ఏడో స్థానంలో నిలవగా.. ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, టీసీఎస్, ఐటీసీ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ 40వ ర్యాంక్ సాధించింది. రిలయన్స్‌కున్న ప్రజా సంబంధాల సామర్థ్యం వల్లే మిగతా సంస్థలతో పోలిస్తే అందనంత దూరంలో ఉందని విజికీ తెలిపింది.



# సెటిల్‌మెంట్ తేదీ వరకు వడ్డీ చెల్లింపు



**ఈపీఎఫ్ఓ సీబీటీ నిర్ణయం**

**దిల్లీ:** ఈపీఎఫ్ సెటిల్‌మెంట్ సమయంలో చేసే వడ్డీ చెల్లింపులకు సంబంధించి ఈపీఎఫ్ఓ సెంట్రల్‌బోర్డు ఆఫ్ ట్రస్టీస్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై క్లెయిమ్ సెటిల్‌మెంట్ తేదీ వరకు చందాదారుడికి వడ్డీ చెల్లించాలని నిర్ణయించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. సెటిల్‌మెంట్ సమయంలో ఆ నెల 24వ తేదీ వరకు మాత్రమే వడ్డీ లెక్కించే విధానం ఉంది. ఇకపై సెటిల్‌మెంట్ తేదీ వరకు వడ్డీ చెల్లించనున్నారు. దీనివల్ల ఆర్థికంగా చందాదారుడికి ప్రయోజనం కలగడంతో పాటు ఫిర్యాదులు తగ్గతాయని సీబీటీ అభిప్రాయపడింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో దిల్లీలో జరిగిన 236 సీబీటీ సమావేశంలో ఈ నిర్ణయం వెలువడింది. దీంతో పాటు మరిన్ని నిర్ణయాలకు బోర్డు ఆమోదం తెలిపింది. ఆర్థిక భారం నుంచి తప్పించుకోవడానికి ఉద్యోగ భవిష్యనిధి సంస్థతో రిజిస్టర్ కాకపోవడం, ఉద్యోగుల నిధులను డిపాజిట్ చేయకుండా ఎగవేతలకు పాల్పడే సంస్థలకు క్షమాభిక్ష ప్రసాదించాలని సీబీటీ నిర్ణయించింది. ఇందుకోసం ఈపీఎఫ్ఓ అమ్నెస్టీ స్కీమ్-2024 తీసుకురావాలని కేంద్రానికి ప్రతిపాదించింది. ఆయా సంస్థలు ఎలాంటి పెనాల్టీలు ఎదుర్కోకుండా స్వచ్ఛందంగా ముందుకొచ్చి వివరాలు వెల్లడించే అవకాశం దీని ద్వారా కల్పించనున్నారు. ఆన్‌లైన్ డిక్లరేషన్ ద్వారా ఈ సదుపాయం కల్పించనున్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్స్ స్కీమ్ ప్రయోజనాలు అందించే ఉద్దేశంతో డిసెంబర్ నెలాఖరులో కేంద్రం ఈ స్కీమ్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఎంప్లాయీ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను సీబీడీటీ పొడిగించింది. 2024 ఏప్రిల్ 28 నుంచి అమలు చేస్తూ నిర్ణయం తీసుకుంది. చందాదారుడు మరణిస్తే ఈ స్కీమ్ కింద రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షలు బీమా వారి కుటుంబానికి అందిస్తారు. దేశంలో ఎక్కడి నుంచైనా పెన్షన్ పొందేందుకు ఉద్దేశించిన సెంట్రలైజ్డ్ పెన్షన్ పేమెంట్ సిస్టమ్ (సీపీపీఎస్)ను తొలిదశ విజయవంతం అయిన నేపథ్యంలో మరో 20 ప్రాంతీయ కార్యాలయాల్లో రెండో దశ చేపట్టనున్నారు. 2025 జనవరి 1 నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.




## ప్రత్యేక ఎఫ్‌డీల గడువును పొడిగించిన ఇండియన్ బ్యాంకు

**ముంబయి:** పబ్లిక్ సెక్టార్ బ్యాంకు అయిన ఇండియన్ బ్యాంకు..అధిక వడ్డీ రేట్లతో Ind Super 400 రోజుల ఎఫ్‌డీ, Ind Supreme 300 రోజుల ప్రత్యేక ఎఫ్‌డీలను గతంలో ప్రవేశపెట్టింది. ఈ ప్రత్యేక ఎఫ్‌డీలలో డిపాజిట్ చేయడానికి 2024, నవంబర్ 30 వరకు గడువు ఉండేది. అయితే, ఈ ఎఫ్‌డీల కాలవ్యవధిని ఇప్పుడు 2025, మార్చి 31 వరకు పొడిగించింది. ఇండియన్ బ్యాంకు వెబ్‌సైట్ ప్రకారం, Ind సూపర్ 400 రోజుల ప్రత్యేక ఎఫ్‌డీలో రూ.10 వేల నుంచి రూ.3 కోట్ల వరకు డిపాజిట్‌లపై సాధారణ డిపాజిట్‌దార్లకు 7.30%, సీనియర్ సిటిజన్లకు 7.80%, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.05% వడ్డీ పొందొచ్చు. ఇండ్ Supreme 300 రోజుల ప్రత్యేక ఎఫ్‌డీలో రూ.5 వేల నుంచి రూ.3 కోట్ల ఉన్న డిపాజిట్‌లపై సాధారణ డిపాజిటదార్లకు 7.05%, సీనియర్ సిటిజన్లకు 7.55%, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.80% వడ్డీ పొందొచ్చు.



# ఈ సరికొత్త పాత్ర అభిమానుల్ని మెప్పిస్తుందనే ఆశిస్తున్నా

కెరీర్‌లో వేసే ప్రతి అడుగు.. ఏదోకటి ప్రత్యేకమైనది సృష్టించుకోవడానికేనని అంటోంది కథానాయిక తమన్నా. వైవిధ్యమైన కథలతో, ప్రత్యేక గీతాలతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తున్న ఈ భామ.. మరోవైపు ఓటీటీ వేదికగా కూడా సత్తాచాటుతోంది. ఇటీవలే ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'సికందర్ కా ముఖద్దర్' అనే చిత్రం నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైంది. ఇందులో ఆమె వజ్రాలను దొంగిలించే పాత్రలో సరికొత్తగా కనిపిస్తూ ప్రశంసలు అందుకుంటోంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్నా.. తన సుదీర్ఘ సినీ ప్రయాణం, ఎంచుకునే పాత్రల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది .

**ఆ విషయంలో అదృష్టవంతురాలిని..**

''నా దృష్టిలో నీరజ్ పాండే ఒక పవర్‌హౌస్ డైరెక్టర్. ప్రతి విషయంలో చాలా స్పష్టంగా ఉంటాడు. ఆయన దర్శకత్వంలో నటించాలని చాలా మంది నటీనటులు ఎదురుచూస్తుంటారు. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. ఆయన 'సికందర్ కా ముఖద్దర్' చిత్రంతో నాలో ఉన్న ఓ కొత్త కోణాన్ని ప్రదర్శించే అవకాశం ఇచ్చారు. నా కెరీర్‌లో ఈ పాత్ర చాలా ప్రత్యేకం. డిజిటల్ ప్రపంచంలో నేను పోషించిన ఈ సరికొత్త పాత్ర అభిమానుల్ని మెప్పిస్తుందనే ఆశిస్తున్నా''.

**గొప్ప స్థాయికి నైపుణ్యాలే కీలకం..**

''నేను 15ఏళ్ల వయసు నుంచే పనిచేయడం ప్రారంభించాను. కెరీర్‌లో వేసే ప్రతి అడుగు.. ఏదోకటి ప్రత్యేకంగా సృష్టించుకోవడానికే ప్రయత్నించాను. ఒక నటిగా సుదీర్ఘమైన కెరీర్‌ను కలిగి ఉండటానికి ఏమి అవసరమో ఇన్నేళ్ల తర్వాత నేను అర్థం చేసుకున్నా. చిత్రపరిశ్రమలో గొప్ప స్థాయిలో ఉండటానికి భిన్నమైన నైపుణ్యం అవసరం. కేవలం మనల్ని గుర్తుంచుకోవడం కాదు. మన నటన, పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్మరణీయంగా గుర్తుండిపోవాలనే విషయాన్ని గ్రహించాను. అందుకే చిత్రపరిశ్రమలో ఏన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న నటీనటులను నేను అభినందిస్తున్నా. గౌరవిస్తున్నా. ఈ సుదీర్ఘ ప్రయాణానికి చాలా కృషి అవసరం.''

**తొలిసారి దొంగ పాత్రలో..**

''ప్రేక్షకుల అభిరుచికి దగ్గరగా ఉండాలని పాత్రల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తుంటాను. ఏదైనా స్క్రిప్ట్ విన్నప్పుడు ఆ కథలో నేను నటించగలనా? ఆ పాత్ర నాకు సరిపోతుందో లేదో అని చూసుకుంటాను. ఇప్పటి వరకు ఎన్నో భిన్నమైన పాత్రలతో తెరపై సందడి చేశా. కానీ దొంగ పాత్రలో నటించలేదు. ఆ కోరిక 'సికందర్ కా ముఖద్దర్'తో తీరింది. ఇందులో దర్శకుడు నీరజ్, నటులు అవినాశ్ తివారీ, జిమ్మీ షెర్గిల్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది''.

**పాత్రల నిడివితో అవసరం లేదు..**

''నా కెరీర్‌లో ఈ దశను ఆస్వాదిస్తున్నా. ఎందుకంటే పెద్దా చిన్నా అనే తేడా లేకుండా పాత్రల్ని ఎంచుకుంటూ వచ్చిన అవకాశాలతో ప్రేక్షకులను మెప్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. పాత్రల నిడివితో నాకు అవసరం లేదు. చాలా మంది దృష్టిలో నేను నటించే పాత్రలు చిన్నవే కావచ్చు. కానీ.. మీరు చేసే పనే అది చిన్నదా పెద్దదా అనేది నిర్ణయిస్తుంది. ప్రస్తుతం నేను ఆ దిశగానే అడుగులు వేస్తున్నా''.

# "నారి" సినిమా టైటిల్ పోస్టర్, గ్లింప్స్ రిలీజ్

## డిసెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్




ఆమని, వికాస్ వశిష్ఠ,మౌనిక రెడ్డి, ప్రగతి, కేదార్ శంకర్, ప్రమోదినీ తదితరులు కీలక పాత్రల్లో నటించిన సినిమా నారి. మహిళల్ని గౌరవించాలి, ఆడిపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి అనే కాన్సెప్ట్ తో దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. ప్రొడ్యూసర్ శ్రీమతి శశి వంటిపల్లి నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న నారి సినిమా డిసెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క ఈ సినిమా టైటిల్ పోస్టర్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగాస్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క మాట్లాడుతూ - మహిళలు ఎన్నో రంగాల్లో ఎదుగుతున్నారు. అయినా వారి పట్ల వివక్ష, చిన్నచూపు తగ్గడం లేదు. సమాజ నిర్మాతలు మహిళల అనే నిజాన్ని మనమంతా గుర్తుపెట్టుకోవాలి. ఆడ పిల్లలు ఎదిగేందుకు ప్రతి ఒక్కరు తోడ్పాడు అందించాలి. మహిళల్ని గౌరవించాలి. ఇలాంటి గొప్ప కాన్సెప్ట్ తో నారి సినిమా చేసిన సూర్య వంటిపల్లి గారికి అభినందనలు. ఈ సినిమా పోస్టర్, గ్లింప్స్ నా చేతుల మీదుగా విడుదల చేసుకోవడం సంతోషంగా ఉంది. నారి సినిమా పెద్ద విజయాన్ని సాధించాలి. మహిళల గురించి వారి మరిన్ని మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. దర్శకుడు సూర్య వంటిపల్లి మాట్లాడుతూ - ఈ రోజు మా నారి సినిమా టైటిల్ పోస్టర్, గ్లింప్స్ రిలీజ్ చేసిన మంత్రి సీతక్క గారికి కృతజ్ఞతలు. ఆమె ఎంతో బిజీగా ఉన్నా మా మూవీ కాన్సెప్ట్ విని టైమ్ ఇచ్చారు. ఇటీవల ఓ స్కూల్ అమ్మాయి తన టీచర్ తో అమ్మాయిగా తన కష్టాలు చెబుతూ తాను మగవాడిగా మారాలని అనుకుంటున్నట్లు చెప్పిన వీడియో ఒకటి బాగా వైరల్ అయ్యింది. ఆ సన్నివేశం మా నారి సినిమాలోనిది. ఆ అమ్మాయి నిత్యశ్రీ. మహిళల పట్ల మనం ఎలా వ్యవహరించాలి. వారికి ఎలా సపోర్ట్ చేయాలనే మంచి కాన్సెప్ట్ తో ఈ సినిమాను రూపొందించాను. డిసెంబర్ 25న మీ ముందుకు తీసుకొస్తున్నాం. ప్రతి మహిళ తమ ఇంట్లోని పురుషుడిని వెంట తీసుకెళ్లి ఈ సినిమాను చూపిస్తారని కోరుకుంటున్నా. అన్నారు. నటీనటులు - ఆమని, వికాస్ వశిష్ఠ, కార్తికేయ దేవ్, నిత్య శ్రీ, మౌనిక రెడ్డి, ప్రగతి, కేదార్ శంకర్, ప్రమోదినీ, ఛత్రపతి శేఖర్, నాగ మహేశ్, సునైన, రామచంద్ర, రాజశేఖర్, ఫణి, గీతాకృష్ణ రెడ్డి, ధృవన్ వర్మ, రాజమండ్రి శ్రీదేవి, సత్తన్న, వి. లోకేష్, నాగిరెడ్డి, అచ్యుత రామారావు, శేఖర్ నీలిశెట్టి, లడ్డు, గూడ రామకృష్ణ, భార్గవి, శ్రీవల్లి, సాయి రేణుక, గీత, మహేశ్, వినయ్, అఖిల్ యడవల్లి, తదితరులు ఉన్నారు.

# ఆర్‌సీ 16లో మున్నాభాయ్ 'దివ్యేందు'

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్, బుచ్చిబాబు సానా, ఎ.ఆర్.రెహమాన్, వెంకట సతీష్ కిలారు, వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కాంబో పాన్ ఇండియా మూవీ ఆర్‌సీ16లో బాలీవుడ్ యంగ్ సెన్సేషన్.. మున్నాభాయ్ 'దివ్యేందు'.

త్రిపుల్ ఆర్‌తో గ్లోబల్ సక్సెస్‌ను సాధించి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను, సినీ ప్రేక్షకులను మెప్పించిన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇప్పుడు తన ఆర్‌సీ16 సినిమా షూటింగ్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. రీసెంట్‌గానే ఈ సినిమా షూటింగ్‌ను మైసూర్‌లో ప్రారంభించారు. తొలి చిత్రం ఉప్పెనతో బ్లాక్ బస్టర్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించిన దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ సమర్పణలో ఈ భారీ పాన్ ఇండియా సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అనౌన్స్‌మెంట్ రోజు



నుంచి అంచనాలు పెంచుతూ వస్తోన్న ఈ సినిమాను భారీ స్థాయిలో హై టెక్నికల్ వేల్యూస్‌తో అన్‌కాంప్రమైజ్‌డ్‌గా రూపొందిస్తున్నారు మేకర్స్.

పాన్ ఇండియా సినిమాలోకి భారీ తారాగణం కూడా నటిస్తున్నారు. కరుణ చక్రవర్తి శివరాజ్‌కుమార్ ఈ చిత్రంతో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రలో మెప్పించబోతున్నారు. తాజాగా ఇప్పుడు బాలీవుడ్ యంగ్ సెన్సేషన్ దివ్యేందు ఇందులో కీలక పాత్రలో అలరించబోతున్నారు. మీర్జాపూర్‌లో మున్నాభాయ్ పాత్రలో తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన దివ్యేందు ఆర్‌సీ16తో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం విశేషం. అలాగే టాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ జగపతి బాబు ముఖ్య పాత్రలో మెప్పించనున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు దివ్యేందు పాత్రకు సంబంధించి స్పందిస్తూ తనకు ఆర్‌సీ16 ఎంతో ఇష్టమైన పాత్ర ఇదేనని పేర్కొంటూ తన లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మెలి తిప్పిన మీసం, రగ్డ్ లుక్‌తో దివ్యేందు సరికొత్త పాత్రలో మెప్పించబోతున్నారని స్పష్టమవుతుంది. RC16 చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ క్వీన్ జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా మెప్పించనున్నారు. ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందించనున్న ఈ చిత్రానికి అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఏగన్ ఏకాంబరం కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

# సుకుమార్ నన్ను స్టార్‌ను చేశారు

పుష్ప-2 ది రూల్ ఇప్పుడు భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రమిది. ఇండియాస్ బిగ్గెస్ట్ ఫిలింగా రూపొందిన ఈ చిత్రంలో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నట విశ్వరూపం చూడబోతున్నారు. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభ, ఆయన క్లాస్ టేకింగ్‌తో ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ చిత్రంగా నిలవబోతుంది. ప్రపంచ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో అత్యున్నతంగా హై బడ్జెట్‌తో నిర్మించారు. డిసెంబరు 5న చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. కాగా ఈ చిత్ర ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. అంతేకాదు ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి ఈవెంట్ సన్సేషన్ అవుతుంది. ఇటీవల బీహార్‌లోని పాట్నాలో జరిగిన పుష్ప-2 ట్రైలర్ లాంచ్ వేడుక ఇండియా మొత్తం హాట్‌టాపిక్‌గా నిలిచింది. చెన్నయ్‌లో జరిగిన వైల్డ్ ఫైర్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్‌గా నిలిచింది. కొచ్చిలో జరిగిన గ్రాండ్ ఈవెంట్ కూడా అక్కడ కిక్కిరిసిన అభిమానుల సమక్షంలో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. తాజాగా ముంబయ్‌లో 'పుష్ప-2' హీరో, హీరోయిన్ నిర్మాతలు సందడి చేశారు. అక్కడ గ్రాండ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు.




ఈ సందర్భంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మాట్లాడుతూ '' ఈ సినిమా విషయంలో నేను థాంక్స్ చెప్పుకోవాల్సింది నిర్మాతలకు.. వాళ్లు లేకుంటే, వాళ్ల సపోర్ట్ లేకుండా ఈ సినిమా సాధ్యపడేది కాదు. ఈ చిత్రాన్ని బాలీవుడ్‌లో విడుదల చేస్తున్న అనిల్ తడానిజీ, భరత్ భూషణ్‌లకు థ్యాంక్స్.. పుష్ప చిత్రాన్ని కోవిడ్ టైమ్‌లో చాలా ఛాలెంజ్‌లు ఫేస్ చేసి చేయాల్సి వచ్చింది. ఈ సందర్భంగా నా టెక్నిషియన్ల అందరికి కృతజ్ఞతలు. నా చిన్ననాటి స్నేహితుడు నా కెరీర్‌లో ఎన్నో సూపర్‌హిట్ సాంగ్స్ ఇచ్చిన దేవి శ్రీ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. త్వరలోనే పుష్ప-2 నుంచి మరో సూపర్ సాంగ్ రాబోతుంది. ఈ పాటతో దేవి మ్యాజిక్ మరో సారి తెలుస్తుంది. అందరి హృదయాలను హత్తుకునే పాట అది. ఫహాద్ ఫాజిల్‌తో పనిచేయడం ఎంతో గ్రేట్‌గా వుంది. శ్రీలీల, రష్మికలతో పనిచేయడం ఎంతో హ్యాపీ. గత నాలుగు సంవత్సరాలుగా రష్మికతో కలిసి పనిచేశాను. ఆమెతో వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్ ఎంతో ఎనర్జీ వస్తుంది. చాలా పాజిటివ్ ఎనర్జీ ఉన్న హీరోయిన్. ఈ ప్రపంచంలో ఇలాంటి అమ్మాయిలు కావాలి అనిపించేంతగా రష్మిక గొప్పతనం కనిపిస్తుంది. నా జర్నీలో దర్శకుడు సుకుమార్‌తో 20 ఏళ్ల ప్రయాణం మొదలైంది. పుష్ప ఈ రోజు నేను హీరోగా ఇలా వున్నానంటే ఆయనే కారణం నన్ను స్టార్‌ను చేసింది సుకుమారే. నా లైఫ్‌లో అత్యధిక భాగం.. హీరోగా నా ఎదుగుదల ఆయనకే చెందుతుంది. ఈ రోజు ఆయన రాలేదు కానీ ఈ రోజు కూడా చిన్న చిన్న మార్పుల కోసం సినిమాపై ఇంకా పనిచేస్తున్నాడు. ఈ సినిమా ఇంత డబ్బు వస్తుంది.. ఇంత పేరు వస్తుందని లెక్కలు వేసుకోని చేయలేదు. ప్రేక్షకులకు ఓ బెస్ట్ సినిమా ఇవ్వాలి. వాళ్లకు గొప్ప ఎక్స్‌పీరియన్స్ సినిమా ఇవ్వాలని వర్క్ చేశాం. ఐదు సంవత్సరాలు మా లైఫ్‌లో బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి ట్రై చేస్తున్నాం. బెస్ట్ సినిమా ఇస్తున్నాం. మేము పుష్ప పార్ట్-1 సాధారణ సినిమాగానే చేశాం. కానీ ప్రేక్షకలు తమ ఆదరణతో గొప్ప సినిమా చేశారు. ఈ రోజు పుష్ప-2 రూపంలో బిగ్గెస్ట్ ఇండియన్ సినిమా చేయడానికి కారణం మీ ఆదరణే. ఈ రోజు ప్రపంచంలోని ప్రతి దగ్గరి నుంచి, ప్రపంచంలో ప్రతి ఇండియన్, ప్రతి భాష వాళ్లు, ప్రతి రాష్ర్టంలోని వాళ్లు అందరూ కలిసి పుష్ప-2 విడుదలను సెలబ్రేట్ చేయడం ఎంతో ఆనందంగా ఉంది' అన్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ '' హ్యూజ్ రెస్పాన్స్. ఎక్కడి వెళ్లినా అనూహ్యమైన రెస్పాన్స్ వస్తుంది. వీ నెవర్ ఎక్స్‌పెక్టేటెడ్ .. ఇండియా మొత్తం ఎక్కడికి వెళ్లినా గొప్ప ఆదరణ లభిస్తుంది. సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా 12 వేలకు పైగా స్క్రీన్స్‌ల్లో సినిమాను విడుదల చేస్తున్నాం. హ్యాయెస్ట్ రిలీజ్ ఫర్ ఐమ్యాక్స్ వెర్షన్ ఫర్ ఇండియన్ ఫిల్మ్.. పుష్ప మాకు వెరీ స్పెషల్ సినిమా. ఈ సినిమా కోసం మూడు సంవత్సరాలు దర్శకుడు ఎంతో కష్టపడి పనిచేస్తున్నాడు. మెస్ట్ హార్డ్‌వర్కింగ్ హీరో. మాకు ఇలాంటి గొప్ప సినిమా ఇచ్చినందుకు దర్శకుడు, హీరోకు అనిల్ తడాని హిందీలో విడుదల చేస్తున్న భూషణ్ కుమార్ టీసీరిస్‌కు మా కృతజ్ఞతలు. ఈ సినిమా కోసం గత మూడు సంవత్సరాలు ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, టెక్నిషియన్స్ హార్డ్ వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రం కోసం దర్శకుడు సుకుమార్ రాత్రి పగలు తేడా లేకుండా పనిచేస్తున్నాను. ఇప్పుడు కూడా ఆయన బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వాలని వర్క్ చేస్తున్నారు.

ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతం ఇచ్చాడు. కూబా ఫోటోగ్రఫీ మిమ్ములను మెస్మరైజ్ చేస్తుంది'' అన్నారు. అల్లు అర్జున్ స్వాగ్..తో ఈసినిమా వైల్డ్ ఫైర్‌గా మారిందని ఏఏ ఫిలింస్ అధినేత అనిల్ తడాని తెలిపారు. మైత్రీ మూవీస్‌తో పుష్ప చిత్రంతో తమ అసోసియేషన్ స్టార్ట్ అయ్యిందని, పుష్ప-2తో తమ మైత్రీ మరో లెవల్‌కు వెళ్లిందని, సుకుమార్ లాంటి డేడికేటెడ్ దర్శకుడు ఈ సినిమాను అత్యంత భారీగా, అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాడు.న తప్పకుండా ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవుతుందని టీసీరిస్ అధినేత భూషణ్ కుమార్ తెలిపారు.

ఈ సినిమా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని, ఇరవై నాలుగు గంటలు ఈ సినిమాను ప్రదర్శించాల్సినంత క్రేజ్ వుందని, చిన్న పిల్లల నుంచి 94 సంవత్సరాల ఓల్డ్ మ్యాన్ కూడా ఈ సినిమా గురించి ఎదురుచూస్తున్నారని, ప్రపంచ మొత్తం ఇండియన్ సూపర్‌హీరో పుష్పరాజ్‌ను చూడడానికి ఎదురుచూస్తున్నారని ఎగ్జిబిటర్స్ శృతి అమర్ తెలిపారు.

**రష్మిక మందన్నా మాట్లాడుతూ '' ఐదు సంవత్సరాల ఈ ప్రయాణంలో ఎన్నో ఎమోషన్స్ వున్నాయి. పుష్ప దిరైజ్‌లో నా పై చిత్రీకరించిన తొలి సన్నివేశం నాకు ఇంకా గుర్తుంది. ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు అల్లు అర్జున్‌తో యాక్ట్ చేయడం అనగానే.. ఎలా రియాక్ట్ అవ్వాలో అర్థం కాలేదు. చాలా నెర్వస్ అయ్యాను. కానీ ఈ రోజు అల్లు అర్జున్ ఫ్యామిలీ మెంబర్ గా ఉన్నాను. లాట్ ఆఫ్ ఎమోషన్స్ ఈ సినిమా చిత్రీకరణలో వున్నాయి. ఈ ఐదు సంవత్సరాల ప్రయాణం ఎంతో బాండింగ్ ఏర్పడింది. డిసెంబర్ 5న మా చిత్రం వస్తుందని గర్వంగా చెబుతున్నాను. సుకుమార్ లాంటి జీనియస్ దర్శకుడుతో పనిచేయడం ఎంతో ప్రౌడ్‌గా ఉంది. అతను మేధస్సు మనలా సాధారణ వ్యక్తి లా ఆలోచించడు. ఆయన సెపరేట్ సెవన్ ఇయర్స్ పుష్ప ఈజ్ మై హోమ్ లా అనిపించింది. ఇలాంటి గొప్ప టీమ్‌తో ఎన్ని సార్లు అయినా పనిచేయడానికి రెడీగా ఉంటాను' అన్నారు.**



# 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్'గా నభా నటేష్

బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ నభా నటేష్ మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్' గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకున్నారు. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ చేతుల మీదుగా నభా ఈ అవార్డ్ స్వీకరించారు. గ్లామర్ తో పాటు పర్ ఫార్మెన్స్ తో మెప్పించగల హీరోయిన్ గా పేరున్న నభా నటేష్ కు ఈ అవార్డ్ వెల్ డిసర్వ్‌డ్ అని అనుకోవచ్చు. స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకున్న నభా నటేష్ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నభా లేటేస్ట్ గా తెలుగులో బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా మూవీస్ చేస్తోంది. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు మూవీలో నభా నటేష్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ లో ఉంది. అలాగే రీసెంట్ గా నాగబంధం అనే పాన్ ఇండియా మూవీని స్టార్ట్ చేసింది. ఈ రెండు చిత్రాలతో నభా నటేష్ మరోసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ ఆమె ఖాతాలో ఉన్నాయి.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com